Pubilshed from Kadapa

PRGI NO : APTEL/25/A1220

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




కడప KADAPA | సంపుటి : 03 | సంచిక : 18 | బుధవారం | అక్టోబర్ 14, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 03 | Issue No : 18 | Wednesday | 14 OCTOBER 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## ఏపీకి వర్ష సూచన..

### రానున్న మూడు రోజులు వానలు

» పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు » బంగాళాఖాతంలో ద్రోణి, ఈశాన్య రుతుపవనాల ప్రభావం » పిడుగులు పడతాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. బంగాళాఖాతంపై ఏర్పడిన ద్రోణితో పాటు ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు నమోదవుతాయని ఏపీఎస్డీఎంఏ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు.

2 లో..

# సమరానికి సిద్ధం...

» సీట్ల సర్దుబాటుపై తీవ్ర కసరత్తు.. » స్థానిక ఎన్నికల వేళ ఎన్డీయేలో జోరందుకున్న సీట్ల పంపకాల చర్చలు » ముందుగా జనసేనతో డీల్ ఖరారు చేసి, ఆపై బీజేపీతో చర్చించాలని చంద్రబాబు నిర్ణయం » తమ త్యాగాలకు గుర్తింపుగా తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరిన పవన్ » మంగళవారం రాత్రి సీఎం నివాసంలో టీడీపీ, జనసేన నేతల తుది భేటీ » నేడు నోటిఫికేషన్ వెలువడే అవకాశం

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి :

స్థానిక సమరం వేల కూటమి నేతలలో సీట్ల సర్దుబాటు పై చర్చల్లో నేతలు వేగం పెంచారు.అధికార ఎన్డీయే కూటమిలో సీట్ల పంపకాలపై మంతనాలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. మంగళవారం నాడు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతల మధ్య చర్చలు తారాస్థాయికి చేరాయి. కూటమిలోని భాగస్వామ్య పక్షాల మధ్య సీట్ల సర్దుబాటును సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నేడు ఎన్నికల షెడ్యూల్ వెలువడవచ్చన్న అంచనాల నేపథ్యంలో, ఆ లోపే పంపకాలను పూర్తి చేసి ఐక్యంగా బరిలోకి దిగాలని కూటమి భావిస్తోంది.



ఈ క్రమంలో భాగంగా నేడు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ముఖ్యమంత్రి చంద్రబాతో సమావేశమయ్యారు. రెండు రోజుల్లో వీరి మధ్య ఇది రెండో దఫా చర్చలు కావడం గమనార్హం. అయితే, బీజేపీతో చర్చలను కొలిక్కితెచ్చే ముందు, జనసేనకు కేటాయించాల్సిన సీట్లపై ఒక స్పష్టతకు రావాలని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే ఆయన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం, పల్లా శ్రీనివాసరావు, నిమ్మల రామానాయుడు నేరుగా జనసేన కార్యాలయానికి వెళ్లి ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో జనసేన తరపున మంత్రి నాదెండ్ల మనోహర్, వంశీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.తాజా సమాచారం ప్రకారం, మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో టీడీపీ, జనసేన నేతలు మరోసారి భేటీ కానున్నారు. ఈ సమావేశంలోనే సీట్ల సర్దుబాటుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యమైన నగరపాలక సంస్థల మేయర్ అభ్యర్థుల ఎంపికపైనా ఈ భేటీలో చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జనసేన,

- మిగతా 2లో..



ఓట్లతో పాటు ప్రజల పొదుపులను దోచుకుంటున్న

## మోడీ ప్రభుత్వం

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం కేవలం ఓట్లనే కాకుండా ప్రజల పొదుపు నగదును కూడా దోచుకుందని కాంగ్రెస్ మండిపడింది. అచ్చేదిన్ అంటూ హామీ ఇచ్చిన అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఓట్లతో పాటు ప్రజల పొదుపులను దోచుకుంటుందని కాంగ్రెస్ కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేష్ పేర్కొన్నారు.

- మిగతా 2లో..



జాతీయ జెండాను ఎగురవేయడాన్ని ఉల్లంఘనగా

## భావించేవారే దేశద్రోహులు

### కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నేత అభిజీత్ దీప్కే

న్యూఢిల్లీ : జంతర్ మంతర్‌లో జాతీయ జెండాను ఎగురవేయడాన్ని చట్ట ఉల్లంఘనగా భావించేవారే దేశద్రోహులని కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నేత అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. తీయ జెండాను ఎగురవేసినందుకు నిరసనకారులను అరెస్టు చేయడంపై ఢిల్లీ పోలీసుల చర్యలను ఖండించారు.

2 పేజీలో..

ముఖ్యమంత్రులు చంద్రబాబు-విజయ్

## భేటీ

» గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై చర్చ

» చెన్నై తాగునీటి అవసరాలు తీర్చాలని కోరిన తమిళనాడు సీఎం



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన తమిళనాడు ముఖ్యమంత్రి సి జోసెఫ్ విజయ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. మంగళవారం క్యాంప్ ఆఫీసుకు వచ్చిన సీఎం విజయ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు ముఖ్యమంత్రులు పలు అంశాలపై అధికారులతో కలిసి చర్చించారు. ప్రధానంగా గోదావరి-కావేరి నదుల అనుసంధానం ఆవశ్యకతను సీఎం చంద్రబాబు సమావేశంలో వివరించారు.

- మిగతా 2లో..




## గ్రామీణాభివృద్ధికి రహదారుల బలోపేతం కీలకం

### ఆత్మకూరులో రూ. 8.91 కోట్లతో నాలుగు లేన్స్ రహదారి అభివృద్ధి

» రహదారికి వాయుపుత్ర మార్గ్ గా నామకరణం » మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ గా ప్రారంభించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి :

గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆత్మకూరు ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ, ఎన్‌హెచ్-67 నుంచి ఆత్మకూరు బైపాస్ వరకు రూ. 8.91 కోట్ల వ్యయంతో నాలుగు లేన్స్ రహదారిని అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. మొత్తం 2.2 కిలోమీటర్ల మేర ఆధునిక హంగులతో రూపుదిద్దుకున్న ఈ రహదారికి వాయుపుత్ర మార్గ్ గా నామకరణం చేసినట్లు వెల్లడించారు. మంగళవారం మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి ఆత్మకూరు రహదారిని వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ...

2 లో..



అమ్మవారిని దర్శించుకున్న తమిళనాడు

## ముఖ్యమంత్రి విజయ్

### జగన్మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన తమిళనాడు సీఎం

» వేదాశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు అందజేసిన దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు. » సంప్రదాయ వస్త్రధారణతో విచ్చేసి భక్తులకు చేతులెత్తి అభివాదం చేసిన ముఖ్యమంత్రి

ప్రజాభూమి ప్రతినిధి, ఇంద్రకీలాద్రి : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మంగళవారం సాయంత్రం ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రికి విచ్చేసిన తమిళనాడు ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు, విజయవాడ పార్లమెంట్

2 పేజీలో..




## స్థానిక సంస్థల్లో బీసీలకు 40 శాతానికి పైగా ప్రాతినిధ్యం

» మంత్రి కొల్లు రవీంద్ర » బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారంటూ వైసీపీపై మంత్రి విమర్శలు » రిజర్వేషన్లతో పాటు పార్టీ టికెట్లతో 40 శాతం లక్ష్యం సాధిస్తామన్న కొల్లు రవీంద్ర » బీసీ నాయకత్వానికి రక్షణగా త్వరలో బీసీ రక్షణ చట్టం » గత ప్రభుత్వ నిర్ణయంతో 16,800 పదవులు కోల్పోయిన బీసీలు

2 పేజీలో..



## ఈసీ పదవులను కాంగ్రెస్ దుర్వినియోగం చేసింది

» పీయూష్ గోయల్ ఎన్నికల కమిషనర్లకు కాంగ్రెస్ రాజకీయ పదవులు కట్టబెట్టిందని ఆరోపణ » ఎంఎస్ గిల్ నియామకాలను 'బేరసారాలు'గా అభివర్ణించిన కేంద్ర మంత్రి » నవీన్ చావ్లా నియామకం వెనుక సోనియా గాంధీ పాత్రపై ప్రశ్నల వర్షం » చావ్లాను తొలగించాలన్న సీఈసీ అభ్యర్థనను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికల కమిషనర్ల కార్యాలయాన్ని కాంగ్రెస్ దుర్వినియోగం చేసిందని, పదవీ విరమణ చేసిన అధికారు లకు రాజకీయ పదవులను బహుమతులుగా కట్టబెట్టిందని మంగళవారం ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో రాజ్యాంగబద్ధమైన పదవుల్లో నియమితులైన పలువురు అధికారులు, తదనంతరం రాజకీయ లబ్ధి పొందారని ఆయన ఆరోపించారు.ఈ సందర్భంగా మాజీ ప్రధాన

2 పేజీలో..

ప్రజాభూమి



# సంపాదకీయం

## అప్రకటిత ఎమర్జెన్సీ!

ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అడుగులు దేశంలో అత్యయిక స్థితి వైపు పడుతున్నాయని తొలినాళ్లల్లోనే బిజెపి వృద్ధ నేత ఎల్‌కె అద్వానీ పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులు ఆ మాట అంటే విమర్శగా మోడీ గణాలు ఎదురుదాడి చేసే వీలుంటుంది. కానీ అద్వానీని తన రాజకీయ గురువుగా మోడీ చెప్పుకున్నందున ఆ నాటి నుంచే విశ్లేషకులు ఆలోచించసాగారు. నల్ల వ్యవసాయ చట్టాల రద్దు కోసం ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాదిపాటు రైతులు నిర్వహించిన ఆందోళన సమయంలో మోడీ ప్రభుత్వ అణచివేత ప్రజలకు అనుభవమైంది. జులై నెలలో ఢిల్లీ నడి వీధుల్లో విద్యార్థి, యువత నీట్ పరీక్షలో అవకతవకలకు బాధ్యత వహిస్తూ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో చేపట్టిన ఆందోళనల సమయంలో ప్రభుత్వ నిరంకుశత్వం తీవ్ర స్థాయికి చేరుకుంది. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోసం వామపక్షాలు, సిజెపి, కాంగ్రెస్, ఇండియా బ్లాక్ పార్టీలు, యువత దేశవ్యాప్తంగా కదం తొక్కడంతో మోడీ ప్రభుత్వం రాజధాని ఢిల్లీలో, బిజెపి, ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాల్లో ప్రయోగిస్తున్న నిర్బంధం ఎమర్జెన్సీని తలపిస్తోంది. మందస్తు అరెస్టులు, లాఠీఛార్జీలు, నేతల గృహ నిర్బంధాలు, అరెస్టులు, అప్రకటిత కర్ఫ్యూ, బారికేడ్లు, ప్రజా రవాణా నిలిపివేత, పౌరుల రాకపోకల కట్టడి, వేల సంఖ్యలో సాయుధ పోలీసుల మోహరింపు...కల్లోల ప్రాంతాలను మించిపోయాయి.సిఇసి రాజీనామా డిమాండ్‌తో విపక్ష ఎంపీల మార్చ్ సందర్భంగా చేపట్టిన పోలీస్ చర్యలపై అభ్యంతరాలు ఉండగా, జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) శనివారం పిలుపునివ్వగా, వామపక్షాలు, ఇతర విపక్షాలు మద్దతిచ్చాయి. ఆ సందర్భంగా ఢిల్లీ పోలీసులు అమలు చేసిన నిర్బంధ చర్యలు రాచరిక దేశాల్లోనూ కనిపించవు. మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు, బయటి ప్రాంతాల నుంచి ఢిల్లీ వచ్చే రైళ్లలో తనిఖీలు, సిసి కెమెరాలు, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం, రోడ్ల మధ్య సిమెంట్ దిమ్మల వంటి బారికేడ్లు, డ్రోన్లతో నిఘా, సోషల్ మీడియా, ఇంటర్నెట్ నిలుపుదల... చెప్పుకుంటూ పోతే ఎన్ని రకాల నిర్బంధ పద్ధతులున్నాయో అన్నింటినీ మోడీ ప్రభుత్వం ప్రయోగించింది. సిజెపి చీఫ్ అభిజీత్ దీప్కేని విమానంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిరసనలపై రాజ్యానికి ఇంతటి అసహనమేల? ఢిల్లీ కన్నాట్ ప్లేస్‌లో మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని వాహనంలోనే స్పృహ కోల్పోయేలా కొట్టడం ఆటవిక పాలనను తలపిస్తోంది. తాను పార్లమెంట్ సభ్యుడినని ఐడి కార్డు చూపించినా పారా మిలటరీ బలగాలు నిర్దాక్షిణ్యంగా కొట్టి రోడ్డుపక్కన పడేశారంటే ప్రభుత్వం ఎంత కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదో బోధ పడుతోంది. జర్నలిస్టులను, మహిళల్ని సైతం పోలీసులు కొట్టడం, అవమానించడం అమానుషం. ప్రజాస్వామ్యానికి నాల్గవ మూల స్తంభంగా చెప్పబడే మీడియా పట్ల మోడీ సర్కారు వైఖరి ఇదీ!పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఓటు చాలా కీలకమైనది. దేశంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. ఓటు హక్కును, తద్వారా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సింది ఎన్నికల కమిషన్. అవకతవకలకు పాల్పడ్డ సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, సమగ్ర ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్‌ఐఆర్)ను నిలిపివేయాలని, తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని ప్రతిపక్షాలు, సిజెపి, యువత డిమాండ్ చేస్తుండగా, మోడీ ప్రభుత్వం జ్ఞానేష్ కుమార్‌ను వెనకేసుకొస్తోంది. ఆయనకు మద్దతు నిలిచి ఆందోళనలను ఉక్కుపాదంతో అణచివేస్తోంది. ఓట్ చోర్‌ను కుర్చీ వదిలి పొమ్మంటే మోడీకెందుకు బాధ? జ్ఞానేష్‌ను ముందు పెట్టి ఓట్ల దొంగతనం చేయించింది మోడీ, ఆయన పార్టీ అని భావించాలి. ఢిల్లీ నడిబొడ్డునున్న జంతర్ మంతర్ ఒక చారిత్రక, ప్రాచీన ఖగోళ శాస్త్ర విజ్ఞానానికి సంబంధించిన ప్రదేశం. వందల ఏళ్ల క్రితం నిర్మితమైంది. స్వాతంత్య్రం వచ్చాక ముఖ్య పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతోంది. అలాగే ప్రజా పోరాటాలకూ వేదికగా ప్రసిద్ధి చెందింది. జంతర్ మంతర్ వద్ద ఆందోళనలను నిషేధిస్తూ మోడీ ప్రభుత్వం నిర్ణయించడం పరమ నిరంకుశత్వం. సుప్రీం కోర్టు నిరసనకారులను నిర్బంధించవద్దని, ప్రజా రవాణాను నిలిపివేయడం వంటి చర్యలతో సామాన్యుల రాకపోకలను అడ్డుకోవద్దని చెప్పినా చెవికెక్కించుకోలేదు.

## ఏపీకి వర్ష సూచన..

ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం, బుధవారం (అక్టోబర్ 14) పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖ, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలతో పాటు పోలవరం పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడతాయని పేర్కొన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున వర్షం సమయంలో చెట్లు, భారీ హోర్డింగుల కింద నిలబడవద్దని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే రైతులు, కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

## ఓట్లతో పాటు ప్రజల పొదుపులను దోచుకుంటున్న మోడీ ప్రభుత్వం

ప్రధాని తన సంచి (జోలె) తీసుకుని వెళ్లే సమయం ఆసన్నమైందని ఎద్దేవా చేశారు. ద్రవ్యోల్బణం పెరుగుతూనే ఉందని, ఓట్ల చోరీపై ప్రజల్లో ఆగ్రహం తీవ్రమవుతున్నా ప్రధాని మాత్రం మౌని బాబాలా ఉండిపోయారని పేర్కొన్నారు. ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం గత నెల 5.97శాతం నుండి ఉండగా, సెప్టెంబర్‌లో 7.74శాతానికి పెరిగినట్లు నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) గణాంకాలు వెల్లడించాయి. ఓట్ల చోరీ, నడ్డివిరుస్తున్న ద్రవ్యోల్బణం రెండూ వాస్తవాలేనని అన్నారు. ఆహార ద్రవ్యోల్బణం 7.74శాతానికి చేరిందని అంటే సుమారు ప్రతి ఆహార పదార్థపు ధర అత్యధిక స్థాయికి చేరిందని అన్నారు. ఉదాహరణకు, ఉల్లిపాయల ధరలు 108%, వెల్లుల్లి 55%, అల్లం 63%, మరియు నిమ్మకాయల ధరలు 36% పెరిగాయని జైరాం రమేష్ పేర్కొన్నారు.

## జాతీయ జెండాను ఎగురవేయడాన్ని ఉల్లంఘనగా భావించేవారే దేశద్రోహులు : దీప్కే

ఈ అరెస్టుల్లో చట్టబద్ధత, నైతికత ఏమిటని ప్రశ్నించారు. నిరసన ప్రదేశంగా జంతర్ మంతర్‌ను డీనోటిఫై చేసినంత మాత్రాన ప్రజల నిరసన హక్కును అణచివేయలేరని స్పష్టం చేశారు. నిరసన ప్రదేశంగా జంతర్ మంతర్‌ను డీనోటిఫై చేసిన నేపథ్యంలో, పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటి అక్కడికి ప్రవేశించేందుకు సిజెపి కార్యకర్తలు యత్నించారు. తెల్లవారుజామున జాతీయ జెండాలతో అక్కడికి చేరుకున్న అశుతోష్ రాంకా, సౌరబ్ దాస్, అజింక్య షిండే సహా పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిరసన ప్రారంభించిన కొద్దిసేపటికే భద్రతా సిబ్బంది వారిని అరెస్టు చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. జాతీయ జెండాను ఎగురవేయడం ఎప్పటి నుంచి చట్ట ఉల్లంఘనగా మారిందని దీప్కే నిలదీశారు. జంతర్ మంతర్‌లో జాతీయ జెండాను ఎగురవేయడం తప్పని భావించేవారే దేశద్రోహులని అన్నారు. జాతీయ జెండాను ఎగరవేసేందుకు యత్నించిన సౌరబ్ దాస్, అశుతోష్ రాంకా, అజింక్య షిండే తదితరులపై కేసులు నమోదు చేశారని అన్నారు. ఇప్పుడు మనం ఏ దేశంలో ఉన్నామని, ఇది ఎటువంటి పాలన అని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు వరకు ఆందోళనను కొనసాగిస్తామని దీప్కే ప్రకటించారు. తాము జంతర్‌మంతర్‌లో జాతీయ జెండాను ఎగరవేసి తీరుతామని స్పష్టం చేశారు.

# సమరానికి సిద్ధం...



బీజేపీలు తమ బలాబలాల ఆధారంగా ఆశిస్తున్న స్థానాల జాబితాను చంద్రబాబుకు అందజేశాయి.

పార్టీల గెలుపు అవకాశాలను బట్టి సీట్ల కేటాయింపు ఉంటుందని కూటమి వర్గాలు చెబుతున్నాయి. గత వారం కూడా చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య సీట్ల పంపకాలు, ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో సమన్వయం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చలు జరిగాయి.ఈ చర్చల నేపథ్యంలో,
అక్టోబర్ 11న పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కూటమి ఏర్పాటు, విజయం కోసం జనసేన, జనసైనికులు ఎన్నో త్యాగాలు చేశారని, ఆ త్యాగాలకు గుర్తింపుగా మిత్రధర్మాన్ని అనుసరించి స్థానిక సంస్థల్లో తమకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు. "2024 ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్తు కోసం పోరాడాం. ఇప్పుడు జరగబోయే స్థానిక ఎన్నికలు జనసైనికుల భవిష్యత్తుకు భరోసా ఇస్తాయని ఆశిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు.
2014లో కూడా జనసైనికులు త్యాగాలు చేశారని పవన్ తెలిపారు. "2014లో కూటమికి మద్దతుగా నిలిచినప్పుడు ఒక్క జనసైనికుడు కూడా పదవి ఆశించలేదు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని నిస్వార్థంగా పనిచేశారు. వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి పార్టీ కోసం, కూటమి కోసం ఎన్నో త్యాగాలు చేశారు" అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల ద్వారా, స్థానిక ఎన్నికల్లో తమ పార్టీ శ్రేణులకు న్యాయం జరగాలనే సంకేతాన్ని పవన్ బలంగా పంపారు. దీంతో సర్దుబాటు ప్రక్రియలో జనసేన డిమాండ్లకు ఎలాంటి ప్రాధాన్యం లభిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# గ్రామీణాభివృద్ధికి రహదారుల బలోపేతం కీలకం

"ఆత్మకూరు ప్రజల చిరకాల స్వప్నమైన చీఎ-67 నుంచి ఆత్మకూరు బైపాస్ వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు సాకారం కావడం ఎంతో సంతోషకరం.
ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతమిచ్చే లక్ష్యంతో మొత్తం రూ. 8.91 కోట్లతో ఈ అభివృద్ధి పనులు చేపట్టాం. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక విజ్ఞప్తి మేరకు చేపట్టిన ఈ పనుల్లో భాగంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ. 6.31 కోట్ల వ్యయంతో 2.2 కిలోమీటర్ల మేర నాలుగు లైన్ల రహదారిని విస్తరించాం. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధుల ద్వారా రూ.2.60 కోట్లతో సెంట్రల్ డివైడర్, వీధి దీపాలు, సుందరీకరణ తదితర పనులు చేపట్టనున్నాం.
ఆత్మకూరు పట్టణ ప్రజలు నిత్యం జాతీయ రహదారి ఎన్‌హెచ్-67కు చేరుకునేందుకు ఈ మార్గంపైనే ఆధారపడేవారు. ఇరుకైన రహదారి, గుంతల కారణంగా స్థానికులు, విద్యార్థులు, రైతులు రాకపోకల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టడంతో జాతీయ రహదారిని తలపించేలా నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ రహదారిని అభివృద్ధి చేశాం. ఈ రహదారి సమీపంలోని ఆలయంలో 50 అడుగుల ఎత్తైన ఆంజనేయస్వామి విగ్రహం కొలువై ఉంది. భక్తుల విశ్వాసానికి, ఆధ్యాత్మిక భావాలకు ప్రతీకగా నిలిచిన ఈ విగ్రహం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, రహదారికి వాయుపుత్ర మార్గ్ అని నామకరణం చేస్తున్నాం.




**పల్లె పండుగతో గ్రామీణ రహదారుల అభివృద్ధి**
రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రహదారులను బలోపేతం చేసేందుకు పల్లె పండుగ 1.0, 2.0 కార్యక్రమాల కింద 9 వేల కిలోమీటర్లకు పైగా సీసీ రోడ్లు నిర్మించగా, మరో 10 వేల కిలోమీటర్ల బీటీ రోడ్ల మంజూరు చేశాం. ఆ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమం ద్వారా మరో 6 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశాం. వ్యవసాయ క్షేత్రాలకు రాకపోకలు సులభతరం చేసేందుకు 161 డొంక రోడ్ల నిర్మాణానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, రైతులు, విద్యార్థులు, స్థానిక ప్రజల ప్రయాణ ఇబ్బందులను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది" అన్నారు.

**వీర్లగుడిపాడు వంతెన నిర్మాణానికి చర్యలు వేగవంతం**
సంగం మండలం వీర్లగుడిపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కోరగా, ఈ వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు, అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ ని ఉప ముఖ్యమంత్రివర్యులు ఆదేశించారు. అదేవిధంగా, తాగునీటి సమస్యను ప్రస్తావించగా.. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద ఇప్పటికే రూ.72 కోట్లతో 391 సింగిల్ విలేజ్ స్కీమ్స్‌ను ముందుకు తీసుకువెళు న్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి , శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆన్ లైన్ ద్వారా హాజరయ్యారు. మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఈసీ పదవులను కాంగ్రెస్ దుర్వినియోగం చేసింది

ఎన్నికల కమిషనర్ (సీఈసీ) ఎం.ఎస్. గిల్‌ను ఉదాహరణగా చూపుతూ, ఆయన ఎన్నికల కమిషన్, పార్లమెంట్, కేంద్ర కేబినెట్ల మధ్య వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారని పీయూష్ గోయల్ గుర్తుచేశారు. దీనిని రాజకీయ 'బేరసారాలకు' నిదర్శనంగా ఆయన అభివర్ణించారు. అదేవిధంగా, మరో మాజీ సీఈసీ టి.ఎన్. శేషన్ తన పదవీకాలం ముగిసిన రెండు నెలల్లోకే 1986లో గుజరాత్ గవర్నర్‌గా నియమితులయ్యారని గోయల్ పేర్కొన్నారు. 2005లో నవీన్ చావ్లాను ఎన్నికల కమిషనర్‌గా నియమించడం వెనుక సోనియా గాంధీ పాత్రను పీయూష్ గోయల్ ప్రశ్నించారు. అప్పటి నిబంధనల ప్రకారం నియామకాలకు ప్రధానమంత్రి, ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉండగా, ఆ సమయంలో ప్రభుత్వాన్ని అసలు ఎవరు నడిపారని ఆయన నిలదీశారు. 2009లో అప్పటి సీఈసీ ఎన్. గోపాలస్వామి, నవీన్ చావ్లాను పదవి నుంచి తొలగించాలని కోరిన వైనాన్ని కూడా గోయల్ ప్రస్తావించారు. చావ్లా కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఆయన వైఖరిపై గోపాలస్వామి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారని గుర్తుచేశారు. అయితే, నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ



అభ్యర్థనను పట్టించుకోలేదని పీయూష్ గోయల్ విమర్శించారు. ప్రభుత్వంపై సోనియా గాంధీ పూర్తి ప్రభావం చూపారని, నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు రాహుల్ గాంధీ కనీస గౌరవం కూడా ఇవ్వలేదని ఆయన ఆరోపించారు.

## ముఖ్యమంత్రులు చంద్రబాబు-విజయ్ భేటీ

నదుల అనుసంధానం కరువుకు శాశ్వత పరిష్కారంగా అభివర్ణించారు. మరోవైపు తెలుగు గంగ ద్వారా చెన్నైకు మరింతగా తాగునీరు విడుదల చేయాలని సీఎం విజయ్ కోరారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో కృష్ణా జలాలు తగ్గడం, తీవ్రమైన నీటి ఎద్దడి నెలకొన్నప్పటికీ చెన్నయ్ దాహార్తి తీర్చే విషయంలో ఏపీ ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఇప్పటికే 4.08 టీఎంసీల నీటిని చెన్నై నగరానికి విడుదల చేసినట్టు సీఎం చంద్రబాబు చెప్పారు. నీటి లభ్యత, అవసరాలకు అనుగుణంగా మరికొంత నీటిని విడుదల చేయడంపైనా ఆలోచన చేస్తామని చెప్పారు.

## అమ్మవారిని దర్శించుకున్న తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్

సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని )తదితరులు, ఆలయ అధికారులు సాంప్రదాయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి ప్రధానాలయంలోకి తోడ్కొని వెళ్లారు. సంప్రదాయ వస్త్రధారణతో ఆలయానికి చేరుకున్న ఆయన, క్యూలైన్లలో ఉన్న భక్తులకు చేతులెత్తి నమస్కరిస్తూ అభివాదం చేశారు. అనంతరం అంతరాలయంలో శ్రీ అమ్మవారిని దర్శించుకుని, విశేష పూజలు నిర్వహించారు. దర్శనానంతరం అనివేటి మండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం పలికారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి కె. కన్నబాబు, దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్, ఆలయ పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ సంయుక్తంగా తమిళనాడు ముఖ్యమంత్రికి శ్రీ అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు మరియు దివ్య చిత్రపటాన్ని అందజేశారు. దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారులు, నగర పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల్లో బీసీలకు 40 శాతానికి పైగా ప్రాతినిధ్యం

**ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :** గత వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు కోత విధించి వారిని రాజకీయంగా అణచివేస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం 40 శాతానికి పైగా ప్రాతినిధ్యం కల్పిస్తూ వారికి భరోసా ఇస్తోందని రాష్ట్ర గనులు, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. వెనుకబడిన వర్గాల నాయకత్వానికి తగిన రక్షణ కల్పించేలా త్వరలోనే 'బీసీ రక్షణ చట్టం' తీసుకురానున్నట్లు ఆయన కీలక ప్రకటన చేశారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాతే రాష్ట్రంలో బీసీలకు రాజకీయంగా, సామాజికంగా ప్రత్యేక గుర్తింపు లభించిందని కొల్లు రవీంద్ర గుర్తుచేశారు. నాడు ఎన్టీ రామారావు.. పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, చంద్రబాబు వాటిని 34 శాతానికి పెంచారని వివరించారు. అయితే, 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం, బీసీలు టీడీపీకి అండగా ఉన్నారనే అక్కసుతోనే రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని విమర్శించారు. కావాలనే తమ అనుయాయులతో కోర్టుల్లో కేసులు వేయించి, సరైన వాదనలు




వినిపించకుండా బీసీలకు తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. ఈ నిర్ణయం వల్ల సుమారు 16,800 మంది బీసీలు చట్టబద్ధంగా దక్కాల్సిన పదవులను కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధితో బీసీ రిజర్వేషన్ల అంశంపై దృష్టి సారించారని, దీని కోసం రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. న్యాయస్థానాల పరిమితులకు లోబడి రిజర్వేషన్లు ఖరారు చేసినప్పటికీ, పార్టీల పరంగా బీసీలకు అత్యధిక సంఖ్యలో టికెట్లు కేటాయించడం ద్వారా మొత్తం ప్రాతినిధ్యం 40 శాతానికి పైగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ చారిత్రక నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు వంటి బీసీ అగ్రనేతలపై అక్రమ కేసులు బనాయించడంతో పాటు, తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య వంటి వారి హత్యలకు కారణమై బీసీ నాయకత్వాన్ని అణచివేయాలని వైసీపీ ప్రయత్నించిందని మంత్రి ధ్వజమెత్తారు. ఇటువంటి దాడుల నుంచి బీసీ నేతలను సంరక్షించేందుకు నారా లోకేశ్ ఆధ్వర్యంలో
బీసీ రక్షణ చట్టం ముసాయిదా సిద్ధమైందని, త్వరలోనే దానికి చట్టబద్ధత కల్పిస్తామని స్పష్టం చేశారు. బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మత్స్యకారులకు వ్యతిరేకమైన జీవో 217 రద్దు, గీత, చేనేత కార్మికులకు ఆర్థిక ప్రోత్సాహకాలు, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ వంటి పథకాలతో వారిని ఆదుకుంటున్నట్లు కొల్లు రవీంద్ర తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, పెట్టుబడులను అడ్డుకోవాలని వైసీపీ కుట్రలు పన్నుతోందని, ప్రజలు వాటిని తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజాభూమి

ఎన్టీఆర్, కృష్ణా
బుధవారం, అక్టోబర్ 14, 2026



# విభిన్న ప్రతిభావంతుల బ్యాక్ లాగ్ పోస్టులు



24 మందికి నియామక ఉత్తర్వులు అందజేసిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఉద్యోగాలు పొందిన విభిన్న ప్రతిభావంతులు అంకితభావం, నిబద్ధత తో పనిచేయాలి.. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి,కాకినాడ: రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు సమాజం లో సముచిత స్థానం కల్పిస్తూ,జిల్లాలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ ఉద్యోగ నియామకాల ద్వారా విభిన్న ప్రతిభావంతుల జీవితాల్లో వెలుగులు నింపిందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. 2025-26 సంవత్సరానికి సంబంధించిన విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ పోస్టుల నియామక ప్రక్రియకు సంబంధించి ఎంపికైన 24 మంది అభ్యర్థులకు మంగళవారం కలెక్టరేట్‌లోని వీజీఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో విభిన్న ప్రతిభావంతుల బ్యాక్ లాగ్ ఉద్యోగ నియామక ప్రక్రియను అత్యంత పూర్తి పారదర్శకతతో, ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్వహించడం జరిగిందన్నారు. ఈ నియామకాల ప్రాథమిక ప్రకటన ప్రకారం జిల్లా ఎంపిక కమిటీ పరిధిలోని నాల్గవ తరగతి/పరిపాలనా విభాగం కింద 11 పోస్టులు, ఇతర కేటగిరీల పరిధిలోని 13 పోస్టులతో కలిపి మొత్తం 24 ఉద్యోగాలకు కేటాయింపులు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. వివిధ శాఖల్లో ఉద్యోగ నియామకం పొందిన దివ్యాంగులు అంకితభావం, నిబద్ధతతో పని చేసి, జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు, వారి కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ, కేటాయించిన శాఖల్లో బాధ్యతాయుతంగా సేవలు అందించాలని కోరారు. ఎంపికైన మొత్తం 24 మంది అభ్యర్థులలో అంధత్వ లోపం ఉన్నవారు 07 మంది, చెవుడు, మూగ వైకల్యం ఉన్నవారు 12 మంది, శారీరక వైకల్యం ఉన్నవారు 02 మంది, అలాగే మానసిక వికలాంగులు కలిగిన వారు 03 మంది ఉన్నారన్నారు. వీరందరికీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో ఉద్యోగ కేటాయింపులు జరిగాయని జిల్లా కలెక్టర్ వివరించారు. 2025-26 సంవత్సరానికి సంబంధించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో విభిన్న ప్రతిభావంతుల బ్యాక్‌లాగ్ నియామక ప్రక్రియ మంగళవారంతో ముగిసిందని విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎ.వై. శ్రీనివాస్ వెల్లడించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల, హిజ్రా వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ దుర్గా మల్లేశ్వరుల మూడవ రోజు దివ్య నగరోత్సవం



## శ్రీ అన్నపూర్ణాదేవి అలంకార శోభలో ప్రదోషకాలంలో కనులపండువగా ఆదిదంపతుల రథోత్సవం

## కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించిన చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వి.కె. శీనా నాయక్

## శాక్సోఫోన్ నాదం, కేరళ మేళం, కోలాటాలు, గరగ నృత్యాలతో మార్మోగిన పురవీధులుకనకదుర్గా నగర్, రథం సెంటర్ మీదుగా సాగిన రథయాత్ర – భక్తజన నీరాజనాలు

ప్రజాభూమి ప్రతినిధి,ఇంద్రకీలాద్రి:

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత భక్తిప్రపత్తులతో జరుగుతున్న దసరా శరన్నవ రాత్రి మహోత్సవాల్లో మూడవ రోజైన మంగళవారం సాయంత్రం ఆదిదంపతులైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల పవిత్ర నగర రథోత్సవం నయనానందకరంగా జరిగింది. ఇంద్రకీలాద్రిపై జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారు సాక్షాత్తు శ్రీ అన్నపూర్ణాదేవి దివ్యాలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న వేళ, ప్రదోషకాల సమయంలో కొండపై కొలువుదీరిన శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఉత్సవ మూర్తులకు అర్చక బృందం శాస్త్రోక్తంగా విశేష పూజలు, హారతులు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), దేవస్థాన కార్యనిర్వహణాధికారివి.కె. శీనా నాయక్ సంప్రదాయబద్ధంగా కొబ్బరికాయ కొట్టి నగరోత్సవ ఊరేగింపును ప్రారంభించి, స్వామి-అమ్మవార్ల పల్లకీ ముందుకు నడిపించారు. "రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే" అనే శాస్త్రోక్తి ప్రకారం, రథంపై అధిష్టించి పురవీధులలో విహరించే ఆదిదంపతులైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకోవడం అత్యంత పుణ్యప్రదం.ఆలయ ప్రాకారాల నుండి సాక్షాత్తు భక్తుల ముంగిటకు తరలి వచ్చిన జగన్మాతను, పరమేశ్వరుడిని రథారూఢులుగా దర్శించుకున్న భక్తులకు సమస్త పాపాలు, దోషాలు నశించి జన్మరాహిత్యం (మోక్షం) లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.ఆయురారోగ్యాలు & సర్వాభీష్ట సిద్ధి: ముఖ్యంగా శరన్నవరాత్రుల ప్రదోష వేళలో, అందునా సకల జీవులకు అన్నప్రదాత అయిన శ్రీ అన్నపూర్ణాదేవి సమేత మల్లేశ్వరుల రథోత్సవాన్ని కనులారా వీక్షించి కర్పూర నీరాజనాలు సమర్పించినవారికి దారిద్ర్య బాధలు తొలగి, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సంపూర్ణ కుటుంబ సౌభాగ్యం చేకూరుతాయని పండితులు పేర్కొంటున్నారు.ఆదిదంపతుల పురవీధుల సంచారం వల్ల నగరానికి అరిష్టాలు తొలగి సమస్త శుభాలు, శాంతి చేకూరుతాయని భావిస్తారు.ఊరేగింపు ఆద్యంతం సుమధుర శాక్సోఫోన్ వాయిద్యాలు, సంప్రదాయ కేరళ పంచవాయిద్యాల దరువులు, మహిళా భక్తుల లయాన్విత కోలాటాలు మరియు జానపద కళారూపమైన గరగ నృత్య విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి భక్తులను విశేషంగా అలరించాయి.మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణం నుండి బయలు దేరిన దివ్య రథయాత్ర కనకదుర్గా నగర్, రథం సెంటర్ మీదుగా వన్ టౌన్ వినాయక గుడి వద్దకు చేరుకుంది. అక్కడి నుండి కెనాల్ రోడ్డు మీదుగా ఘాట్ రోడ్డు ద్వారా తిరిగి కొండపైకి చేరుకోవడంతో రథోత్సవం సంపూర్ణమైంది. విద్యుద్దీపాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన రథంపై ఊరేగుతున్న ఆదిదంపతులను దర్శించుకునేందుకు మార్గమధ్యంలో వేలాది మంది భక్తులు బారులు తీరారు. దారిపొడవునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ, కొబ్బరికాయలు కొడుతూ స్వామి, అమ్మవార్లకు భక్తిశ్రద్ధలతో ఘన నీరాజనాలు పలికారు.భద్రతా సమన్వయం: ఊరేగింపు సాఫీగా సాగేలా దేవస్థాన సెక్యూరిటీ విభాగం మరియు విజయవాడ నగర పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఈ మహోత్సవంలో ఆలయ ధర్మకర్తలు, స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, ఆలయ సిబ్బంది మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.



# రాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



ప్రజాభూమి ప్రతినిధి,గన్నవరవరం: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 14, 15 తేదీల్లో విజయవాడలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయం త్రం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడుతో కలిసి రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పర్యటనకు సంబంధించి వివిధ శాఖలకు కేటాయించిన విధులను, ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్ల పురోగతిని ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రపతి పర్యటన సందర్భంగా విమానాశ్రయంలో రాకపోకలకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన భద్రతా ప్రోటోకాల్‌ను కచ్చితంగా పాటించాలని, అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు.రాష్ట్రపతి పర్యటన సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, విధుల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని జిల్లా కలెక్టర్ సూచించారు.సమావేశంలో సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్, విమానాశ్రయ సిఎస్ఓ కె ధర్మేంద్ర, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ కె లక్ష్మీకాంతరెడ్డి, గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు సేవే దైవసేవ.. ఇంద్రకీలాద్రిపై మానవతా పరిమళం

## మంచినీరు, మజ్జిగ పంపిణీ.. పసిపిల్లలకు వేడి పాలు.. సేవలో భాగస్వాములైన స్వచ్ఛంద సంస్థలు, యువ వాలంటీర్లు

ప్రజాభూమి ప్రతినిధి, ఇంద్రకీలాద్రి:

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలతో ఇంద్రకీలాద్రి భక్తి పారవశ్యంలో మునిగితేలుతుండగా, అమ్మవారి దర్శనానికి తరలివస్తున్న భక్తులకు అందుతున్న సేవలు మానవతా విలువలను చాటుతున్నాయి. ఎండ, రద్దీతో ఇబ్బంది పడకుండా భక్తులకు మంచినీరు, మజ్జిగ అందించడంతో పాటు, పసిపిల్లల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వేడి పాలు కూడా పంపిణీ చేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు, NSS యువ వాలంటీర్లు, రెడ్‌క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతూ భక్తులకు అండగా నిలుస్తున్నారు.దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు మంచినీరు, మజ్జిగ అందించడం ఉపశమనాన్ని కలిగిస్తోంది. చిన్నారులతో వచ్చే కుటుంబాలకు వేడి పాలు అందించడం ప్రత్యేకంగా ఉపయోగపడుతోంది. సేవాభావంతో ముందుకొస్తున్న వాలంటీర్లు భక్తులకు అవసరమైన సహాయం అందిస్తూ, వృద్ధులు, మహిళలు, చిన్నారుల పట్ల శ్రద్ధ చూపుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సహాయం అందుబాటులో ఉండేలా సంబంధిత వైద్య సిబ్బంది సేవలు అందిస్తున్నారు.వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు కూడా ఈ సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. NSS, యువజన సంఘాలు, కళాశాలల వాలంటీర్లుగా విద్యార్థులు భక్తులకు మంచినీరు, మజ్జిగ, వేడి పాలు పంపిణీ చేయడంతో పాటు క్యూలైన్లలో క్రమశిక్షణ, వృద్ధులు, మహిళలు, చిన్నారులకు అవసరమైన సహాయం అందిస్తున్నారు. విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ వంటి విలువలను పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలకంగా నిలుస్తున్నాయి. సమాజానికి బాధ్యతగల మంచి పౌరులను అందించేందుకు విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరమని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

**అధికారుల సమన్వయం.. సేవా కార్యక్రమాలకు తోడ్పాటు**

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన వివిధ విభాగాలతో సమన్వయం చేస్తోంది. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర ఆధ్వర్యంలోని నగరపాలక సంస్థ విభాగాల పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలు భక్తులకు మెరుగైన వాతావరణం కల్పించడంలో కీలకమైనవి.దేవాదాయ శాఖ మంత్రివర్యుల దిశానిర్దేశంతో ముఖ్య కార్యదర్శి, కమిషనర్ పర్యవేక్షణలోశ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం కార్య నిర్వహణ అధికారి శీనా నాయక్ ఆధ్వర్యంలో ఆలయ సంబంధిత ఏర్పాట్లు, భక్తులకు అవసరమైన సౌకర్యాల నిర్వహణ కొనసాగుతోంది. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా గాంధీ కూడా ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన అంశాల్లో దేవస్థానం తరఫున భాగస్వామ్యం వహిస్తున్నారు.నగర పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు ఆధ్వర్యంలోని పోలీసు యంత్రాంగం భక్తుల భద్రత, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారిస్తోంది. రద్దీ సమయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా భద్రతా ఏర్పాట్లతో పాటు అవసరమైన మార్గనిర్దేశం అందించడం పోలీసుల విధుల్లో ముఖ్యమైన భాగంగా కొనసాగుతోంది..





# "జగన్మాత సన్నిధిలో సాంస్కృతిక శోభ"

ప్రజాభూమి ప్రతినిధి,ఇంద్రకీలాద్రి:

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీ కనకదుర్గా నగర్‌లో కళావేదికపై మంగళవారం సాంస్కృతిక శోభ వెల్లివిరిసింది. కొండపై జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవి దివ్యాలంకారంలో భక్తులకు దర్శనమిస్తుండగా, కొండదిగువన దుర్గా నామస్మరణతో ఆధ్యాత్మికత, భక్తిభావం మిళితమైన కళా ప్రదర్శనలు అత్యంత రసవత్తరంగా సాగాయి. ఉదయం 10:00 గంటల నుండి నిర్విరామంగా కొనసాగిన ఈ కళా ప్రదర్శనలు భక్తులను ఆధ్యాత్మిక వాతావరణంలో నడిపించాయి.సంగీత కళాకారుల సుమధుర గానాలాపనలు, చిన్నారుల లయాన్విత శాస్త్రీయ నృత్యాలు, గ్రామీణ కళాకారుల భజన కీర్తనలతో కళావేదిక మార్మోగింది. ఉదయం 10:00 గంటల నుండి నిర్విరామంగా సాగిన ఈ ప్రదర్శనలు అమ్మవారి దర్శనార్థం తరలివచ్చిన భక్తులను భక్తితన్మయత్వంలో ముంచెత్తాయి.

# కనకదుర్గమ్మకు ద్వారకా తిరుమల శ్రీవారి సారె సమర్పణ

## రెండు పుణ్యక్షేత్రాల మధ్య ఆధ్యాత్మిక అనుబంధానికి ప్రతీక



ప్రజాభూమి ప్రతినిధి, ఇంద్రకీలాద్రి::

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల పవిత్ర వేళ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన జగన్మాత శ్రీ కనకదుర్గమ్మకు ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం తరఫున సారె తీసుకువచ్చారు. శ్రీవారి క్షేత్రం నుంచి జగన్మాతకు సారె సమర్పించడం రెండు పుణ్యక్షేత్రాల మధ్య ఆధ్యాత్మిక అనుబంధాన్ని, భక్తి సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పే విశేషంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో ద్వారకాతిరుమల దేవస్థానం చైర్మన్ సూరనేని వెంకట నివృతరావు సహా సిబ్బంది h సిబ్బంది దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. శరన్నవరాత్రుల వేళ జగన్మాతకు సారె సమర్పించడం ద్వారా అమ్మవారి అనుగ్రహాన్ని కోరుతూ భక్తి సంప్రదాయానికి ప్రాధాన్యమిచ్చారు.ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ పుణ్యక్షేత్రాల నుంచి వస్తున్న ఆధ్యాత్మిక కానుకలు, సంప్రదాయ సమర్పణలు ఉత్సవ వైభవాన్ని మరింత ఇనుమడింపజేస్తున్నాయి. జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ, ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి దివ్యానుగ్రహం సమస్త ప్రజలపై ఉండాలని భక్తులు ఆకాంక్షిస్తున్నారు.

# ఇంద్రకీలాద్రిపై క్యూలైన్లను పరిశీలించిన దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్

ప్రజాభూమి ప్రతినిధి,ఇంద్రకీలాద్రి:

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ మంగళవారం ఉదయం ఇంద్రకీలాద్రిపై క్యూలైన్ల నిర్వహణను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఉత్సవాల వేళ వరుసగా ప్రముఖులు, వీఐపీలు అమ్మవారి దర్శనార్థం ఇంద్రకీలాద్రికి విచ్చేస్తుండటంతో, సాధారణ క్యూలైన్లలో వేచి ఉండే సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఘాట్ రోడ్డు, ఓం టర్నింగ్, మహామండపం మీదుగా సాగే క్యూలైన్ల కదలికలను నిశితంగా పరిశీలించిన ఆయన, భక్తుల రద్దీని నియంత్రిస్తూ దర్శనాలు నిరంతరాయంగా సాగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో దసరా చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ వి. త్రినాథరావు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, ఆలయ ఇంజినీరింగ్ అధికారులు, పర్యవేక్షక సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

బుధవారం 14 అక్టోబరు 2026

# కేంద్ర మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీల అమలు చేయాలి

## సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం పిలుపు.



ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా.

కేంద్ర మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, కార్మిక సంఘాల జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏలూరు,సిఐటియు జిల్లా కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్.కె.ఎం) జిల్లా సమావేశం ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు పోరండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, బి కే ఎం యు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్ రావు, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కారం రాఘవ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్. లింగరాజు, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడారు. రైతాంగ సమస్యలు పరిష్కారం కోసం దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా నవంబర్ 26 నుండి విజయవాడలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 10 రోజులు పాటు నిరవధిక రైతాంగ దీక్షలు జరుగుతున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా 100 కేంద్రాల్లో కేంద్ర మోడీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై రైతు ఉద్యమం జరుగుతుందన్నారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా మోడీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకురావాలని కోరారు. దేశవ్యాప్తంగా ఒకే దఫాలో రైతుల రుణాలు మాఫీ చేయాలన్నారు. కరువు ప్రాంతాల్లో కరువు సహాయక చర్యలు చేపట్టాలని, నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50% కలిపి మద్దతు ధరలు నిర్ణయించాల్సి ఉన్నా ప్రస్తుత మద్దతు ధరలతో రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదన్నారు. వినియోగదారులకు మాత్రం ధరలు మండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, దళారీ వ్యవస్థను అరికట్టి ప్రభుత్వమే రైతుల పంటలను కొనుగోలు చేయాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తలెత్తిన వివాదాల నేపథ్యంలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని,ఎస్ఐఆర్ పేరుతో తొలగించిన 13 కోట్ల మంది ఓట్లను వెంటనే పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 26 నుండి జరుగుతున్న రైతాంగ దీక్షలు విజయవంతం కోరుతూ జిల్లాలో అన్ని మండలాల్లో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశం నిర్ణయించిందని చెప్పారు. ఈ సమావేశంలో సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి ఎన్ వి డి ప్రసాద్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎం. కృష్ణ చైతన్య, ఏఐకేఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఈబిచర్ల భూషణం, పి.డి.ఎస్.యు జిల్లా కార్యదర్శి బి.వినోద్ కుమార్, పి.వై.ఎల్ జిల్లా కన్వీనర్ టి.బాబూరావు, పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాల పురోగతిపై
# ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సమీక్ష



ప్రత్తిపాడు (పెద శంకర్లపూడి)

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో గృహ నిర్మాణాల పురోగతిపై ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పెద శంకర్లపూడిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈరోజు హౌసింగ్ శాఖ డీఈ, ఏఈలతో సమావేశమై నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాల ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణ పనుల పురోగతి, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల ద్వారా ప్రయోజనం చేకూరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించే దిశగా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆదేశించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఏలేశ్వరం పారిశుధ్య నిర్వహణకు నూతన వాహనాలు ప్రారంభం
### -వాహనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా



ప్రత్తిపాడు (ఏలేశ్వరం)

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచే దిశగా మరో అడుగు పడింది. మున్సిపల్ నిధులతో సమకూర్చిన నూతన చెత్త సేకరణ వాహనాలను ఈరోజు ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన వాహనాలను ప్రారంభించి, పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు వాటిని వినియోగించనున్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, చెత్త సేకరణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ వాహనాలు ఉపయోగపడనున్నాయి. పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేందుకు నగర పంచాయతీ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం..
# నిత్యావసర సరుకుల పంపిణీ
### ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సూచనలతో బాధిత కుటుంబానికి అండగా వెన్నా శివ



ప్రత్తిపాడు (కత్తిపూడి)

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం కత్తిపూడిలోని కొండవారిపేట వీధిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి అండగా నిలిచారు రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సూచనల మేరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబానికి తక్షణ అవసరాల నిమిత్తం బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి తమ వంతు సహాయం అందించి భరోసా కల్పించారు. కష్టకాలంలో బాధితులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కత్తిపూడి సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి, కత్తిపూడి గ్రామ అధ్యక్షుడు కేలంగి జన, మాజీ ఎంపీటీసీ కంచి బోయిన శ్రీను, నీటి సంఘం అధ్యక్షుడు దేశీలంక వెంకటరమణ, హైస్కూల్ చైర్మన్ వైభోయిన నాని, నక్కా శ్రీను, చోడపునిది బాబ్జి, గ్రామ రెవెన్యూ అధికారి పాండవులు తదితరులు పాల్గొన్నారు.

## నిరాశ్రయులకు అన్నదానం చేసిన రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం.



ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా.

ఏలూరు పట్టణంలోని నిరాశ్రయుల వసతి గృహంలో రిటైర్డ్ పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వసతి గృహంలో ఉంటున్న నిరాశ్రయులకు భోజనం అందించి, మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. పోలీసు సేవల్లో ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణకు తమ వంతు కృషి చేసిన రిటైర్డ్ పోలీసు అధికారులు, పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో భాగస్వాములవుతూ నిరుపేదలు, నిరాశ్రయులకు అండగా నిలవడం అభినందనీయం. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కేవలం సేవ మాత్రమే కాదు. అది మానవత్వానికి నిదర్శనం. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని, సాటి మనిషి పట్ల బాధ్యతను మరింత పెంపొందిస్తాయి.

## ఏలేశ్వరం పట్టణానికి
# రూ.61.84 కోట్లతో సమగ్ర తాగునీటి పథకం
### శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా



ప్రత్తిపాడు (ఏలేశ్వరం)

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా సమగ్ర తాగునీటి పథకాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా తెలిపారు. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ నిధులతో రూ.61.84 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పథకానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సమగ్ర తాగునీటి పథకం అందుబాటులోకి వస్తే ఏలేశ్వరం పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సదుపాయాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తున్నామని, పట్టణ అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పథకం పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. ఏలేశ్వరం పట్టణ అభివృద్ధిలో ఈ సమగ్ర తాగునీటి పథకం కీలకంగా నిలుస్తుందని, పట్టణ ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాజా ది గ్రేట్.. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం!

- నడవలేని వీఆర్వోకు అండగా నిలిచిన కోర్టు కానిస్టేబుల్ రాజాబాబు
- అభినందించిన కిర్లంపూడి ఎస్సై జి. సతీష్ కుమార్



ప్రత్తిపాడు

విధి నిర్వహణలోనే కాదు.. ఆపదలో ఉన్న తోటి మనిషికి సాయం చేయడంలోనూ పోలీసుల మానవత్వం వెలుగులోకి వచ్చింది. అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్న వీఆర్వోకు అండగా నిలిచి, మానవత్వాన్ని చాటుకున్నారు కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌కు చెందిన కోర్టు కానిస్టేబుల్ రాజాబాబు. ప్రత్తిపాడు కోర్టులో సాక్ష్యం చెప్పేందుకు వచ్చిన వీఆర్వో అనారోగ్యం కారణంగా నడవలేని పరిస్థితిలో ఉండటాన్ని రాజాబాబు గమనించారు. వెంటనే స్పందించిన ఆయన, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వీఆర్వోను చేతులపై ఎత్తుకుని వీల్‌చైర్‌లో కూర్చోబెట్టి కోర్టులోకి తీసుకెళ్లారు. విధి నిర్వహణకు మించి మానవీయ దృక్పథంతో వ్యవహరించి బాధితుడికి సహాయం అందించారు. తోటి మనిషి ఇబ్బందిని గుర్తించి, సాయం చేసేందుకు ముందుకు వచ్చిన రాజాబాబు తీరుపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఖాకీ దుస్తుల వెనుక ఉన్న సేవాభావానికి ఈ ఘటన నిదర్శనంగా నిలిచింది. రాజాబాబు చూపిన చొరవను కిర్లంపూడి ఎస్సై జి. సతీష్ కుమార్ అభినందించారు. మానవత్వమే నిజమైన సేవకు చిరునామా అని చాటిచెప్పిన రాజాబాబు చర్య పోలీసు శాఖలో సేవాభావానికి ప్రతీకగా నిలిచింది.

# దేవి నవరాత్రులు, కార్తీకమాసం, గిరి ప్రదక్షిణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి
### అధికారులకు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా సూచన



ప్రత్తిపాడు (అన్నవరం)

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీశ్రీశ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నిర్వహించిన పాలకమండలి సర్వసభ్య సమావేశంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రానున్న దేవి నవరాత్రి ఉత్సవాలు, కార్తీకమాసం, గిరి ప్రదక్షిణ కార్యక్రమాల నిర్వహణపై సమావేశంలో చర్చించారు. ఈ ఉత్సవాలకు కొండపైకి పెద్ద సంఖ్యలో విచ్చేసే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టడంపై అధికారులకు సూచనలు చేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా మాట్లాడుతూ, ఉత్సవాల సందర్భంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తులకు తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకుని, ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొనేలా ముందస్తు ప్రణాళికతో అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉత్సవాల నిర్వహణలో భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యతనిస్తూ అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ప్రజా దర్బార్‌లో అర్జీలు స్వీకరించిన మంత్రి సుభాష్



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపడతానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి 28 అర్జీలు అందగా, వాటిని మంత్రి స్వయంగా పరిశీలించి అర్జీదారుల సమస్యలను ఓర్పుగా విన్నారు. ప్రతి సమస్యను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని మంత్రి సుభాష్ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు వ్యక్తిగత, సామాజిక, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారి సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించే వేదికగా ప్రజా దర్బార్ నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి న్యాయం జరిగేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు పాల్గొన్నారు.

# సర్ సి.ఆర్. రెడ్డి మహిళా కళాశాలలో ఘనంగా దసరా వేడుకలు



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

స్థానిక సర్ సి.ఆర్. రెడ్డి మహిళా కళాశాలలో కామర్స్,జువాలజీ, ఫిషరీస్,మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్,ఇంగ్లీష్ విభాగాలు ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం దసరా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దసరా పండుగ విశిష్టత, విజయదశమి ప్రాముఖ్యతను వివరించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి దసరా ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలకరస్పాండెంట్ కిలారు ప్రభాకరరావు, ప్రిన్సిపాల్ జి. సరళ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పి. హిమబిందు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుకున్న విద్యాసంస్థకు మంచి పేరు తీసుకురావాలి
### డిఎస్పి మేకా సుధాకర్




ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

విద్యార్థులు మంచి స్నేహితులను ఎంచుకుని, చెడు వ్యసనాలు దూరంగా ఉంటూ చదువుకున్న విద్యాసంస్థకు మంచి పేరు తీసుకువచ్చేలా భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని నర్సాపురం డిఎస్పి మేకా సుధాకర్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు బిఆర్ఆర్ అండ్ జీకేఆర్ ఛాంబర్స్ డిగ్రీ మరియు పీజీ కళాశాల ఫ్రెషర్స్ డే స్వాగత్ ఉత్సవ వేడుక సభ కళాశాల అధ్యక్షులు కెవిఆర్ నరసింహారావు అధ్యక్షతన ఆ కళాశాల ప్రాంగణం లో మంగళవారం జరిగింది. ఈ సబకు డి.ఎస్. పి మేకా సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తను విజయవాడ లైలా కళాశాలలో చదువుకుని ఇంతటి వాడినయ్యానని తెలిపారు. భవిష్యత్తును ఇచ్చిన విద్యాసంస్థను ఎప్పుడు మరవకూడదన్నారు. త్రిశూల వ్యూహం పేరుతో డ్రగ్స్, ట్రాఫిక్, సైబర్ నేరాలు పై పోలీసులు యంత్రాంగం దృష్టి పెడుతుందని తెలిపారు. ఈ ఈ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సవాధ్యక్షుడు, కళాశాల కమిటీ చైర్మన్ కెవిఆర్ నరసింహారావు మాట్లాడుతూ తమ ఛాంబర్స్ కళాశాలలో డిగ్రీ లేదా పీజీ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి నూరు శాతం ఉపాధి కల్పించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనికోసం 37 కంపెనీలతో టై అప్ పెట్టుకున్నట్లు తెలిపారు. ఇతర విద్యా సంస్థల విద్యార్థుల కు కూడా ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందర్నీ అలరించాయి. ఈ సభలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎన్ ఉదయభాస్కర్, సీఐ జి శ్రీనివాస్, ఎస్సై పృథ్వీరాజ్,ప్రిన్సిపాల్ డి వెంకటేశ్వరరావు, కె. వి సీతారామరాజు, రేపాక ప్రవీణ్ బాను, కటారి నాగేంద్ర కుమార్, ఏబి ఎస్ మూర్తి, ఎన్ సీతారామారావు, బిహెచ్ విశ్వనాథరాజు, నాలం శ్రీనివాస్ గుప్త, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌కు మంత్రి పార్థసారథి, ఎంపీ మహేష్ యాదవ్ నివాళి



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దేశానికి దిక్సూచి అని, సమానత్వం, సామాజిక న్యాయం, సంక్షేమ ఫలాలు బడుగు బలహీన వర్గాలందరికీ అందాలనే లక్ష్యంతో ఆయన రాజ్యాంగాన్ని రూపొందించారని పేర్కొన్నారు.

ప్రజాభూమి

కాకినాడ, తూర్పుగోదావరి 5

బుధవారం 14 అక్టోబరు 2026

# భగవంతుని స్వరూపాలు దివ్యాంగులు

- మంత్రి నిమ్మల
- దివ్యాంగుల ఆత్మగౌరవానికి అండగా.. రూ.1.10 కోట్లతో సహాయ ఉపకరణాల పంపిణీ
- పాలకొల్లులో 365 మందికి 540 ఉపకరణాలు అందజేత
- దివ్యాంగులతో మమేకమైన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, మంత్రి నిమ్మల రామానాయుడు







ప్రజా భూమి ప్రతినిధి-పాలకొల్లు

భగవంతున్ని స్వరూపాలు దివ్యాంగులని, అటువంటి వారి సంక్షేమం, ఆత్మగౌరవం, స్వావలంబనకు తోడ్పాటునందించే లక్ష్యంతో పనిచేస్తున్నానని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో ఉచిత సహాయ ఉపకరణాల పంపిణీ మెగా శిబిరాన్ని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరంలో సైల్ సీఎస్ఆర్ నిధులతో రూ.1.10 కోట్ల విలువైన 540 సహాయ ఉపకరణాలను 365 మంది దివ్యాంగులకు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ నాగరాణి, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, కూటమి నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులతో మంత్రులు ఆప్యాయంగా మమేకమై వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. సహాయ ఉపకరణాలను పరిశీలించారు .ఉదయం నుంచి మంత్రి రామానాయుడు దివ్యాంగులకు ఎటువంటి ఇబ్బందులు, అవస్థలు వంటివి ఎదురుకాకుండా దగ్గరుండి అన్ని ఏర్పాట్లను చేశారు. వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులకు పలు బాధ్యతలను అప్పగించారు. దివ్యాంగులను ఆప్యాయంగా పలకరించి స్వయంగా ప్లేట్లో టిఫిన్ పట్టుకొని దగ్గరికి వెళ్లి అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. దివ్యాంగుల పట్ల తమకు ఎంతో గౌరవం, అభిమానం ఉన్నాయని పేర్కొన్నారు. భగవంతుని స్వరూపంగా భావించే దివ్యాంగులకు అండగా నిలవడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. అన్ని అవయవాలు సక్రమంగా ఉండి చెడు మార్గంలో నడిచే వారే అసలైన వికలాంగులని వ్యాఖ్యానించారు. తన తండ్రి పేరుతో 2005లో ఫౌండేషన్ ఏర్పాటు చేసి, పాలకొల్లు నియోజకవర్గంలో 100 మంది వృద్ధులు, 100 మంది దివ్యాంగులను దత్తత తీసుకుని వారి సంరక్షణ బాధ్యతలను నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పింఛను అందని దివ్యాంగులకు సొంత నిధులతో, దాతల సహకారంతో ప్రతి నెలా ఆర్థిక సాయం అందిస్తున్నామని వివరించారు.

వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.4 వేల నుంచి రూ.15 వేల వరకు వివిధ స్థాయిల్లో పింఛన్లు అందిస్తున్నామని, దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కూడా కూటమి ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు.ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను సమీకరించి ప్రజలకు ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలను చేపడుతోందని మంత్రి తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన సహాయ ఉపకరణాలను అందించడం ద్వారా వారి రోజువారీ జీవనంలో ఇబ్బందులు తగ్గి, స్వతంత్రంగా జీవించేందుకు తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు.ప్రజల్లో ప్రేమ, దయ, సేవాభావాన్ని పెంపొందించే కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. మెగా శిబిరానికి వచ్చిన వందలాది మంది దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా టిఫిన్, భోజనం, పానీయాల ఏర్పాట్లు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం కావాల్సినందున మంత్రి రామానాయుడు అత్యవసరంగా అమరావతి బయలుదేరి వెళ్లారు.

దివ్యాంగులకు అవసరమైన సహాయాన్ని అందించడం, వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా సమాజంలో వారికి సముచిత గౌరవం, సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## జిల్లా కలెక్టర్ని మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పి సీఈఓ ఎం.కృష్ణమోహన్



ప్రజా భూమి బ్యూరో-ఏలూరు జిల్లా

పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఏలూరు జిల్లా పరిషత్ సీఈఓ ఎం. కృష్ణమోహన్ ఆదేశించారు. ఏలూరు జిల్లా పరిషత్ సీఈఓ ఎం. కృష్ణమోహన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక కలెక్టర్ లో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి కి పూలమొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో త్వరలో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానున్న దృష్ట్యా, సంబంధిత శాఖల సమన్వయంతో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందించాలన్నారు. రాష్ట్ర వైద్య శాఖ మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా పనిచేస్తున్న ఎం. కృష్ణమోహన్ ను రాష్ట్ర ప్రభుత్వం ఏలూరు జెడ్పి సీఈఓ గా నియమించింది. ఈ మేరకు జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది సీఈఓ ఎం. కృష్ణమోహన్ ను మర్యాదపూ ర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసారు.

## రామచంద్రపురం పురపాలక సంఘం పరిధిలో వార్డుల వారీ రిజర్వేషన్లు ఖరారు.

మొత్తం వార్డులు 32
ఎస్సీలకు 3, ఎస్టీలకు 1, బీసీలకు 12 వార్డులు
మహిళలకు జనరల్ కోటాలో 9 వార్డులు
జనరల్ కేటగిరీలో -7 వార్డులు




ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.

రామచంద్రపురం పురపాలక సంఘం పరిధిలో 32 వార్డులకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ అక్టోబరు 13న విడుదల చేసిన అధికారిక గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం వార్డుల వారీ రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి.

**వార్డుల వారీ రిజర్వేషన్లు**

1వ వార్డు - బీసీ జనరల్
2వ వార్డు - ఎస్సీ జనరల్
3వ వార్డు - జనరల్
4వ వార్డు - జనరల్ మహిళ
5వ వార్డు - ఎస్టీ జనరల్
6వ వార్డు - బీసీ జనరల్
7వ వార్డు - బీసీ జనరల్
8వ వార్డు - ఎస్సీ జనరల్
9వ వార్డు - జనరల్
10వ వార్డు - బీసి జనరల్
11వ వార్డు - జనరల్ మహిళ
12వ వార్డు - జనరల్ మహిళ
13వ వార్డు - బీసీ మహిళ
14వ వార్డు - బీసీ జనరల్
15వ వార్డు - జనరల్ మహిళ
16వ వార్డు - బీసీ మహిళ
17వ వార్డు - జనరల్ మహిళ
18వ వార్డు - జనరల్ మహిళ
19వ వార్డు - జనరల్
20వ వార్డు - జనరల్
21వ వార్డు - జనరల్ మహిళ
22వ వార్డు - జనరల్
23వ వార్డు - జనరల్
24వ వార్డు - జనరల్
25వ వార్డు - జనరల్ మహిళ
26వ వార్డు - జనరల్ మహిళ
27వ వార్డు - బీసీ మహిళ
28వ వార్డు - బీసీ మహిళ
29వ వార్డు - బీసీ మహిళ
30వ వార్డు -బీసీ మహిళ
31వ వార్డు - బీసీ జనరల్
32వ వార్డు - ఎస్సీ మహిళ

**మొత్తం రిజర్వేషన్ల వివరాలు**

మొత్తం వార్డులు - 32
ఎస్టీ జనరల్ - 1 వార్డు
ఎస్సీ మహిళలు - 2 వార్డులు
ఎస్సీ జనరల్ -3 వార్డులు
బీసీ మహిళలు - 6వార్డులు
బీసీ జనరల్ - 6 వార్డులు
జనరల్ మహిళలు --9
జనరల్ (రిజర్వేషన్ లేనివి) - 7 వార్డులకు ఇందులో మొత్తం మహిళలకు కేటాయించిన వార్డులు -- 17 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ కలెక్టర్, జిల్లా ఎన్నికల ప్రాధికార సంస్థ అక్టోబరు 13, 2026న జారీ చేసిన 60/2026 నంబరు అసాధారణ గెజిట్ నోటిఫికేషన్ ఆధారంగా ఈ రిజర్వేషన్లు ప్రకటించారు.

## రైతు బజారు బియ్యం అమ్మకాల్లో ఎటువంటి ఫిర్యాదు లేకుండా అమ్మకాలు నిర్వహించాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ డా, ఎం జె అభిషేక్ గౌడ్.




ప్రజా భూమి బ్యూరో ఏలూరు జిల్లా.

ధరణి - నాణ్యమైన బియ్యం' కార్యక్రమాన్ని ఎటువంటి ఫిర్యాదులు లేకుండా పటిష్టంగా అమలు జరిగేలా పర్యవేక్షించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. స్థానిక పత్తేబాద రైతుబజార్ లో ప్రత్యేక కౌంటర్ల లో బిపిటి, కే ఎన్ ఎం/ ఆర్ ఎన్ ఆర్ అమ్మకాలను జేసీ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ రాష్ట్రంలో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'ధరణి - నాణ్యమైన బియ్యం' కార్యక్రమాన్ని చేపట్టిందని, ఈ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. 'ధరణి - నాణ్యమైన బియ్యం' కార్యక్రమాన్ని జిల్లాలోని ఏలూరు పత్తేబాద రైతుబజార్, వన్ టౌన్ రైతుబజార్, నూజివీడు రైతుబజార్, కైకలూరు రైతుబజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా బి పి టి రకం బియ్యాన్ని కిలో రూ.49కు, కే ఎన్ ఎం రకం బియ్యాన్ని కిలో రూ.50కు విక్రయిస్తున్నామన్నారు. . ఒక్కో బస్తాలో 26 కిలోల బియ్యం ఉండేలా ప్యాకింగ్ చేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచామని,. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ప్రజలకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రత్యేక కౌంటర్లలో నిర్ణీత సమయాలలో అమ్మకాలు నిర్వహించాలని, వినియోగదారుల నుండి ఎటువంటి ఫిర్యాదు లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా బియ్యం నాణ్యత, స్టాక్ నిల్వలను జేసీ పరిశీలించారు.జిల్లా పౌర సరఫరాల అధికారి బాబు విలియమ్స్, పౌర సరఫరాల సంస్థ డిఎం శివరామ మూర్తి, రెవిన్యూ, మార్కెటింగ్, పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.

## స్వేచ్ఛాయుత ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

- రామచంద్రపురంలో పోలింగ్ కేంద్రాల తనిఖీ.
- పోలీసులకు ఎస్పీ ఆదేశాలపై డిఎస్పీ దిశానిర్దేశం.



ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఆదేశాల మేరకు డీఎస్పీ రామచంద్రపురం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. రామచంద్రాపురం టౌన్ ఎస్సై ఎస్ నాగేశ్వరరావు, ద్రాక్షారామ ఎస్సై ఏ.లక్ష్మణ్, ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో గల సిబ్బందితో కలిసి రాజగోపాల్ సెంటర్ నుంచి వి ఎస్ ఎం కాలేజ్ వరకు ఫ్లాగ్ మార్చ్ , ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు.రాబోయే మున్సిపల్, పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని పోలీసు అధికారులకు ఎస్పీ , డి.ఎస్.పి సూచించడంతో. ఆయా ప్రాంతాల్లో రౌడీషీటర్లు, గత కేసుల్లో నిందితులపై చట్టప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టాలని ఆదేశించార. సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్‌లు, ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించి ప్రజల్లో భద్రతపై నమ్మకం కల్పించాలని తెలిపారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ), ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా స్పష్టం చేశారు.పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, సమస్యాత్మక పరిస్థితులు తలెత్తే అవకాశాలను పరిశీలించిన డిఎస్పీ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

## పార్సిల్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు

మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడంలో సహకరించాలి

పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ మద్ది రామ శేషయ్య



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో ప్రొహిబిషన్ ఌ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎ ల్ ఌటీ ,టిడ్కో గృహ సముదాయాలలో మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు.అదేవిధంగా, పాలకొల్లు పట్టణంలోని ఆర్టీసీ పార్సిల్ కార్యాలయంతో పాటు ఇతర ప్రైవేట్ పార్సిల్ కార్యాలయాలను ప్రొహిబిషన్ ఌ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పార్సిల్ రవాణా ద్వారా మత్తు పదార్థాలు, నిషేధిత వస్తువులు అక్రమంగా తరలించకుండా అప్రమత్తంగా ఉండాలని సంబంధిత కార్యాలయాల యాజమాన్యాలకు సూచించారు.పార్సిళ్ల బుకింగ్, రవాణా సమయంలో ఏవైనా అనుమానాస్పద వస్తువులు లేదా మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం గుర్తించినట్లయితే వెంటనే పాలకొల్లు ప్రొహిబిషన్ ఌ ఎక్సైజ్ కార్యాలయానికి తెలియజేయాలని సూచించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడంలో పార్సిల్ కార్యాలయాల యాజమాన్యాలు, సిబ్బంది సహకరించాలని కోరారు.ఈ సందర్భంగా పాలకొల్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ మద్ది రామశేషయ్య మాట్లాడుతూ, మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు శాఖ తరఫున నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని ఆయన కోరారు.

## ఘనంగా రంగోలి కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు మరియు 25 సంవత్సరాల పరిపాలన సందర్భంగా తలపెట్టిన,,"సేవా సంకల్ప అభియాన్" కార్యక్రమాలలో. భాగంగా "రంగోలి 'కార్యక్రమం నూజివీడు గ్రామీణ మండలం గొల్లపల్లి గ్రామంలో మన సీనియర్ మహిళా నాయకులు గోగినేని వెంకట శశిరేఖ సౌజన్యం తో ఉదయం 9గంటలకు మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మానూరి పద్మావతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది . ఈకార్యక్రమం లో 3రోజులు ఎంతో ఓపికతో మోడీ అభివృద్ధి మరియు సేవా కార్యక్రమాలకు రంగుల తో అద్భుతంగా ఆవిష్కరించిన మహిళా మోర్చా నూజివీడు గ్రామీణ మండలం సెక్రటరీ జూట్రూ నాగ వసంత మరియు క్రియాశీల సభ్యులు శ్రీమతి కమల నాగేశ్వరరావు పద్మావతి మరియు శ్రీమతి కుంపటి అరుణ (ఏ ఎం సి నూజివీడు) లు శాలువ కప్పి సత్కరించారు. ఇంకా ఈ కార్యక్రమం లో శ్రీ మాగంటి వాసు (జిల్లా ఓబీసీ మోర్చా ముఖ్య కార్యదర్శి), శ్రీ మానూరి ప్రసాద్ (జిల్లా సోషియల్ మీడియా ), శ్రీ వై ఎస్ దొరై (సీనియర్ నాయకులు), శ్రీ బడుగు శ్రీకాంత్ (ముసునూరు మండలం పార్టీ అధ్యక్షుడు), శ్రీ నక్కా నాగ శివ (నూజివీడు గ్రామీణ మండల పార్టీ అధ్యక్షుడు), నక్కా శ్రీనివాస్ రావు (రఘునాథ స్వామి ఆలయ కమిటీ సభ్యుడు) శ్రీ మొలగనిరామాంజనేయులు(మండల పార్టీ కోశాధికారి), దారవతు శంకరం (ఎస్ టి మోర్చా ఌ సోషల్ మీడియా మండల సభ్యులు)గోగినేని శ్రీనివాస్ కుమార్ అప్పారావు (మాజీ సర్పంచ్ గొల్లపల్లి), పలగాని రాణి (మాజీ పంచాయతీ సభ్యులు), మొలగని ఉషా రాణి కుం పటి రంగారావు, గొల్లపల్లి సునీత దుక్కిపాటి జయరాజు, జుట్టూ నాగేశ్వరరావు, జుట్టూ శరణ్ కుమార్ (క్రియాశీల సభ్యులు), జక్కుల విజయ, జక్కుల వరలక్ష్మి (జన సేన), చిటికెన తిరుపతమ్మ (టీడీపీ) మరియు అధిక సంఖ్యలో మోడీ అభిమానులు, గ్రామ ప్రజలు "రంగోలి ""నీ వీక్షించి ఉత్సాహంగా ఫోటోలు తీసుకుని వెళుతున్నారు. కార్యక్రమం అనంతరం జి ఎస్ ఎన్ ఫౌండేషన్ వారిచే అల్పాహారం మరియు తేనీరు ఏర్పాటు చేశారు.

## ఆగిరిపల్లి మండలంలో రూ.2.40 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం ఆగిరిపల్లి మండలంలో ఏలూరు పార్లమెంటు సభ్యుడు పుట్టా మహేష్ కుమార్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అడవినెక్కలంలో రూ.20 లక్షలతో ఎస్సీ సామాజిక భవనానికి, తోటపల్లిలో రూ.1.20 కోట్లతో సీసీ రహదారులకు, రూ.20 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధికి, రూ.25 లక్షలతో నీటి ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నరసింగపాలెంలో రూ.55 లక్షలతో నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, మిగిలిన పనులను దశలవారీగా పూర్తిచేస్తామని తెలిపారు. పనులను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నాయని, తాగునీరు, రహదారులు, మురుగునీటి కాలువల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నాయని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు పూర్తి చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ మిషన్ ఉపాధ్యక్షుడు, నూజివీడు నియోజకవర్గ పరిశీలకుడు మర్రిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

### ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డి. శివకుమార్ డిమాండ్



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

నిబంధనలకు విరుద్ధంగా సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న చాటపర్రు శ్రీచైతన్య పాఠశాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డి. శివకుమార్ డిమాండ్ చేశారు. సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న విషయం బయటపడకుండా పాఠశాల ఆవరణలోని ఓ ఇంట్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు.సమాచారం మేరకు చాటపర్రు వెళ్లి పరిశీలించిన అనంతరం ఏలూరు టౌన్ ఎంఈఓ ఏబ్రోలుకు సమాచారం అందించామని తెలిపారు.స్పందించిన ఎంఈఓ తరగతులు రద్దు చేయాలని ఆదేశించారని, పాఠశాలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఫరహాన్, ఆకాష్ పాల్గొన్నారు.

ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

బుధవారం 14 అక్టోబరు 2026

# ఎన్నికల్లో 11 లక్షల అనుబంధ విభాగాల శక్తిని వినియోగించాలి.

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్ ఆలూరు సాంబశివారెడ్డి.

ప్రజాభూమి, పుట్లూరు.

రాష్ట్రం నుంచి గ్రామస్థాయి వరకు పార్టీకి బలమైన అనుబంధ విభాగాల వ్యవస్థ ఉందని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్ ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. పార్టీ ఆర్గనైజేషనల్ వ్యవస్థలో దాదాపు 14 లక్షల మంది ఉండగా, అనుబంధ విభాగాలకు చెందిన నాయకత్వం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. గ్రామస్థాయి వరకు అనుబంధ విభాగాలను క్రియాశీలం చేయాలని సూచించారు. ప్రచారం, సోషల్ మీడియా, బూత్ మేనేజ్‌మెంట్ వంటి కార్యక్రమాల్లో అనుబంధ విభాగాల సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. అభ్యర్థుల ప్రచారం నుంచి పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రతి దశలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి అనుబంధ విభాగం తన పరిధిలోని సమస్యలపై వన్ మినిట్ వీడియోలు రూపొందించాలని చెప్పారు. స్థానిక సమస్యలపై డిజిటల్ కంటెంట్ తయారు చేసి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ సంస్థాగత వ్యవస్థను గ్రామస్థాయి వరకు బలోపేతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్ ఆలూరు సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు.

# స్థానిక ఎన్నికల్లో కురుబలకు సముచిత స్థానం కల్పించాలి

## -మున్సిపాలిటీలో 10 స్థానాలు కేటాయించాలి

## కురుబ సంఘం నాయకుల డిమాండ్




ప్రజాభూమి, హిందూపురం టౌన్

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కురుబ సామాజిక వర్గానికి జనాభా ప్రాతి పదికన సముచిత రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర కురుబ సంఘం ఉపాధ్యక్షులు, విశ్రాంత డీఎస్పీ నంజుండప్పతో పాటు హిందూపురం పట్టణ కురుబ సంఘం నాయకులు అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. హిందూపురం పట్టణ మున్సిపాలిటీలో కురుబ సామాజిక వర్గానికి 10 స్థానాలు కేటాయించి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం హిందూపురం ప్రెస్‌క్లబ్‌లో కురుబ సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నంజుండప్ప మాట్లాడుతూ, హిందూపురం నియోజకవర్గంలో సుమారు 60 వేల మంది, హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో సుమారు 20 వేల మంది కురుబ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు ఉన్నారని తెలిపారు. ఇంతటి జనాభా ఉన్న తమ వర్గానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికలో కురుబ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని, జనాభాకు అనుగుణంగా రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. కేవలం జనాభా పరంగా మాత్రమే కాకుండా, రాజకీయ ప్రాతినిధ్యంలోనూ తమ వర్గానికి తగిన గుర్తింపు లభించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హిందూపురం పట్టణ కురుబ సంఘం అధ్యక్షులు అంజాలప్ప, గౌరవాధ్యక్షులు నాగప్ప, కార్యదర్శులు మల్లికార్జున, జగదీష్, కోశాధికారి లక్ష్మీనారాయణ, సభ్యులు గోళాపురం నంజుండప్ప, న్యాయ విభాగం ప్రతినిధి ఉల్కాలప్ప తదితరులు పాల్గొన్నారు.

# తాడిపత్రి సబ్ డివిజన్‌లోని పలు హైపర్ సెన్సిటివ్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ

## పోలింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు...పోలీసు పికెట్లను

## -ఆకస్మికంగా తనిఖీ చేసి తగు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ




ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం జిల్లా తాడపత్రిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు రాబోయే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు చర్యలు వేగవంతం చేశారు. ఇందులో భాగంగా సమస్యాత్మక ప్రాంతంగా గుర్తింపు పొందిన తాడిపత్రి సబ్ డివిజన్‌లోని పలు 'హైపర్ సెన్సిటివ్' గ్రామాల్లో జిల్లా ఎస్పీ పి.జగదీష్ మంగళవారం విస్తృతంగా పర్యటించి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్షుణ్ణంగా తనిఖీలు, సబ్ డివిజన్ పరిధిలోని వీరాపురం, హుస్సేనాపురం, ఆలూరు, రాయలచెరువు, కిష్టపాడు తదితర అత్యంత సమస్యాత్మక గ్రామాలను ఎస్పీ నేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల వద్ద కల్పించాల్సిన మౌలిక వసతులు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. గతంలో



జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా చేపట్టిన కట్టుదిట్టమైన భద్రతా చర్యలపై స్థానిక అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో భాగంగా ఆలూరు, వీరాపురం గ్రామాల్లో నిరంతరం కొనసాగుతున్న పోలీస్ పికెట్లను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తతను, రిజిస్టర్లను పరిశీలించారు. గ్రామంలోకి వచ్చె ప్రాధాన్య మార్గాలపై నిరంతర నిఘా ఉంచాలని, రాత్రివేళల్లో గస్తీ తీవ్రతరం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేదు?ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. "సబ్ డివిజన్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించే వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. పాత నేరస్థులు, గొడవలకు తావిచ్చే వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నాం. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేశాం," అని హెచ్చరించారు. ప్రజలందరూ ఎలాంటి భయాందోళనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తగిన రక్షణ కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో తాడిపత్రి డిఎస్పీ ఎం.చంద్రశేఖర్ , సీఐలు క్రాంతికుమార్ , నారాయణరెడ్డి, శ్రీనివాసులు, నరేంద్రరెడ్డి, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారులకు మౌనం ఎందుకు...?

## ఇసుక టిప్పర్ల తో రోడ్లు గోవిందా...! - ఇలా అయితే గమ్యం చేరేది ఇంకెలా...!

ప్రజా భూమి. యల్లనూరు

చిత్రావతి నది పరివాహక ప్రాంతమైన కోడుమూర్తి గ్రామానికి చెందిన కొంతమంది రైతుల నుంచి భూ రికార్డుల్లో ఉన్నవి, లేనివీ అసైన్డ్ భూములు కొందరు కొనుగోలు చేసి ఇసుక రీచ్ కొనసాగిస్తూ, ఉండడంతో చిత్రావతి నది నుంచి ఇష్టానుసారంగా ఇసుక తోడుకోవటంతో భూగర్భ జలాలు కూడా అడుగంటి పోయాయి ఈ విషయం రెవిన్యూ అధికారులకు తెలిసినా చూసి చూడనట్లు ఉన్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు, ఇది ఇలా ఉంటే పరిమితికి మించిన అధిక లోడుతో చిత్రావతి నది నుంచి తిరుమలా పురం అతి సమీపంలోని మెయిన్ రోడ్డుకు చేరుకునే దగ్గర దాదాపు ఒక పెద్ద లోయ ఏర్పడడంతో వాహన దారులు బెంబేలెత్తి పోతున్నారు దీంతో పాటు ఇక్కడి నుంచి ఇదే మార్గం ద్వారా 30 కిలో మీటర్లకు పైగా ఇసుక టిప్పర్లు తాడిపత్రి, పలు ప్రాంతాల వైపు వెళ్ళాలి ఈ క్రమంలో రోడ్డు ఇరువైపులా పగుళ్లు, కంకర రాళ్లు తేలి పూర్తిగా గుంతలమైపోయింది ఎదురుగా వచ్చే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది, పగలు రాత్రి తేడా లేకుండా అధిక వేగంతో పాటు ఎటువంటి తార్పల్స్ లేకుండా వెళ్లడంతో కంటిలో ఇసుక పడిందా ఇక అంతే ఎటు వెళ్ళాలో తెలియని పరిస్థితి ప్రయాణికుల, వాహనదారుల బాధ వర్ణనాతీతం ఎటువంటి





నియమ నిబంధనలు పాటించకుండా రోడ్లన్నీ మావే మా ఇష్టంగా మేము వెళ్తాం మీరెవరు అంటూ డ్రైవర్స్ దురుసు ప్రవర్తన వాహన దారులపై చేస్తున్నట్లు సమాచారం పంచాయతీ రోడ్లు, ఆర్ అండ్ బి రోడ్లు ఎన్నోమార్లు ఆయా శాఖల అధికారులు ప్యాచ్ వర్క్ చేయించినప్పటికీ కూడా ఫలితం లేకపోవడంతో విసుగెత్తి పోతున్నారు అందువల్లనే ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని మైనింగ్ అధికారులు, పోలీసు అధికారులు చొరవ తీసుకొని వీటిని నియంత్రించకపోతే ప్రయాణికులకు భారీ, ఎత్తున ప్రాణం నష్టం జరిగే అవకాశం వాటిల్లే ప్రమాదం ఉంది కనుక తక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యాప్తంగా ప్రజలు కోరడమైనది.

# సిఐఐ పార్ట్నర్షిప్ సమిట్ - 2026 కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి..

## -అనంతపురం జేఎన్టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం జిల్లా కేంద్రంలోని జేఎన్టీయూలో ఈనెల 23వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న సి ఐ ఐ పార్ట్నర్షిప్ సమిట్– రీజనల్ కాన్ఫరెన్స్ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సిఐఐ భాగస్వామ్య సదస్సు – 2026 రీజనల్ కాన్ఫరెన్స్ నేపథ్యంలో నగరంలోని జేఎన్టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో, అతిథి గృహంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, అసిస్టెంట్ కలెక్టర్ సుయశ్ కుమార్, తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని జేఎన్టీయూలో వచ్చే అక్టోబర్ 23వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించబోతున్న సి ఐ ఐ పార్ట్నర్షిప్



సమిట్– 2026 రీజనల్ కాన్ఫరెన్స్ కోసం అన్ని విధాలా సన్నద్ధం కావాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సి ఐ ఐ పార్ట్నర్షిప్ సమిత్ – 2026 రీజనల్ కాన్ఫరెన్స్ ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలన్నారు. నగరంలోని జేఎన్టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో, జేఎన్టీయూ అతిథి గృహంలో, ఇతర అన్ని చోట్లా పక్కాగా ఏర్పాట్లు ఉండాలన్నారు. కార్యక్రమానికి వచ్చే డెలిగేట్ల కోసం ఏర్పాట్లు చేపట్టాలని, సౌండ్ సిస్టమ్, లైవ్ స్ట్రీమింగ్, బ్యాక్ డ్రాప్, వసతి, భోజన ఏర్పాట్లు, లైటింగ్, పోలీస్ సెక్యూరిటీ, షామియాణాలు, ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు, మెటీరియల్, తదితర అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతిష్టాత్మకంగా రీజనల్ కాన్ఫరెన్స్ నిర్వహించాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ, సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జిఎం శ్రీనివాస యాదవ్, ఏపీఐఐసీ జడ్ఎం నాగకుమార్, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, డిఐపిఆర్ఓ బాల కొండయ్య, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అధికారులు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురం నగర మేయర్ బెస్త కులస్తులకు కేటాయించాలని డిమాండ్!

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

అనంతపురం నగరములో బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో, బెస్త కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంగళవారం జిల్లా బెస్త సంఘం నాయకులు మాట్లాడుతూ గ్రేటర్ రాయలసీమ జిల్లాలలో గణనీయంగా జనాభా కలిగి ఉన్న బెస్తలను రాజకీయ పార్టీలు స్వాతంత్ర్యానంతరం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుంటున్నాయే కానీ, ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. చట్టసభలలో ప్రాతినిధ్యం లేని కులాలు అంతరించిపోతాయని అంబేద్కర్ చెప్పి అన్నట్లుగానే బెస్త కులం కూడా అంతరించిపోయే దశకు చేరుకున్నదన్నారు. విద్య, విజ్ఞానం, జనాభా పరంగా ఇతరులతో ఏమాత్రం తక్కువ కాకుండా ఉన్న బెస్తలకు కేవలం ఒక్క ఆర్థిక బలం లేదనే రుణంతోనే రాజకీయ పార్టీలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, ఇకమీదట రాజకీయ ప్రాధాన్యత ఇవ్వని రాజకీయ పార్టీల పట్ల కఠినంగా ఉండాలన్నారు. గత వైసిపి ప్రభుత్వం బెస్త కార్పొరేషన్ చైర్మన్, డోన్ మున్సిపాలిటీ చైర్మన్, పదవులు ఇస్తే, నేడు టిడిపి ఆఫ్ కాఫ్ చైర్మన్,




గతంలో ఒకసారి పుట్టపర్తి మున్సిపాలిటీ చైర్మన్ పదవులు ఇచ్చి చేతులు దులుపుకునాయన్నారు. చట్టసభలలో అడుగు పెట్టకుండా చేశాయిన్నారు. ఓట్లు వేయించుకోవడం కోసమే బెస్తలను గుర్తిస్తున్నారు కానీ, వారికి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలనే స్పృహ లేదన్నారు. స్థానాలను కేటాయించే టప్పుడు మాత్రం జనాభా తగినంతగా లేదని తప్పించు కుంటున్నారు. ఇదే నిజమైతే రాష్ట్రంలో రెడ్డి, కమ్మ కులం కంటే బెస్తలు ఎక్కువ జనాభా ఉన్నారు. దీనిని బట్టి, వీరికంటే బెస్తలు ఎక్కువమంది ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉండాలి కదా? ఒక్కరు కూడా ఎందుకు లేరు? అలాంటప్పుడు జనాభా లేని కమ్మ, రెడ్డి కులస్తులు ఎలా ఎన్నికవుతున్నారు? రాజకీయ పార్టీలు సమాధానం చెప్పాలన్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని గొప్పలు చెప్పుకుంటున్న పార్టీలు ఒకటి రెండు బీసీ కులాలకు సీట్లు ఇచ్చి మిగిలిన వారిని నిర్లక్ష్యం చేయడం రిజర్వేషన్ ఎలా అవుతుంది? రిజర్వేషన్ అంటే జనాభా ప్రాతిపదికన ప్రతి కులానికి సమాన న్యాయం జరగాలి. ప్రస్తుతం రాష్ట్రంలో జరగబోతున్న స్థానిక సంస్థల ఎన్నికలలో రిజర్వుడు స్థానాలలో బెస్తలకు ప్రాముఖ్యత కల్పించి, రాజకీయ పార్టీలు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. లేకుంటే కులాలవారీగా స్వతంత్రంగా పోటీ చేసి, ఎవరి కులం వారు గెలవడం కోసం ఐక్యంగా పనిచేసి, బీసీ కులాలు తమ సత్తాను చాటుకోవాలన్నారు. ముఖ్యంగా అనంతపురం నగరపాలక సంఘంగా, నగరంగా ఏర్పడిన నాటినుండి ఏమాత్రం ప్రాతినిత్యం లేని బెస్తలకు నగర్ మేయర్ స్థానం కేటాయించాలి. 20వేల ఓట్లు కలిగిన బెస్తలకు ప్రాధాన్యతనివ్వాలి. అలాగే ఐదు కార్పొరేటర్ స్థానాలను కేటాయించాలి, అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపాలిటీలలో కనీసం ఐదుకు తగ్గకుండా కౌన్సిలర్ స్థానాలు, జిల్లా పరిషత్, ఎంపిటిసి, గ్రామ పంచాయితీ ఎన్నికలలో సముచిత స్థానం కల్పించాలన్నారు. బెస్తలను ఏ పార్టీ గౌరవిస్తుందో వారికి రాజకీయాలకు అతీతంగా బెస్త అభ్యర్థులను గెలిపించుకోవడానికి తీవ్రంగా కృషి చేస్తామని తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కెవి రమణ, హరినాథ్ బాబు వర్కింగ్ ప్రెసిడెంట్, రాజేశ్వరి ట్రెజరర్, రామకృష్ణ, చైర్మన్ గంగమ్మ పోలేరమ్మ దేవాలయం, గంగప్ప, ఉపాధ్యక్షులు, కే.శ్రీనివాసులు జిల్లా కార్యదర్శి, రామాంజనేయులు, వెంకీ, గీత తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాసులు సేవాగుణం స్ఫూర్తిదాయకం-వస్త్ర వితరణలో ఎంఈఓ గంగప్ప

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణంలో ఎంతో మంది ధనికులు ఉన్నప్పటికీ వారెవరికి లేని సేవాగుణం పాంచజన్య శ్రీనివాసులుకు ఉందని, సేవా భావంతో ముందుకెళుతున్న మహోన్నత వ్యక్తి, సేవా గుణానికి స్ఫూర్తిగా నిలబడుతున్నారని మండల విద్యాశాఖ అధికారి గంగప్ప కొనియాడారు. మంగళవారం పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో పాంచజన్య భారతి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హిందూపురం పట్టణంతో పాటు రూరల్ మండలం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల పరిధిలోని వివిధ గ్రామాల 1000 వృద్ధులకు చీరలు, ధోతీలు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, ఆర్యవైశ్య సంఘం నాయకులు జెపికె రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేయడానికి పాంచ జన్యాన్ని పూరించిన గొప్ప వ్యక్తి శ్రీనివాసులు అన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలను స్థాపించి సంపాదనే లక్ష్యంగా




చాలామంది ముందుకు వెళుతుంటారు. అయితే శ్రీనివాసులు తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడంతో పాటు ఎంతో మంది నిరుపేదలకు నేను ఉన్నానంటూ వారి కష్టాల్లో తన వంతు సహాయ సహకారాలను అందిస్తున్నారు. సాయి సదన్ లో ఉన్న విద్యార్థులకు ఉచిత విద్యను అందించడంతో పాటు వారికి అవసరమైన పుస్తకాలు సైతం అందించి నిరుపేద విద్యార్థులకు విద్యాదానాన్ని చేస్తున్నారు. కరోనా విపత్కర సమయంలో సైతం వేలాదిమందికి సహాయ సహకారాలను అందించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రికి రోగులకు అవసరమైన మందులను, ఇతర సౌకర్యాలను కల్పించిన గొప్ప వ్యక్తి అన్నారు. దేవుడు అందరికీ ఐశ్వర్యాన్ని ఇస్తారని, అయితే కొందరికి మాత్రమే ఐశ్వర్యంతో పాటు సేవా గుణం ఇస్తారన్నారు. అలాంటి సేవా గుణం ఉన్న వ్యక్తి శ్రీనివాసులు అన్నారు. అందరూ బాగుండాలి అందులో నేనుండాలి అనే సంకల్పంతో సేవా కార్యక్రమాలు చేస్తున్న శ్రీనివాసులను స్ఫూర్తిగా తీసుకొని పట్టణంలో ఎంతోమంది ధనికులు సేవ చేయడానికి ముందుకు రావాలన్నారు. అనంతరం పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ, మానవ సేవయే మాధవ సేవ అన్న సూక్తిని పాటిస్తూ దాతృత్వాన్ని మించిన సంపద లేదని, దేవుడు తనకు ప్రసాదించిన ఐశ్వర్యం లో కొంత భాగమైన ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తున్నన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాల్లో తన కుటుంబ సభ్యులతో పాటు, తన కుటుంబ సభ్యులుగా భావించే పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను సైతం భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ఇందులో కొంతమంది అయినా ప్రజలకు సేవ చేయడానికి ముందుకు వస్తే తన కల సాకారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు పాంచజన్య భారతి, పాఠశాల అకాడమిక్ డైరెక్టర్లు స్మిత, నందిత, కరస్పాండెంట్ నందకుమార్, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ నాయకులు వేణుగోపాల్, రియాజ్, పాఠశాల ఏ ఓ భాస్కర్, హెచ్ఎం గాయిత్రి, పాఠశాల సూపరింటెండెంట్ విజయేంద్ర, ఏహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యం

## -43 మందికి రూ.12.30 లక్షల సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ -టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసాగా నిలుస్తోందని టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర బాలాజీ లు పేర్కొన్నారు. అర్హులైన బాధితులకు సహాయ నిధి అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసం వద్ద 43 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 12,30,000 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు వెంకటేష్, పరిమళ, శ్రీదేవి, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# రంగనాథ స్వామి దేవస్థానంలోకేరళ సాంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో దేవ ప్రశ్న పూజా కార్యక్రమాలు కేరళకు చెందిన దైవజ్ఞులు సిద్ధాంతి డిఎస్ మహేంద్ర కుమార్ నేతృత్వంలోని సిద్ధాంతుల బృందం సోమవారం అర్ధరాత్రివరకు నిర్వహించారు. పులివెందుల ఎమ్మెల్సీ భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డి సహకారంతో శ్రీ రంగనాథ స్వామి భక్తజన సమాజం సహాయంతో నిర్వహించిన ఈ కార్యక్రమాలలో సోమవారం ఉదయం నుంచి సిద్ధాంతులు డిఎస్ మహేంద్ర కుమార్ రాసి చక్రము, ఇతర పూజా కార్యక్రమాలు కేరళ సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించారు. లోక కళ్యాణం కోసం, శ్రీ రంగనాథ స్వామి వారి ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు నిమిత్తం ఈ కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం ఉదయం కేరళ సిద్ధాంతుల బృందానికి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి ఆలయ ఈవో కె.వి రమణ నేతృత్వంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి రంగనాథ స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం దేవ ప్రశ్న కార్యక్రమంలో ఈ సిద్ధాంతులు పాల్గొని సంబంధిత శ్రీ రంగనాథ స్వామి ఆలయ భూత, భవిష్యత్, వర్తమాన కార్యక్రమాలకు వారు లెక్కలు కట్టారు. వాటిని నమోదు చేసుకున్నారు. కేరళకు చెందిన సంప్రదాయ పద్ధతుల్లో గవ్వలు ఇతర పూజా సామాగ్రితో ఈ కార్యక్రమాలను ఆయన నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం స్థానిక శ్రీ గోదా మాత మండపంలో భక్తులు, పురజనులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భక్తుల నుంచి వివిధ రకాల సమాచారాన్ని ప్రశ్నల రూపంలో సేకరించారు. భక్తులు , పుర ప్రముఖులు వెల్లడిచేసిన పలు అంశాలకు ఆయన వివరించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రాత్రి వరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కెవి రమణ కార్యక్రమం నిర్వాహకులు మేడం దినేష్ కుమార్ గుప్తా,శ్రీ రంగనాథ ట్రస్ట్ సీఈవో అల్లం రంగనాయకులు రాయల్, శ్రీ చైతన్య విద్యా సంస్థల అధిపతి ఆరవేటి నారాయణరెడ్డి, మాజీ చైర్మన్ పబ్బతి నారాయణ, ఒనిడా సుబ్బారెడ్డి ,చాపాటి చంద్రమోహన్ రెడ్డి, గ్రంథాల య సంస్థ జిల్లా అధ్యక్షులు దాసరి భాను ప్రకాష్ ,బిజెపి నాయకులు నవీన్ కుమార్, తిరుపాల్రెడ్డి, చల్లా వంశీయులు నారాయణస్వామి, చంద్రశేఖర్ నాయుడు, జయరాం రెడ్డి, ఆదినారాయణ, ప్రొద్దుటూరు నారాయణ, టిడిపి నాయకులు జ్ఞానేశ్వర్ నాయుడు, పుష్ప నాథ్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు నవీన్ కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ యువ నాయకుడు రితేష్ రెడ్డికి దసరా ఆహ్వానం

### శాలువాలతో సత్కరించి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం పలికిన ఆర్యవైశ్య సంఘం నాయకులు



ప్రజాభూమి పోరుమామిళ్ల, :

కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణం లో నిర్వహించనున్న దసరా శరన్న వరాత్రుల మహోత్సవాలకు ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ యువ నాయకుడు రితేష్ రెడ్డిని ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాలతో సత్కరించి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. పోరుమామిళ్ల ఆర్యవైశ్య సంఘం కమిటీ అధ్యక్షుడు విశ్వనాధుల ప్రసాద్, ఉపాధ్యక్షుడు తులసి సుధాకర్‌తో పాటు కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజలు, అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సంప్రదాయబద్ధంగా శాలువాలతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందజేశారు. దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా దసరా పండుగ ఆధ్యాత్మిక ప్రాధాన్యతను, ఆహ్వాన సంప్రదాయాన్ని చాటిచెప్పారు. ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అనాథకు కన్న కొడుకుల్లా అంత్యక్రియలు చేసిన వివేకానంద ఫౌండేషన్



ప్రజాభూమి పోరుమామిళ్ల :

ఆయన అనాథ. కానీ ఆఖరి ప్రయాణంలో మాత్రం ఆయనకు నలుగురు కొడుకుల్లా భుజం మోశారు. పేగు బంధం లేకపోయినా మానవత్వంతో అంతిమ సంస్కారం చేసి, సేవాతత్పరతను చాటుకుంది వివేకానంద ఫౌండేషన్. కడప టౌన్ ఎర్రముక్కపల్లెకు చెందిన అంకన్న జీవితం పోరుమామిళ్ల బస్టాండ్‌లో ముగిసింది. ఇల్లు లేదు, ఆస్తి లేదు.. గత కొంతకాలంగా యాచిస్తూ బతుకుతున్నాడు. సోమవారం రాత్రి కాలికి తీవ్రమైన ఇన్ఫెక్షన్‌తో పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రి మెట్లెక్కాడు. వైద్యులు పరిశీలించి "ఇన్ఫెక్షన్ ఎక్కువైంది, కాలు తీసేయాలి, వెంటనే కడప రిమ్స్‌కు వెళ్లాలి" అని చెప్పారు. కానీ వెళ్లే దిక్కు లేక సోమవారం రాత్రి బస్టాండ్‌లోనే పడుకున్నాడు. ఆ నిద్రే చివరి నిద్ర అయింది. మంగళవారం ఉదయం ఎవరూ లేని అనాథలా కన్నుమూశాడు. విషయం తెలిసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పంచనామా చేసి, ఇలాంటి అనాథలకు అండగా నిలిచే వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన రామకృష్ణారెడ్డి, తమ సంస్థ సభ్యులు సుంకె వెంకటేశ్వర్లు, చిన్ని సునీల్ కుమార్, పులి వెంకట రెడ్డిలతో కలిసి మృతదేహాన్ని తమ వైకుంఠరథంలో తీసుకెళ్లి ఓబులాపురం సమీపంలోని సగిలేరు నది ఒడ్డున సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు..

# వైయస్ అవినాష్ రెడ్డి అరెస్ట్ కు కుట్ర మాజీ ప్రభుత్వ సలహాదారుడు నాగార్జున రెడ్డి



ప్రజాభూమి పోరుమామిళ్ల :

వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో వైయస్ అవినాష్ రెడ్డిని. అరెస్టుచేసేదానికి ప్రభుత్వం కుట్రకు ప్రయత్నిస్తున్నదని నాగార్జున రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ వైయస్ వివేకానంద పై హత్య జరిగింది ఏడు సంవత్సరాలు పైగా అయినను ఇంతవరకు అసలైన దోషులను గుర్తించలేదని ఈ ప్రభుత్వం. వైఎస్ అవినాష్ రెడ్డి కేసులో ఇరికించే దానికి మరియు ఈడీ కేసులో అరెస్టు చేసే దానికి ప్రయత్నాలు జరుగుతున్నా యని తెలుస్తుంది .ఈ స్థానిక మున్సిపాలిటీ. స్థానిక సంస్థల ఎన్నికల్లో అడ్డులేకుండా చేసేదానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని . వై ఎస్ వివేకానంద రెడ్డి కుమార్తె సునీత ఆమె భర్త ఇద్దరు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని అనేక. దపాలుగా కలవడం. వారు చెప్పిన విధంగా నడుచుకోవడం.జరుగుతున్నదని హైకోర్టులో సుప్రీంకోర్టులో సిబిఐ కోర్టులో కేసు నడుస్తున్నాయని వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొంత చిన్నాన్నను. చంపుకునేంత దుర్మార్గుడు కాదని. ఆయన బ్రతికే ఉంటే వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రాజకీయాల్లో అన్ని విధాలుగా సపోర్టు ఉండేదని అన్నారు. రాజకీయ లబ్ధి కోసం జగనన్నకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరాభిమానాలను. ఓర్వలేక కేవలం. ఏదో విధంగా అధికార పార్టీ కుతంత్రాలు చేస్తున్నదని. పులివెందల్లో వైఎస్ కుటుంబానికి ఉన్నంత గౌరవం అభిమానం ఆప్యాయత ఇక ఏ నాయకుడికి లేదని. పులివెందుల నియోజకవర్గంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు. మళ్లీ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు. రాష్ట్రంలోనే నెంబర్ వన్ పులివెందుల. నియోజకవర్గంగా అన్ని విధాల అభివృద్ధి చేశారని అది ప్రజలందరూ గుర్తు పెట్టుకున్నారని. పులివెందుల. అంటే వైయస్సార్ అని. వైఎస్ఆర్ అంటే పులివెందుల అని. రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని నాగార్జున రెడ్డి పేర్కొన్నారు.

# అన్నపూర్ణాదేవి అలంకారంలో మంగళగౌరి అమ్మవారు



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన శ్రీ మంగళగౌరి సమేత అమరలింగేశ్వర స్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మూడో రోజు మంగళగౌరి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ అమ్మవారిని వివిధ అలంకారాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో చార్జీల పెంపుకు ప్రజలు సహకరించాలి-ఏఐటీయూసీ

### ఆటో డ్రైవర్ సేవ 15000 మరచిన కూటమి ప్రభుత్వం, ఆటో కార్మికులు ఆగ్రహం.

### ఒక మనిషికి ఆటో ఛార్జి 20 రూపాయలు పెంపుకు మండల ప్రజలు సహకరించాలి ఏఐటియుసి

ప్రజాభూమి పోరుమామిళ్ల :

కూటమి ప్రభుత్వం మూడేళ్ల పరిపాలనలో ఆటో కార్మికులకు 15 వేల రూపాయలు అకౌంట్ లో జమ చేయడంలో పూర్తిగా విఫలమైనారని సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, సిపిఐ మండల కార్యదర్శి రవికుమార్, చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిలుటద్దమని వారు ఆవేదన చెందారు. పోరుమామిళ్ల ఆటో డ్రైవర్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటియుసి అనుబంధ సంఘం ఆధ్వర్యంలో స్థానిక రంగసముద్రం పార్క్ వద్ద ఆటో కార్మికుల సమావేశం పిడుగు పేరయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ ఆటో స్పేర్ పార్ట్స్, రిజిస్ట్రేషన్ ఫీజులు తగ్గించాలని,ఆటో కార్మికులు ఫైనాన్స్ కాంతుల కట్టలేక, స్కూల్ ఫీజులు, విద్యుత్ బిల్లులు, ఆటోలు పెంచిన రిజిస్ట్రేషన్ ఫీజులు, ఎఫ్ సి, ఇన్సూరెన్స్ రేట్లు తగ్గించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని వారన్నారు. అలాగే ఆటో కార్మికుల కడుపు కొడితే జీవో నెంబర్ 21, 31 జీవోను రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు షూరిటీ లేకుండాఇవ్వాలని, బాడుగ ఇండ్లలో ఉన్న ఆటో కార్మికులకు మూడు సెంట్లు ఇంటి జాగా ఇవ్వాలని, ఏఐటీయూసీ మండల సమితిగా తెలియజేస్తున్నాము. ఈ విధమైన సమస్యలపై ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని పోరుమామిళ్ల తాసిల్దార్, విజయ్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్ పోలీసు వారికి విన్నపత్రం అందజేయడం జరిగింది అలాగే మండలంలోని 20 పెంపుకు ఆటో కార్మికులకు సహకరించాలని మనవి చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ మండల కార్యదర్శి అబ్దుల్ ఖాదర్, చంద్ర, శ్రీనివాసులు, జయన్న, బాబు, సుధాకర్, గుర్రప్ప, ప్రభాకర్, అబ్దుల్ అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.






# స్థానిక ఎన్నికల్లో వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది

### గతంలో ప్రత్యర్థుల నామినేషన్లను అడ్డుకున్న విషయాన్ని మరిచిపోయారా?



ప్రజాభూమి, సిద్ధవటం: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రత్యర్థులను ఇబ్బందులకు గురిచేశారని జనసేన రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ విమర్శించారు. మంగళవారం సిద్ధవటంలో ఆయన మాట్లాడుతూ, గతంలో ఏకగ్రీవాల పేరుతో ప్రత్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్న ఘటనలు వైసీపీ నేతలకు గుర్తులేవా అని ప్రశ్నించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రత్యర్థులపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసిన వైసీపీకి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఓటమి భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. గతంలో వైసీపీ చేసిన అరాచకాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయాన్ని సాధిస్తారని అతికారి కృష్ణ ధీమా వ్యక్తం చేశారు.

# ఎల్ నినో ప్రభావం , వ్యవసాయ పంటలపై పరిశీలనలో భాగంగా బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ను కలిసిన కేవీకే శాస్త్రవేత్తలు

ప్రజాభూమి పోరుమామిళ్ల :

బద్వేల్ నియోజకవర్గం, పోరుమామిళ్ల మండలం గురప్పగారిపల్లె సమీపంలో బద్వేల్ ఏఎంసీ చైర్పర్సన్ నారిశెట్టి సుప్రజను ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బాలకృష్ణ, నసీర్ తదితరులు పంటల పరిశీలన గురించి మాట్లాడటం జరిగింది .ఈ సందర్భంగా రైతులకు నాణ్యమైన విత్తనాలు, మొక్కలు, కిచెన్ గార్డెన్ కిట్ల సరఫరా, ఉద్యాన పంటల అభివృద్ధి, ఆధునిక వ్యవసాయ పద్ధతులు తదితర అంశాలపై చర్చించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, నాటే మొక్కలు అందించడం ద్వారా పంటల దిగుబడిని మెరుగు పరచడం, వ్యవసాయ రంగ అభివృద్ధికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరవేయడం వంటి అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బాలకృష్ణ, నసీర్ , ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మానసా దేవి ఆలయానికి పోటెత్తిన మహిళా భక్తులు



ప్రజాభూమి, సిద్ధవటం:

కడప--చెన్నై జాతీయ రహదారిలోని కనుమలోపల్లి సమీపంలో వెలసిన శ్రీ మానసా దేవి అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం మహిళా భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు మాట్లాడుతూ, ప్రతి పౌర్ణమి, అమావాస్య రోజుల్లో అమ్మవారిని దర్శించుకుంటామని తెలిపారు. ఆలయ ధర్మకర్త లక్ష్మయ్య భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, ఆలయానికి వచ్చే ప్రతి ఒక్కరికీ అన్నప్రసాద వితరణ చేపడుతున్నారని పేర్కొన్నారు. భక్తుల కుటుంబ సమస్యలు, ఆరోగ్య సమస్యలు తొలగిపోవాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శర్మ తదితరులు పాల్గొన్నారు.

# రూ.4.84 లక్షలు పలికిన నిత్యపూజయ్య తలనీలాల వేలం



ప్రజాభూమి, సిద్ధవటం:

లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్య పూజేశ్వర స్వామివారి కార్తీక మాస తలనీలాల వేలంపాట రూ.4,84,000లకు ప్రొద్దుటూరుకు చెందిన మునిశేఖర్ దక్కించుకున్నారు. మంగళవారం సిద్ధవటంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ అధికారులు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో ప్రొద్దుటూరు, గుంతకల్, చాపాడు, వంతాటిపల్లి గ్రామాలకు చెందిన పలువురు పాల్గొన్నారు. దేవస్థానం నిర్ణయించిన రూ.3 లక్షల కనీస ధరను అధిగమించి, మునిశేఖర్ అత్యధికంగా రూ.4.84 లక్షలకు వేలంపాటను దక్కించుకున్నారు. నవంబర్ 10 నుంచి డిసెంబర్ 8 వరకు కార్తీక మాసంలో భక్తులు స్వామివారికి మొక్కుబడిగా సమర్పించే తలనీలాల సేకరణకు ఈ వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో పి. సురేష్ కుమార్ రెడ్డి, ఇన్స్పెక్టర్ జనార్ధన్, ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్, పాలకవర్గ సభ్యుడు శివారెడ్డి, ఆలయ సిబ్బంది చంద్ర, వంతాటిపల్లి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# లింగంపల్లి ప్రభుత్వ భూమి వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ప్రజాభూమి, సిద్ధవటం: కడప జిల్లా సిద్ధవటం మండలం లింగంపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 164లో ఉన్న భూమి వద్ద రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. రీసెటిల్‌మెంట్ రిజిస్టర్ (ఆర్ఎస్ఆర్) ప్రకారం 101.09 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ భూమి కొండ, ప్రభుత్వ భూమిగా నమోదై ఉందని అధికారులు తెలిపారు. ఈ భూమికి సంబంధించి సిద్ధవటం కోర్టులో వా.వా. నంబర్లు 06/2025, 07/2025, 65/2026 కింద కేసులు విచారణలో ఉన్నాయని పేర్కొన్నారు. కోర్టు తుది తీర్పు వెలువడిన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని, అప్పటివరకు సదరు భూమిని ప్రభుత్వ భూమిగానే పరిగణిస్తామని వీఆర్వో రజిని, వీఆర్ఏ కిషోర్ స్పష్టం చేశారు.

# మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా వైఎస్ ప్రమీలమ్మ

### భారీ మెజార్టీతో గెలిపించాలి - వైఎస్ మనోహర్ రెడ్డి, మదనమోహన్ రెడ్డి లు



ప్రజాభూమి, పులివెందుల

జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో పులివెందుల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా వైఎస్ ప్రమీలమ్మను వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించారని మున్సిపల్ వైకాపా ఇన్చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, తొండూరు మండల వైకాపా ఇన్చార్జి వైఎస్ మదనమోహన్ రెడ్డి తెలిపారు.మంగళవారం మనోహర్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. చైర్మన్ అభ్యర్థిగా వైఎస్ ప్రమీలమ్మను, 40 వార్డులలో వైకాపా అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.కూటమి ప్రభుత్వం కుట్రలను, దాడులను తిప్పికొట్టేందుకు వైకాపా శ్రేణులు సిద్ధంగా ఉండాలని, వారి అరాచకాలకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పట్టణంలో వైఎస్ మదనమోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు పోటీ చేస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని, పార్టీ అధికారిక అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మేనని స్పష్టం చేశారు.అనంతరం వైఎస్ ప్రమీలమ్మ మాట్లాడుతూ.. రెండోసారి తనకు చైర్మన్ గా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# చైర్మన్ అభ్యర్థి ప్రమీలమ్మను, 40 మంది కౌన్సిలర్లను భారీ మెజారిటీతో గెలిపిస్తాం - వైకాపా నేతలు

### పులివెందులను అభివృద్ధి చేసింది జగనన్నే.. ప్రజలు మా వైపే ఉన్నారు



ప్రజాభూమి, పులివెందుల

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మను, 40 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని మాజీ చైర్మన్ రసూల్, వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఇరికిరెడ్డి వీరారెడ్డి, ఎస్టీ నాయకులు అంజనప్ప, చలపతి, వెంకటపతిలు స్పష్టం చేశారు.మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పులివెందులను అభివృద్ధి చేసింది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డేనని, ఆయన చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజలు తమ వైపే ఉన్నారన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా పులివెందుల మున్సిపాలిటీకి ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదని విమర్శించారు. మున్సిపాలిటీలో వీధి దీపాల కొరత తీవ్రంగా ఉందని, చెత్త సేకరించే వాహనాలకు డీజిల్ పోసేందుకు కూడా డబ్బులు లేకపోవడం దారుణమన్నారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని, కూటమి నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా ధీటుగా ఎదుర్కొంటామని అన్నారు. ఎన్నికలను ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించేలా అధికారులు చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళితుల శ్మశాన వాటికను కాపాడండి

### - కేవీపీఎస్ డిమాండ్




ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు
తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామంలోని దళితుల శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో దళితులు మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ దళితులు అనాదిగా వినియోగిస్తున్న శ్మశాన స్థలాన్ని మాజీ సర్పంచ్ కంచి సుబ్బయ్య ఆక్రమించుకున్నారని ఆరోపించారు. రీ-సర్వే పేరుతో రెవెన్యూ అధికారులు శ్మశాన స్థలాన్ని సైతం సుబ్బయ్యకు కట్టబెట్టారని విమర్శించారు. సర్వే నంబర్లు 127, 128లోని శ్మశాన వాటిక భూమిపై సమగ్ర సర్వే నిర్వహించి, వాస్తవాలను నిర్ధారించాలని రెవెన్యూ అధికారులను కోరారు. అదేవిధంగా తొట్టంబేడు మండలంలో జరుగుతున్న అక్రమ ఇసుక, మట్టి వ్యాపారాలపైనా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ భారతికి వినతిపత్రం అందజేశారు. కేవీపీఎస్ నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, చియ్యవరం దళితులు పాల్గొన్నారు.

## తిరుపతి పార్లమెంట్ - శ్రీకాళహస్తి నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్తగా అవకాశం కల్పించిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కి ధన్యవాదాలు

### - శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి



ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్
రానున్న స్థానిక సంస్థలను దృష్టిలో ఉంచుకుని శ్రీకాళహస్తి సమన్వయకర్తగా అవకాశం కల్పించిన పవన్ కళ్యాణ్ కి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. పార్టీ నా పై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా జనసేన పార్టీ పోటీ చేసే స్థానాలలో 100 % స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యంగా పని చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను. రాబోవు ఎన్నికలలో పోటీ చెయ్యాలనుకునే జనసేన నాయకులు / కార్యకర్తలకు అండగా ఉంటూ వారి విజయానికి పూర్తి సహకారం అందిస్తూ పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ కళ్యాణ్ నమ్మకాన్ని నిలబెడుతానని ఈ సందర్భంగా తెలియజేసుకుంటున్నాను

## వైభవంగా శ్రీ దశమహావిద్యా దేవతలదివ్యోత్సవములు

### శ్రీ బగళాముఖీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రాపురం
రామచంద్రపురం మండలం రాయల చెరువు లో వెలసియున్న శ్రీ శక్తి పీఠం మంగళవారం శ్రీ దశమహావిద్యా దేవతల దివ్యోత్సవములు, ముడవ రోజు కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరా నందభారతీ మహాస్వామి దివ్య సమక్షంలో మంత్ర మహేశ్వరి శ్రీ శక్తి పీఠాదీశ్వరి మాతాజీ శ్రీ రమ్యానందభారతీ స్వామినీ వారి



ఆధ్వర్యంలో అంగరంగ వైభవముగా జరుగుతున్నాయి. శ్రీ బగళాముఖీ దేవి కి విశేష పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఆనంతరం శ్రీ మరకత శక్తికాళీ దేవికి శ్రీ బగళాముఖీ దేవి రూప అలంకరణలో , విశిష్ట పూజ, హోమము, పూర్ణాహుతి నిర్వహించారు. స్త్రీమూర్తులకు సువాసిని పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమనికి దేశ విదేశాల నుండి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని గురువుల, దేవతల అనుగ్రహమును పొందారు. అందరికీ అన్న ప్రసాద వితరణ చేయడము జరిగినది.సాయంత్రం కళాకారులచే గాన కచేరి, జగద్గురువుల దివ్య సమక్షంలో పూజ్యశ్రీ మాతాజీ వారిచే శ్రీ మరకత శక్తికాళీ దేవికి దర్బారు సేవా నిర్వహించారు.ఈ కార్యక్రమనికి దేశ విదేశాల నుండి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అందరికీ అన్న ప్రసాద చేశారు.

## కల్వర్టు పనులతో ట్రాఫిక్‌కు అంతరాయం

**నాణ్యతలేని మళ్లింపు రహదారిపై అదుపుతప్పి పక్కకు ఒరిగిన గ్రావెల్ ట్రిప్పర్**




ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ
తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని ఎన్టీఆర్ నగర్ మలుపు వద్ద కల్వర్టు పునర్నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది కల్వర్టు పనుల కారణంగా ప్రధాన రహదారి పక్కకు వాహనాలను మళ్లించేందుకు తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేశారు. అయితే ఈ మళ్లింపు రహదారి సరిగా నిర్మించకపోవడంతో భారీ లోడుతో వెళ్తున్న గ్రావెల్ ట్రిప్పర్ అదుపుతప్పి రహదారి పక్కకు ఒరిగిపోయింది. కల్వర్టు పునర్నిర్మాణ పనులు చేపట్టే సమయంలో వాహనాల రాకపోకలకు అనువుగా, ప్రమాదాలు జరగకుండా తాత్కాలిక మళ్లింపు రహదారిని పటిష్టంగా నిర్మించాల్సిన అవసరం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మళ్లింపు రహదారిని సురక్షితంగా తీర్చిదిద్ది, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## రేణిగుంటలో రూ.6 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభం- త్వరలో రూ.30 కోట్లతో డ్రైనేజీ పనులు

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
రేణిగుంట పట్టణం, మండల పరిధిలో రూ.6 కోట్లతో చేపట్టనున్న బీటీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రారంభించారు..కరిమారమ్మ గుడి ప్రాంతం, తిమ్మయకుంట, తదితర ప్రాంతాల్లో రోడ్ల పనులు చేపట్టారు. రహదారుల అభివృద్ధితో ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తగ్గుతాయని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే, పంచాయతీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు త్వరలో రూ.30 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పార్లమెంటు ఉప అధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబాషా, నాదముని రెడ్డి, క్లస్టర్ పుష్పనాదం, రాజశేఖర్ రెడ్డి, సింగల్ విండో భాస్కర్‌రెడ్డి, మాధవరెడ్డి, కాపిరెడ్డినాదముని రెడ్డి,ముచ్చెలి భాస్కర్ రెడ్డి, మైనారిటీ నాయకులునవాబ్, కుమారస్వామి రెడ్డి,అంబికాపతి, విద్యాసాగర్, కిరణ్, హామీద, లువియానా మేరీ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

# అధికారులే రేకుల షెడ్డును వేసుకోమంటారు.. అధికారులే జెసిపి తో కూల్ చేస్తారు..

**● కమిషనర్ సాబ్..ఈ అక్రమణ రేకుల షెడ్డు నిర్మాణం మీ కంటికి కనిపించదా..! ● ఆక్రమణలు తొలగించాలని కమిషనర్ కు ఫిర్యాదు చేసిన పట్టణ వాసులు. ● ట్రినిటీ హాస్పిటల్ నుండి, తుమ్మూరు టిటిడి కళ్యాణ మండపం వరకు జోరుగా ఆక్రమణలు..! ● పెద్దలకు ఒక న్యాయం-బలహీన వర్గాల పేదలకు మరో న్యాయం..! ● ఆక్రమణలు పూర్తిగా తొలగించాలని ఫిర్యాదులు. ● నేషనల్ హైవే-71 ప్రభుత్వ స్థలాలను ఆక్రమణలపై ఫిర్యాదులు..!**

**● ఏందయ్యా కమిషనర్ గారు నీకు న్యాయమా..! ● ఎన్ హెచ్-71 స్థలాలతో నీకేంటి పనయ్యా కమీషనర్ గారు..!**

**● మూటల పెద్దలు మాటలే.. మున్సిపల్ కమిషనర్ కు వేదం. ● ఆక్రమణలకు సహకరిస్తున్న మున్సిపల్ కమిషనర్..?**

**● నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ తీరుపై పట్టణ ప్రజలు సారిత్రక విమర్శలు..!**



ప్రజాభూమి ప్రతినిధి(నాయుడుపేట).
సూలూరుపేట నియోజకవర్గం మండల డివిజన్ అయిన నాయుడుపేట ఎన్ హెచ్-71 కి సంబంధించిన ప్రభుత్వ స్థలాల్లో పట్టణంలోని తుమ్మూరు టీటీడీ కళ్యాణమండపం నుండి, ట్రినిటీ హాస్పిటల్ వరకు ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు గురవుతున్నాయి..ఈ ఆక్రమణ స్థలాలు గురవుతున్న నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు..! అలాగే ఓ నిరుపేద బతుకు జీవన ఉపాధి కోసం అప్పుచేసి చిన్నపాటి షెల్టర్ ఏర్పాటు చేసుకున్న ఓ నిరుపేద వ్యక్తి నిర్మాణాన్ని మున్సిపల్ కమిషనర్ మరసిటి రోజే తమ సిబ్బందితో జెసిబి ని పంపించి తొలగిం చినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.. అదే క్రమంలో జాతీయ రహదారి 71 పరిసరాల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు ఉన్నాయి అధికారుల దృష్టికి వస్తున్న చర్యలు మాత్రం ప్రశ్నలకు సమాధానంగా మిగి లిపోతున్నాయి..! మున్సిపల్ కమిషనర్ ఆక్రమించుకొని షెడ్లను ఏర్పాటు చేసుకున్న వ్యక్తుల వద్ద భారీగా ముడు పులు తీసుకుని చిరస్థాయిగా కట్టుకోవడమే కాకుండా, రూములను అద్దెలకు ఇవ్వడం జరుగుతుండడంతో అలాంటి వారిపై చర్యలు తీసుకోకుండా కూటమి నాయకుల మాటతో వారికి సహకరిస్తున్నట్లు ప్రజల నుండి సమాచారం..ఎన్ హెచ్ -71కి సంబంధించిన రోడ్లో డి.ఎస్.ఆర్ కళ్యాణమండపం ఎదురుగా కొంతమంది పెద్దలు ఆక్రమణలు చేపట్టి రేకుల షెడ్లు నిర్మాణాలు కట్టడాలు చేస్తుంటే మున్సిపాలిటీ కమిషనర్ కు అవి కనిపించవా,లేక వాటిని చూసి చూడనట్టు ఉంటే ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.. అలాకాకుండా, పెద్దలకు ఒక న్యాయం,బలహీన దళితులకు మరో న్యాయమా అన్నట్టు మౌనవ్రతం చేస్తున్న నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ తీరుపై నాయుడుపేట ప్రజలకు అర్థం కాక విమర్శలు చేస్తున్నారు..! అక్రమ కట్టడాలపై కనీసం ఉన్నత అధికారులు విచారించి ఈ ఆక్రమణలను తొలగించాలని నాయుడుపేట పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తూ కోరుకుంటున్నారు..

# సురభి గోసంరక్షణశాలలో వైభవంగా దసరా ఉత్సవాలు

### శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో అమ్మవారి ఆరాధన - లోకకల్యాణమే ప్రధాన సంకల్పం





ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం
తిరుపతి జిల్లా సురవరిపల్లిలోని శ్రీ సురభి గోసంరక్షణశాలలో పూజ్యశ్రీ ప్రతాప్ స్వామీజీ వారి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు అమ్మవారిని శ్రీ గాయత్రీ దేవి రూపంలో ఆరాధిస్తూ, సకల లోకాల శ్రేయస్సు, సమస్త ప్రజల సుఖసంతోషాలు, లోకకల్యాణం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. వేదమాతగా ప్రసిద్ధి చెందిన శ్రీ గాయత్రీ దేవి జ్ఞానానికి, ఆధ్యాత్మిక చైతన్యానికి, సద్బుద్ధికి ప్రతీకగా భక్తులచే పూజించబడుతుంది. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరికీ జ్ఞానవృద్ధి, ఆరోగ్యం, ఐశ్వర్యం, మానసిక ప్రశాంతత కలగాలని, సమాజంలో ధర్మం, దయ, సేవాభావం మరింతగా విస్తరించాలని ఈ సందర్భంగా ప్రార్థిస్తున్నారు. పూజ్యశ్రీ ప్రతాప్ స్వామీజీ వారి మార్గదర్శకత్వంలో నిర్వహిస్తున్న ఈ దసరా ఉత్సవాల ప్రధాన లక్ష్యం లోకకల్యాణం. దైవారాధనతో పాటు గోమాతల సంరక్షణ, ప్రకృతి పరిరక్షణ, సకల జీవరాశుల పట్ల కరుణ, మానవ సేవ వంటి సనాతన ధర్మ విలువలను ప్రజల్లో పెంపొందించడం ఈ కార్యక్రమాల అంతరార్థం. సురభి గోసంరక్షణశాల ద్వారా నిర్వహిస్తున్న గోసేవ కార్యక్రమాలు జీవకారుణ్యానికి, ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తున్నాయి. గోమాతలను సంరక్షించడం, మూగజీవాలకు సేవ చేయడం, సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడం ద్వారా సర్వజీవుల సంక్షేమానికి కృషి చేయాలనే సందేశాన్ని ఈ ఉత్సవాలు అందిస్తున్నాయి.అమ్మవారి దివ్య అనుగ్రహంతో ప్రకృతి సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతోజీవించాలని, ప్రపంచమంతా శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థిస్తున్నారు.

## అఖిలపక్షపార్టీల ధర్నా




ప్రజాభూమి ప్రతినిధి, తిరుపతి:
రణధీర్ పురం గ్రామపంచాయతీలో అక్రమంగా నిలిపివేసిన పంచాయతీ కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని బిటిఆర్ కాలనీ సచివాలయం వద్ద వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ, సి పి ఎమ్, ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది.నిలిపివేసిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సచివాలయంలో కూటమి ప్రభుత్వ రాజకీయ జోక్యం ఉండకూడదు అని కార్మికుల కడుపు కొట్టే చర్యలు మనకొక పోతే పెద్ద ఎత్తున్న పోరాటం చేస్తాం అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పీఎం లక్ష్మీనారాయణ, సి పి ఎమ్ నగర కార్యదర్శి వేణుగోపాల్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాలసుబ్రమణ్యం,జిల్లా అధ్యక్షుడు నాగేష్ లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రణధీర్ పురం గ్రామపంచాయతీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ రజాక్ అధ్యక్షతన జరిగినది. ఇంకా ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లెమొగ్గల ఉమాపతి, బైరెడ్డి రమేష్,రుద్రగోపి, భూదేవి,కుమారి, మురళి, భాస్కర్ యాదవ్, దినేష్, మాబూ,సతీష్ మరియు పెద్దసంఖ్యలో పంచాయతీ ప్రజలు పాల్గొని తమ నిరసనని తెలియజేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం సమర్పించారు.

## నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పావని ని మర్యాదపూర్వకంగా కలిసిన దేవస్థానం చైర్మన్, జనసేన నాయకులు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి టౌన్
శ్రీకాళహస్తికి నూతనంగా డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పావని ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మరియు జనసేన పార్టీ నాయకులు శ్రీమతి పావని శాలువాతో సన్మానించి, శ్రీకాళహస్తీశ్వర స్వామివారి ప్రసాదాలను అందజేశారు.శ్రీకాళహస్తి పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నూతన డీఎస్పీగా బి పావని విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు జయ ప్రకాష్, కుమార్,గరికపాటి చంద్ర,మాధవ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాయుడుపేటలో క్షుద్రపూజల కలకలం!

### ఇంటి మిద్దెపై నవధాన్యాలు, పసుపు, నిమ్మకాయలు.. భయాందోళనలో కుటుంబ సభ్యులు

### గుర్తుతెలియని వ్యక్తుల పనేనంటున్న బాధితులు.. కారకులను గుర్తించాలని స్థానికుల డిమాండ్



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట...
తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని మంగపతినాయుడు నగర్‌లో ఓ ఇంటి మిద్దెపై అనుమానాస్పద పూజా సామగ్రి కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించి వెళ్లారనే అనుమానంతో బాధిత కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది.
వివరాల్లోకి వెళితే.. మంగపతినాయుడు నగర్‌లో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి పేర్నాటి సురేష్ రోజులాగే విధులకు వెళ్లారు. ఈ క్రమంలో ఆయన పిల్లలు ఇంటి మిద్దెపైకి వెళ్లగా అక్కడ నవధాన్యాలు, పసుపు, నిమ్మకాయలతో పూజలు చేసినట్లు ఆనవాళ్లు కనిపించాయి. దీంతో ఒక్కసారిగా భయాందోళనకు గురైన పిల్లలు వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తమకు తెలియకుండా ఇంటి మిద్దెపైకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి, ఉద్దేశపూర్వకంగా క్షుద్రపూజలు నిర్వహించి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అసలు తమ ఇంటినే ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు? మిద్దెపైకి ఎవరు వచ్చారు. దీని వెనుక ఎవరి ప్రమేయం ఉంది? అనే ప్రశ్నలు బాధిత కుటుంబాన్ని కలవరపెడుతున్నాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న నివాస ప్రాంతంలో ఇటువంటి ఘటన వెలుగుచూడటంతో చుట్టుపక్కల ప్రజలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నివాస గృహాలపైకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించడం భద్రతాపరంగా ఆందోళన కలిగించే అంశమని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఘటన వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. అయితే ఇంటి మిద్దెపై లభించిన పూజా సామగ్రిని ఎవరు ఉంచారు? ఏ ఉద్దేశంతో ఉంచారు? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.

## తొట్టంబేడులో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ - బొజ్జల రిషితారెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి తొట్టంబేడు
తొట్టంబేడు మండలానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి పంపిణీ చేశారు.మంగళవారం తొట్టంబేడు మండల అధ్యక్షుడు రావెళ్ల మునిరాజు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండలంలోని బసవయ్యపాలెం, పెద్దకన్నలి, పొయ్య, కురవకనేరి, లింగమనాయుడుపల్లి, పూడి, గుర్రప్పనాయుడుకండ్రిగ, కాసరం, చియ్యవరం, చేమూరు, గుండేలిగుంట, కారకొల్లు, చిట్టత్తూరు, చిలకవారికండ్రిగ తదితర గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.ప్రతి లబ్ధిదారుడికి రూ. 24,000 నుండి రూ. 2,50,000 వరకు వివిధ మొత్తాల్లో చెక్కులు మంజూరయ్యాయి. మొత్తం లబ్ధిదారులకు కలిపి రూ. 21,70,528 (ఇరవై ఒక లక్ష డెబ్బై వేల ఐదు వందల ఇరవై ఎనిమిది రూపాయలు) విలువైన చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గాలి మురళి నాయుడు, కన్నలి ప్రతాపరెడ్డి, కొన్నలి రమేష్,ఉన్నం ప్రసాద్ నాయుడు,శంకర్ నాయుడు,కొత్రపాటి వాసునాయుడు,లెక్కల మురళినాయుడు,బాలాజీ రెడ్డి,తెలుగు యువత అధ్యక్షుడు చందు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం చంద్రబాబు సొంత మండలంలో రూ"49 కోట్లతో మాస్టర్‌ప్లాన్ రోడ్డుకు భూమిపూజ!

- ఐతేపల్లి ( ఎన్ హెచ్ -140) నుంచి రంగంపేట(ఎన్ హెచ్-71) వరకు 100 అడుగుల వెడల్పుతో నూతన రహదారి..
- 5 జాతీయ రహదారులను అనుసంధానించేలా డిజైన్.. రాకపోకలకు సరికొత్త మార్గం..
- ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, జేసీ గోవిందరావు చేతుల మీదుగా ఘనంగా భూమి పూజ..
- టీటీడీ నిధుల మంజూరు.. భూములు ఇచ్చిన రైతులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు..





ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత మండలమైన చంద్రగిరి అభివృద్ధి పథంలో మరో కీలక అడుగు పడింది. చంద్రగిరి మండలంలోని ఐతేపల్లి నుంచి రంగంపేట వరకు 100 అడుగుల వెడల్పుతో నిర్మించనున్న నూతన మాస్టర్‌ప్లాన్ రహదారి నిర్మాణానికి రూ. 49 కోట్ల అంచనా వ్యయంతో మంగళవారం ఘనంగా భూమిపూజ నిర్వహిం చారు. స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టు పనులకు తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి, కొబ్బరికాయ కొట్టి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

**5 జాతీయ రహదారుల అనుసంధానం -- అద్భుతమైన డిజైన్:**
ఐతేపల్లి వద్ద ఉన్న ఎన్‌హెచ్-140 ( ఎన్ హెచ్-140) నుంచి రంగంపేట ఎన్‌హెచ్-71 ( ఎన్ హెచ్ -71) వరకు నిర్మించే ఈ 100 అడుగుల రోడ్డును అత్యంత వ్యూహాత్మకంగా డిజైన్ చేశారు. వడమాలపేట నుంచి ఐతేపల్లి, అక్కడి నుంచి రంగంపేట మీదుగా ఏకంగా 5 జాతీయ రహదారులను అనుసంధానించేలా ఈ మాస్టర్‌ప్లాన్ రోడ్డు నిర్మాణం జరగనుంది. దీనివల్ల తిరుపతి, చంద్రగిరి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు ప్రయాణ సమయం గణనీయంగా ఆదా కానుంది.

**టీటీడీ సహకారం -- ఇచ్చిన మాటకు సీఎం కట్టుబడి ఉన్నారు:**
ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ.. చంద్రగిరి అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, ఇచ్చిన మాటకు కట్టుబడి నిధులు మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు తుడా ఆధ్వర్యంలో పనులు చేపట్టగా, టీటీడీ ద్వారా రూ. 90 కోట్ల నిధుల మంజూరు ప్రక్రియలో భాగంగా ప్రాథమికంగా నిధులు విడుదలయ్యాయని వెల్లడించారు. ఈ మార్గంలో వాగులు, వంకలు, పోరంబోకు స్థలాలు ఉన్న ప్రాంతాల్లో మరింత అనువుగా రోడ్డు విస్తరణ పనులు జరిగేలా పర్యవేక్షిస్తున్నామన్నారు.

**భూములిచ్చిన రైతులకు కృతజ్ఞతలు -- ఆర్థికాభివృద్ధికి బాటలు:**
ఈ రహదారి విస్తరణ కోసం స్వచ్ఛందంగా భూములు అందించిన రైతులకు ఎమ్మెల్యే, అధికారులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ 100 అడుగుల రహదారి పూర్తియితే ఈ ప్రాంతంలో వాణిజ్య, రవాణా రంగాలు ఊపందుకుంటాయని, స్థానిక ప్రాంత రూపురేఖలు మారి రైతులు, వ్యాపారులు, సామాన్య ప్రజలకు సరికొత్త ఆర్థిక అవకాశాలు చేకూరుతాయని నాయకులు పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో చంద్రగిరి రెవెన్యూ అధికారులు, తహశీల్దార్, ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు, తుడా ఇంజనీరింగ్ విభాగం అధికారులు, పంచాయతీ ప్రతినిధులు, భూములు అందించిన రైతులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ఘనంగా అన్నదాన కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట. దేవీ నవరాత్రులు, బ్రహ్మోత్సవాల సందర్భంగా పారిశుధ్య కార్మికులు, వలస కార్మికులు, యాత్రికులకు అన్నవితరణ. శ్రీవారి వార్షికబ్రహ్మోత్సవాలు మరియు దేవీ శరన్నవరాత్రుల పర్వదినాలను పురస్కరించుకుని రేణిగుంట రైల్వే స్టేషన్‌లో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. . బి.ఎం.ఎస్ (బి ఎం ఎస్) జిల్లా కార్యదర్శి వెంకటాద్రి యాదవ్, ఆధ్వర్యంలో రైల్వే ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుధ్య కార్మికులు, వలస కార్మికులు మరియు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రైల్వే యాత్రికులకు భోజనం తాగునీరు పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంలో జాతీయ కార్మిక సలహా కమిటీ సభ్యులు సీనప్ప, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోవతి, అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భక్తుల కోసం, సమాజం కోసం అహర్నిశలు శ్రమించే పారిశుధ్య కార్మికులకు, వలస జీవులకు ఇలాంటి పర్వదినాల్లో అన్నదానం చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. రైల్వే ప్రయాణికులు, కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే యూనియన్ నాయకులు ఓంనాథ రెడ్డి పలువురు రైల్వే ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా కళ్యాణ వేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

**- చిన్నశేష, హంస వాహనాలపై కనువిందు చేసిన స్వామివారు - గోవింద నామ స్మరణతో మారు మోగిన పుర వీధులు**





ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం తుమ్మల గుంటలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గోవింద నామ స్మరణలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణలతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

బ్రహ్మోత్సవాల్లో భాగం గా రెండో రోజు మంగళవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి చిన్నశేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. విశేషంగా అలంకరించిన స్వామివారిని, అమ్మవా ర్లను గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. గోవింద నామ స్మరణతో గ్రామం మారుమోగింది. గ్రామం లోని యువత వాహన బేరర్లుగా సేవలందించగా, గ్రామస్తులు భక్తులకు అన్నప్రసాదాలు, మంచినీరు పంపిణీ చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మీ దంపతులు వాహన సేవలో పాల్గొన్నారు. చెవిరెడ్డి స్వయంగా వాహన బేరర్‌గా మారి స్వామివారి వాహనాన్ని కొంత దూరం మోశారు.

వైభవంగా తిరుమంజనం, ఊంజల్ సేవ నవరాత్రి బ్రహ్మోత్సవాలలో ఉదయం 11 గంటలకు స్వామి వారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం వివిధ పూజా క్రతువులు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తుల సమక్షంలో ఊంజల్ సేవను వైభవంగా నిర్వహించారు.

హంస వాహనంపై స్వామివారి దర్శనం మంగళవారం రాత్రి హంస వాహనంపై స్వామి వారు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుద్దీపాలంకరణల మధ్య సాగిన వాహన సేవ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులతో పాటు తుమ్మలగుంట గ్రామస్తులు పాల్గొన్నారు. వివిధ దేవతామూర్తుల వేషధారణలో చిన్నారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

## పిల్లలుకుంటలు, బావుల వద్దకు వెళ్లవద్దు.. అప్రమత్తంగా ఉండండి - తహసిల్దార్ బాలమ్మ.



ప్రజాభూమి, పుట్లూరు. కుంటలు, బావులు ఆటస్థలాలు కావనీ ప్రమాదాలు పొంచి ఉండే ప్రదేశాలు దసరా సెలవులు ఉన్నందున పిల్లలు ఇంటి వద్దనే ఉండేలాగా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు ఆడుకోవడానికి, ఈత కొట్టడానికి కుంటలు, బావుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. నీటి లోతు తెలియక ప్రమాదవశాత్తు జారిపడి ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంది. అందువల్ల పిల్లలను ఎల్లప్పుడూ గమనిస్తూ, నీటి వనరుల వద్దకు ఒంటరిగా వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రమాదం జరిగినప్పుడు వెంటనే అత్యవసర సహాయం కోసం 112కు, 108 సంప్రదించాలి. తల్లిదండ్రులారా.. అప్రమత్తంగా ఉండండి! పిల్లల భద్రతే మనందరి బాధ్యత. చిన్న నిర్లక్ష్యం.. తీరని విషాదం కావద్దు! కావున తల్లిదండ్రులు తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని బాలమ్మతెలిపారు.

## పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి

### మండల వ్యవసాయ అధికారి ఎన్ అన్వేష్ కుమార్




ప్రజా భూమి శింగనమల

ఈ ఖరీఫ్ సీజన్ (జూన్ నుండి సెప్టెంబర్ వరకు ) నందు పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు వారు సాగు చేసిన పంటకు ( ఈ- కే వై సి ) 13-10-2026, 14-10-2026, 15-10-2026 తేదీల లోపల వ్యవసాయ సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది ని సంప్రదించి పూర్తి చేసుకోవాలని కోరడమైనది మండల వ్యవసాయ అధికారి, శింగనమల మండలం

## నగరపాలక సంస్థ మేయర్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఎస్.వి. ఆర్ట్స్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లు, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**



ప్రజాభూమి ప్రతినిధి,తిరుపతి, తిరుపతి నగరపాలక సంస్థ స్థానిక ఎన్నికలు --2026 నిర్వహణలో భాగంగా ఓట్ల లెక్కింపు కోసం శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో చేపట్టాల్సిన ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎం. జయకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు, వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు హాళ్లు, మేయర్ పదవికి సంబంధించిన ఓట్ల లెక్కింపు హాల్, ఎన్నికల సామగ్రి నిల్వ గదులు, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్ల నిరీక్షణ గదులు, మీడియా గది, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లకు సంబంధించి రూపొందించిన గదుల వారీ ప్రతిపాదనలను పరిశీలించారు. కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన గదుల లభ్యత, అంతస్తుల వారీగా గదుల కేటాయింపు, సిబ్బంది మరియు ఎన్నికల విధులకు సంబంధించిన ఇతర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ప్రతిపాదనల ప్రకారం గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు, రెండవ అంతస్తుల్లో స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ హాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మేయర్ పదవికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కోసం భవనంలోని మొదటి అంతస్తు సెంట్రల్ హాల్‌ను, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటుకు సంబంధించి మొదటి అంతస్తులో 1 నుంచి 18వ వార్డు వరకు, రెండవ అంతస్తులో 19 నుంచి 66వ వార్డు వరకు ఆర్.ఓ. క్లస్టర్ల వారీగా ప్రతిపాదనలు రూపొందించారని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి ఆమోదానికి అనుగుణంగా రెండు స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటుపై నిర్ణయం తీసుకోనున్నారని తెలిపారు. అనంతరం ఎన్నికల ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, గదుల కేటాయింపులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు రవి మనోహరాచారి, శ్రీ లత,ఎలక్షన్ డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తిరుపతి స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## గజ వాహనము పై గజలక్ష్మి అలంకరణలో ఊరేగిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ..!



ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి: చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ దేవి నవరాత్రి మహోత్సవాలు భాగంగా మంగళవారం ఉదయం అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి, పట్టు వస్త్రముల కట్టి బంగారు ఆభరణాలు సువాసనలకు పుష్పాలతో అలంకరించి ధూప దీప నైవేద్య కర్పూర హారతులు ఇచ్చి భక్తులకు దర్శన ఏర్పాట్లు నిర్వహించిరి. అనంతరం ఉత్సవ మూర్తిని వాహన మండపమునకు తీసుకువచ్చి గజలక్ష్మి అలంకరణ గావించి, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని గజ వాహనంపై అధిష్టింపజేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయదారులుగా వ్యవహరించిన గాదంశెట్టి చెంగల్రాయ్ శెట్టి కుటుంబ సభ్యుల కు ఆలయ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ ఈవో కే.మమత తీర్థ ప్రసాదాలు ఇచ్చి సత్కరించరి. అనంతరం మంగళం వాయిద్యాలు, బ్యాండ్ మేళాలు, మధ్య అమ్మవారిని చంద్రగిరి పురవీధులలో ఊరేగించారు. భక్తులు అడుగడుగున టెంకాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలోపాలకమండలి సభ్యులు మొగిలిగోపాల్ రెడ్డి, ఎం.గోపీనాథ్,ఎం.యోగానందం, ఆర్.వెంకట ముని, యు.భారతి, డి. ముని రత్నమ్మ, కె. దుర్గా, పి. పాపమ్మ, జి. దేవి, బి.వి. స్వప్న, ఎక్స్ ఆఫిషియో మెంబర్ పి. పద్మావతి పాల్గొన్నారు.

## శ్రీ అన్నపూర్ణ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



ప్రజాభూమి పోరుమామిళ్ల : కడప జిల్లా పోరుమామిళ్ల పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మంగళవారం మూడవ రోజు సందర్భంగా అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమైన పూజా కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, జపాలు, చండీ పారాయణం నిర్వహించి మహా నివేదన, మహా మంగళహారతి సమర్పించారు. రాత్రి అమ్మవారు ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు. పట్టణ ప్రజలతోపాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు కమిటీ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు.

## 12 నుంచి 17 వరకు వారోత్సవాలు

### విలేజ్ ఆర్టికల్చర్ అసిస్టెంట్ రష్మిత

ప్రజాభూమి, పుట్లూరు. పుట్లూరు మండలంలోని రైతులు ఉద్యాన పంటలు, నీటి పారుదల ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాలు లక్ష కోట్ల అభివృద్ధి ప్రణాళికతో రాయలసీమకు స్వర్ణ భవిష్యత్తు వస్తుందని రష్మిక తెలిపారువి బి జి రాంజీ, ఉపాధి హామీ ఆధ్వర్యంలో వీడి మార్ట్, పారంపండ్ కావలసిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని దరఖాస్తు చేసుకున్న వారికి పారంపండ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈనెల 12 నుంచి 17 వరకు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని కావున 17వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని రస్మిత ఒక ప్రకటనలో తెలిపారు.




## స్థానిక ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపడుతాం- డి.ఎస్.పి జగదీష్ నాయక్,

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డి.ఎస్.పి జగదీష్ నాయక్.**



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రాపురం

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు చంద్రగిరి సబ్ డివిజన్ పరిధిలో అన్ని పోలింగ్ కేంద్రాలలో చర్యలు చేపడతామని డి.ఎస్.పి జగదీష్ నాయక్ అన్నారు. మంగళవారం ఆర్సీపురం మండలం పోలీస్ స్టేషను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. గంజాయి విక్రయాలు, అక్రమ రవాణా, సేవించడం పట్ల కలిగే నష్టాలను యువతకు అవగాహన కల్పించి అరికట్టాలన్నార గ్రామాలలో ప్రజలకు సైబర్ నేరాలు, నూతన చట్టాలపై అవగాహన కల్పించి, మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని రౌడీ షీటర్లు, సస్పెక్టెడ్ రౌడీషీటర్లు, ట్రబుల్ మంగర్స్ ను బైండోవర్ చేసి, కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. స్థానిక ఎన్నికల దృష్ట్యా గ్రామాలలో గస్తీలు, నైట్ బీట్లు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. అనంతరం మండలంలోని అనుపల్లె, కుప్పం బాదూరు, ఎన్ ఆర్ కమ్మపల్లి, సొరకాయల పాలెం, నడవలూరు, కమ్మ కండ్రిగ , సి. రామాపురం సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో మరుగుదొడ్లు, లైటింగ్, తాగునీటి సౌకర్యాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై భక్తవత్సలం, హెడ్ కానిస్టేబుల్ సాకిరి రాజశేఖర్, ఓబుల్ రెడ్డి, మాధవయ్య, రమేష్ రాయల్, రాజేష్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప మహిమ గల క్షేత్రం పులివెందుల శ్రీ రంగనాథ ఆలయం - శ్రీరంగం, శ్రీరంగపట్నం సరసన ఈ క్షేత్రం

**కేరళ ప్రముఖ సిద్ధాంతి, దైవజ్ఞులు డీఎస్ మహేంద్ర కుమార్ వెల్లడి**

ప్రజాభూమి, పులివెందుల



పులివెందులలోని శ్రీ రంగనాథ క్షేత్రం పురాణ ప్రసిద్ధి చెందినదని, ఎంతో మహిమాన్వితమైనదని, తమిళనాడులోని శ్రీరంగం, కర్ణాటకలోని శ్రీరంగపట్నం వంటి క్షేత్రాల సరసన ఈ ఆలయం చేరుతుందని కేరళకు చెందిన ప్రముఖ సిద్ధాంతి, దైవజ్ఞులు డీఎస్ మహేంద్ర కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పులివెందులలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పులివెందుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆహ్వానం మేరకు తిరువనంతపురం నుంచి తన బృందంతో వచ్చి శ్రీ రంగనాథ స్వామి క్షేత్రంలో అష్టమంగళ, దైవప్రశ్న పూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు.తమ పూజా కార్యక్రమాల్లో ఈ క్షేత్రం వేల సంవత్స రాల నుంచి కొలువుతీరిందని, ఇక్కడ ఒకప్పుడు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం కూడా ఉండేదని, అది రంగనాథ ఆలయంతో సమానంగా పూజలు అందుకునేదని, తవ్వకాల్లో ఆ విగ్రహం బయటపడిందని తెలిపారు.విజయనగర సామ్రాజ్య కాలం నుంచి ఈ ఆలయం ఎంతో వైభవంగా నడిచిందని, ముఖ్యంగా శ్రీకృష్ణదేవరాయల హయాంలో ఈ ఆలయానికి ఎంతో అనుబంధం ఉండేదని, సమీపంలో సైనిక పటాలం కూడా ఉండేదని చెప్పారు. ఈ ఆలయం కొలువుతీరడం వల్ల ఈ ప్రాంతం ఎంతో శక్తివంతమైనదని, ఇక్కడ కోరిన సంకల్పం నెరవేరుతుందని పేర్కొన్నారు.ఆలయంలో ఉన్న అడ్డంకులు, సమస్యల ను అధ్యయనం చేసి సరైన పరిహారాలు తెలియజేస్తామని, భూత, భవిష్యత్, వర్తమాన కాలాల సంఘటనలను చక్రం ద్వారా తెలుసుకు న్నామని వెల్లడించారు.అనంతరం సిద్ధాంతి మహేంద్ర కుమార్ కు ఆర్యవైశ్య నాయకులు, దినేష్ మెడికల్స్ అధినేత మేడం దినేష్ కుమార్, ఈవో రమణ, శ్రీ రంగనాథ ట్రస్ట్ సీఈవో, సీనియర్ జర్నలిస్టు అల్లం రంగనాయకులు రాయల్, చల్లా వంశీయులు, శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత ఆరవేటి నారాయణరెడ్డి తదితరులు ఘనంగా సన్మానించి తిరుమల ప్రసాదం అందజేశారు.

# వైభవంగా దసరా మహోత్సవాలు

**అర్ధనారీశ్వరి అవతారంలో కన్యకా పరమేశ్వరి**

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల పులివెందుల పట్టణంలో దసరా మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు.దసరా ఉత్సవాలలో భాగంగా ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం అమ్మవారి శాలలో మూడవరోజు రోజు ఆలయ ప్రధాన అర్చకులు నవీన్ శర్మ ,ఓలమయ్య ఆధ్వర్యంలో, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉభయదారుల పర్యవేక్షణలో ఉదయం అభిషేకం మహా మంగళహారతి అనంతరం ఉభేదారులచే ధన్వంతరి హోమం, రుద్ర హోమం, మహా నివేదన తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సాయంకాల సమయాన వాసవి అమ్మవారు ప్రత్యేక వేదికలో అర్ధనారీశ్వర అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తమ ముక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ పది రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలలో వాసవి అమ్మవారు వివిధ అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా హాజరైనటువంటి భక్తజనానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు అనుబంధ సంఘాల సభ్యులు , భక్తాదులు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి వెంకటరమణ రోడ్డు ప్రమాదం -పరామర్శించిన వైఎస్ఆర్సిపి నాయకులు

ప్రజా భూమి శింగనమల



శింగనమల మండలం శివపురం పెద్దమ్మ గుడి క్రాస్ వద్ద సింగనమల రహదారికి తిరుగుతుండగా సమయంలో ఎదురుగా వచ్చిన లారీ వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగలగుడ్డం దాసరి వెంకటరాముడు కారును ఢీకొనడంతో తీవ్ర ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆయనకు బలమైన,గాయాలయ్యాయి. స్పందించిన మాజీ మంత్రి: ప్రమ్షర వార్త తెలిసిన వెంటనే మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. వెంకటరాముడు ఆరోగ్య పరిస్థితిని, వైద్యులు అందిస్తున్న అత్యవసర వైద్య చికిత్స వివరాలను డాక్టర్ సాకే శైలజనాథ్ అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి రాష్ట్ర నాయకులు తరిమెల వంశీ గోకుల్ రెడ్డి, డాక్టర్ సాకే రుత్విక్, కంచి రెడ్డి భాస్కర్ రెడ్డి, బండ్లపల్లి ప్రతాపరెడ్డి, ఎం వీరాంజనేయులు,నీలం భాస్కర్, భాస్కర్ రెడ్డి, జెల్లి గోపి యాదవ్, పెరవలి నారాయణస్వామి, పెరవలి వీరనారాయణ, శివపురం తిరుపతయ్య, నాగవర్ధన్ రెడ్డి, బండి శ్రీనివాసులు, నాగులగుడ్డం తాండ రామకృష్ణ, తరిమెల రాంభూపాల్ రెడ్డి,పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నా

# శ్రీ చంద్రఘంటా దేవి అలంకారంలో శ్రీ దుర్గమ్మ తల్లి

**- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు.. ఆలయంలో విశేష పూజలు**

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలోని సాయినగర్‌లో వెలసిన శ్రీ దుర్గాదేవి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శ్రీ దుర్గమ్మ తల్లి శ్రీ చంద్రఘంటా దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ వ్యవస్థాపకుడు ఎం. రవికుమార్ రెడ్డి తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు



శాకల్య విష్ణుశర్మ నేతృత్వంలో అమ్మవారికి పంచామృత అభిషేకం, మంత్రపుష్పం, మహా మంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని చంద్రఘంటా దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు, ప్రత్యేక పూలతో సుందరంగా అలంకరించారు. పది రోజుల పాటు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 20న నిర్వహించనున్న శ్రీ దుర్గమ్మ తల్లి గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కటాక్షం పొందాలని నిర్వాహకులు కోరారు.

# ఎన్నికల్లో బెదిరింపులకు భయపడొద్దు -అండగా ఉంటాం...

**-పోటీలో ఉన్న అభ్యర్థులకు లీగల్ సెల్ న్యాయవాదులు భరోసా ఇవ్వాలి-వైఎస్సార్‌సీపీ నేత గుడ్డంపల్లి వేణు రెడ్డి సూచన**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా లీగల్ సెల్ న్యాయవాదులు అండగా నిలవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి సూచించారు. అధికార పార్టీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేసే అవకాశాలు ఉన్నాయని, ఇలాంటి పరిస్థితులు ఎదురైతే అభ్యర్థులకు న్యాయపరమైన సహకారం అందించేందుకు న్యాయవాదులు సిద్ధంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం గుడ్డంపల్లి వేణురెడ్డి ఆధ్వర్యంలో లీగల్ సెల్ ప్రతినిధులు రామచంద్రారెడ్డి ఇందాద్‌తో పాటు పలువురు న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన అంశాలు, అభ్యర్థులు ఎదుర్కొనే అవకాశమున్న సమస్యలు, ఎన్నికల నియమావళి, న్యాయపరంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఎలాంటి ఒత్తిళ్లకు, బెదిరింపులకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత ఉందని వేణురెడ్డి సూచించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, అభ్యర్థులను భయపెట్టే ప్రయత్నాలు చేసినా చట్టపరమైన మార్గాల్లో స్పందించాలని లీగల్ సెల్ ప్రతినిధులకు సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాలని, అభ్యర్థులకు చట్టం కల్పించిన హక్కులు పరిరక్షించబడాలని ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిసింది. ఎన్నికల ప్రక్రియలో న్యాయపరమైన సమస్యలు తలెత్తినప్పుడు అభ్యర్థులకు తగిన సలహాలు, సహకారం అందించడంతోపాటు అవసరమైన సందర్భాల్లో చట్టపరమైన చర్యలకు మార్గనిర్దేశం చేయాలని న్యాయవాదులను కోరినట్లు సమాచారం. ఈ సమావేశంలో లీగల్ సెల్ ప్రతినిధులు వెంకటరెడ్డి, ప్రసాద్ రెడ్డి, కృష్ణమూర్తి, వన్నేరువప్ప, మనోజ్, కదిరీష్, యూసుఫ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి పల్లెకు అభివృద్ధి ఫలాలు అందిస్తాం

**చీపుర్లపాడులో రూ.90 లక్షలతో మార్కెట్ యార్డుకు శంకుస్థాపన -రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



ప్రజాభూమి ప్రతినిధి,టెక్కలి / కోటబొమ్మాళి

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి బాటలో నడిపించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. టెక్కలి, కోటబొమ్మాళి మండలాల్లో రూ.9.79 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.

**మండాపోలం కాలనీలో రూ.3.10 కోట్లతో పనులు**

టెక్కలి గ్రామపంచాయతీ పరిధిలోని మండాపోలం కాలనీలో రూ.3.10 కోట్ల వ్యయంతో నిర్మించిన సీసీ రహదారులు, మురుగునీటి కాలువలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా? మౌలిక సదుపాయాల కల్పనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. గతంలో సరైన రహదారులు లేక ఇబ్బందులు పడేవారమని, ప్రస్తుతం సీసీ రహదారులు, డ్రైనేజీ సదుపాయాలు అందుబాటులోకి రావడంతో ఉపశమనం కలిగిందని స్థానికులు తెలిపారు.

చీపుర్లపాడులో మార్కెట్ యార్డుకు శంకుస్థాపన కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు గ్రామంలో రూ.90 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న మార్కెట్ యార్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా జల్ జీవన్ మిషన్ కింద రాష్ట్రానికి రూ.640 కోట్ల నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచి, ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గ్రామాల్లో రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీటి సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని స్పష్టం చేశారు.సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం కూటమి ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యమిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంతోపాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషగిరిరావు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి సుధాకర్‌రావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

**రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలి : జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్**



ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:లి రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దని, రెవెన్యూ సేవలను వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని రెవెన్యూ, సర్వే శాఖ, సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ఆదేశించారు.మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రెవెన్యూ మరియు భూ పరిపాలనకు సంబంధించిన కీలక అంశాలపై జిల్లా/డివిజన్ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ మరియు ప్రత్యక్ష సమీక్షా సమావేశం నిర్వహించడమైనది. ఈ సమావేశంలో ముఖ్యంగా నవంబర్ మరియు అక్టోబర్ సైకిల్ లక్ష్యాలు, రీసర్వే పురోగతి, అగ్రిస్టాక్ మలుపై సమగ్రంగా చర్చించి, క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయడం జరిగింది.రీ సర్వే అమలు పై మండల సర్వేయర్లతో, ఆర్ డి టి, వి ఆర్ ఓలతో, రెవెన్యూ సిబ్బందితో నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న భూముల సమగ్ర రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అయితే వేగంతో పాటు భూమి సరిహద్దులు, హక్కులు, రికార్డుల వివరాల ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. రీసర్వే సమయంలో క్షేత్రస్థాయిలో భూముల వివరాలను పకడ్బందీగా పరిశీలించి, భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రికార్డులను సక్రమంగా రూపొందించాలని సూచించారు. నిర్ణీత లక్ష్యాలను నిర్దేశిత కాలపరిమితి లో పూర్తి చేసేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పాత భూ రికార్డులను క్షేత్రస్థాయి వివరాలతో సరిపోల్చి పరిశీలించాలని సూచించారు.ప్రతి మండలం, గ్రామానికి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా సంబంధిత అధికారులు, సర్వే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. రీ-సర్వే పనుల పురోగతి పై రోజువారీగా పర్యవేక్షణ చేపట్టి, వారం వారీగా నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. ఆరో విడత రీ సర్వే చిత్తూరు డివిజన్లో 41 గ్రామాలలో, నగిరి డివిజన్ నందు 7 గ్రామాలలో నిర్వహించడం జరుగుతూ ఉందని 31.12.26 తేది నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. నాలుగవ విడత రీ సర్వే 101 గ్రామాలలో నిర్వహించడం జరుగుతూ ఉండదని తెలిపారు. రీ-సర్వే ద్వారా భూ రికార్డులను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించడంతో పాటు భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వే డిడి జయరాజ్, సంబంధిత రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకతకు పెద్దపీట వేయాలి

**- ఆహార పదార్థాల నాణ్యతపై తనిఖీలు చేపట్టాలి: జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్,**

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించే నిత్యావసర సరుకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, తూకాల్లో మోసాలకు పాల్పడటం, అధిక ధరలకు సరుకులు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక జాయింట్ కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా సరఫరా అధికారి ఎన్ వెంకట్రాముడు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ లక్ష్మీ ,పౌరస రఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్లు , తూనికలు మరియు కొలతల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ పలు అంశాలపై సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లా డుతూ, జిల్లాలోని అన్ని చౌకధరల దుకాణాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, డీలర్లతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు నాణ్యమైన సరుకులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవా లని సూచించారు. ప్రతి అధికారి తమకు కేటాయించిన పరిధిలోని దుకాణాలను క్రమం తప్పకుండా సందర్శించి, పంపిణీ విధానం, లబ్ధిదారులకు అందుతున్న సేవలు, ఎదురవుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ విధానానికి సంబంధించి ప్రతి రేషన్ కార్డు హోల్డర్ తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడంతో పాటు ఆధార్‌తో మొబైల్ నంబర్ అనుసంధానం అయ్యేలా చూడాలని ఈ సదుపాయం తహశీల్దార్ కార్యాలయాలు, గ్రామ రెవెన్యూ అధికారులు , చౌకధరల దుకాణాల డీలర్ల వద్ద అందుబాటులో ఉందని తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఈ-కేవైసీ, ఆధార్--మొబైల్ లింకింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకునేలా సంబంధిత అధికారులు, చౌకధరల దుకాణాల డీలర్లు అవగాహన కల్పించాలని రేషన్ కార్డు దారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో పురోగతిని దుకాణాల వారీగా పర్యవేక్షిస్తూ, పెండింగ్‌లో ఉన్న కార్డులను గుర్తించి వాటి అనుసంధానాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రతి చౌకధరల దుకాణం పరిధిలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య, గత మూడు నెలల సరుకుల పంపిణీ వివరాలు, సగటు పంపిణీ శాతం, ఈ-కేవైసీ పూర్తయిన కార్డుల సంఖ్య తదితర వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ వివరాలను ఎక్సెల్ షీట్ల రూపంలో నిర్వహిస్తూ, ఈ-కేవైసీ పూర్తికాని కార్డులను గుర్తించి, వాటికి సంబంధించిన కారణాలను పరిశీలించాలని తెలిపారు.

# పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన ఐపీఎస్ అధికారి...

ప్రజా భూమి యల్లనూరు



స్థానిక పోలీస్ స్టేషన్ ఐపీఎస్ అధికారి కాకుమాను అశ్విన్ మణి దీప్ తనిఖీ చేశారు తనిఖీలో భాగంగా పలు రికార్డులను పరిశీలించి, మండలంలో రౌడీ షీటర్లను స్టేషన్ కు పిలిపించి రాబోవు స్థానిక సంస్థల ఎలక్షన్స్ లో ఎటువంటి గొడవలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు సృష్టించిన యెడలచట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు తర్వాత ఫ్యాక్షన్ గ్రామాలైన వెన్నపూస పల్లి దంత లపల్లి తిమ్మంపల్లి కల్లూరు గ్రామాలను సందర్శించి ఫ్యాక్షన్ విడనాడి ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా బ్రతకాలని ఎటువంటి ఫ్యాక్షన్ రాజకీయాలకు తగాదాలకు దూరంగా ఉంటూపిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని అందరూ కలిసిమెలిసి జీవించాలని ఎ.ఎస్పీ సూచించారు ఆయన వెంట సిఐ సత్య బాబు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై విస్తృత అవగాహన కల్పించాలి

**- దోమల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి**

**- మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య**

ప్రజాభూమి, వేంపల్లె



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య సూచించారు. మంగళవారం తాళ్లపల్లి పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సిబ్బందికి సూచించారు. ఇళ్ల చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. దోమల నివారణకు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని, దోమతెరలను వినియోగించాలని, కిటికీలకు మెష్‌లు అమర్చుకోవాలని, ఒంటిని పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలని కోరారు. మురుగు కాలువలను శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లడం, యాంటీ లార్వా ద్రావణాలను పిచికారీ చేయడం వంటి నివారణ చర్యలు చేపట్టాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఫకృద్దీన్, అంకయ్య, అరుణాదేవి, తులసమ్మ, కమ్యూనిటీ హెల్త్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
పోలవరం
బుధవారం, అక్టోబర్ 14, 2026


# దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

## పోలవరం జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి,రంపచోడవరం
విభిన్న ప్రతిభావంతులు ఆత్మవిశ్వాసంతో ముం దుకు సాగుతూ,స్వయం ఆధారిత జీవనం కొనసాగించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాం గులకు అండగా నిలుస్తోందని పోల వరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ పేర్కొ న్నారు. మంగళవారం స్థానిక ఐ టీ డి ఏ సమావే శపు హాలులో అంతర్జాతీయ సాంకేతిక భాషా దినోత్సవం పురస్కరించుకొని, అంతర్జాతీయ బధిరుల వారోత్సవంలో భాగంగా పోలవరం జిల్లాలోని దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలు పంపిణీ కార్యక్రమానికి పోలవరం జిల్లా కె. దినేష్ కుమార్, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ జి.నా రాయణ స్వామి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ ఈ వాహనాలు వారి రోజువారీ ప్రయాణాలకు, విద్య, ఉపాధి తదితర అవసరా లకు ఎంతో ఉప యోగపడతాయని ఆయన తెలిపారు.ప్రతి ఒక్కరూ తమకున్న ప్రతిభను గుర్తించి,జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు.ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా అధిగమిస్తూ,ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆయన అన్నారు .విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు జిల్లా తరుపున అందజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.అదేవిధంగా సంకేత భాషా ద్వారా వినికిడి లోపం ఉన్నవారు తమ భావాలను ఇతరులకు సులభంగా తెలియజే యగలుగుతారని సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత అని ఆయన అన్నారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచిం చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల పట్ల వివక్ష చూపకుండా గౌరవం ఆత్మవిశ్వాసం కల్పించాలని ఆయన తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులు అందరూ ఒక సంఘంగా ఏర్పడి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన అన్నారు. దివ్యాంగుల కొరకు కార్యాల యం ఏర్పాటు చేయుటకు ప్రభుత్వం ద్వారా స్థలం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.బాగా వికలాంగులైన వారిని గుర్తించి పదిలక్షల 16 వేల రూపాయల వ్యయంతో 10 మూడు చక్రాల స్కూటీలు లబ్ధిదారులకు అందజేసి జెండా ఊపి ప్రారంభించారు. పోలవ రం జిల్లాలోని విక లాంగులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా స్వచ్ఛంద సంస్థలు దాతలు ముందుకు రావా లని కలెక్టర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ జి. నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలోని వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేయడం జరిగిందని ఆయన తెలిపారు. వికలాంగులకు ప్రతి జిల్లాలో ఎక్కడిక క్కడ ట్రై సైకిళ్లు, స్కూటీలు, చెవిటి మిషన్లు, కృత్రిమ అవయవాలు తదితరవి అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని వికలాంగులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ఎక్కడికి అక్కడ రుణాలు మంజూరుకు సంబంధిత అధికారులతో సంప్రదించడం జరిగిందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ బోర్డు డైరెక్టర్ షేక్ సుభాని, వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.కవిత,స్థానిక నాయకులు పెంటపాటి మోహన్, అడబాల బాపిరాజు,వై. నిరంజనీ దేవి, కారం శేషాయమ్మ, వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన గడ్డపైనే గిరిజనులకు ఇంటి స్థలం కరువు

### పెరిగిన కుటుంబాలు.. పెరగని నివాస వసతులు
### సాగు భూమి కోసం గిరిజనుల ఎదురుచూపులు
### అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం..నివాస భూమి హక్కులు కల్పించాలని బి శ్రీరామపట్నం గ్రామస్తుల డిమాండ్

ప్రజా భూమి ప్రతినిధి గంగవరం :
గిరిజన ప్రాంతంలో తరతరాలుగా నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు సొంతంగా ఇల్లు నిర్మించుకు నేందుకు ఇంటి స్థలాలు జీవనాధారం కోసం సాగు భూమి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పోలవరం జిల్లా గంగవరం మండలం మొల్లేరు పంచాయతీ పరిధిలోని బి శ్రీరామపట్నం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు కుటుంబాలు పెరిగినా నివాస స్థలాలు లేక వివాహమైన పిల్లలు సైతం పాత ఇళ్లలోనే ఇరుకుగా జీవనం సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు తమ గ్రామంలోనే నివసిస్తున్న గిరిజనులకు ఇంటి స్థలాలు సాగు భూములు అందుబాటులో లేకపోవడం దురదృష్టకరమని గ్రామ స్తులు అంటున్నారు మరోవైపు మైదాన ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన కొందరికి భవనాలు నిర్మిం చుకునేందుకు స్థలాలు ఎలా లభిస్తున్నాయో అధికారులు పరిశీలించాలని ప్రశ్నిస్తున్నారు అయితే భూముల కేటాయింపు వాటి చట్టబద్ధతపై సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నారు ఇంటి స్థలాలు సాగు భూముల కోసం ఎన్నోసార్లు అధికారుల చుట్టూ తిరిగి దరఖాస్తులు సమర్పించినా ప్రజాప్రతిని ధుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని గ్రామస్తులు పేర్కొం టున్నారు తరతరాలుగా నివసిస్తున్న తమకు కనీస నివాస సదుపాయం లేకపోవడం, వ్యవసాయం జీవించే అవకాశం లేకపోవడం వల్ల కుటుంబాల భవిష్యత్తుపై ఆందోళన నెలకొందని తెలిపారు.

**చట్టాలు కల్పించిన హక్కుల అమలు ఎప్పుడు?**

అటవీ హక్కుల చట్టం–2006లోని సెక్షన్3(1)(a)ప్రకారం అర్హులైన అటవీ నివాస గిరిజనులకు అటవీ భూమిపై నివాసం స్వయంగా సాగు చేసుకుని జీవనోపాధి పొందే హక్కులను గుర్తించేందుకు నిబంధనలు ఉన్నాయి అయితే ఈ హక్కులు సంబంధిత అర్హతలు భూమి స్వభావం చట్టపరమైన నిబంధనలు దరఖాస్తుల పరిశీలనకు లోబడి ఉంటాయి అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ 21గౌరవప్ర దమైన జీవన హక్కుకు రక్షణ కల్పిస్తుంది ఈ నేపథ్యంలో బి శ్రీరామపట్నం గ్రామంలోని అర్హులైన గిరిజన కుటుంబాలకు నివాస స్థలాలు కేటాయించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు చట్టప్రకారం అర్హత ఉన్నవారికి ఇంటి స్థలాలు సాగు భూములపై హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామంలో భూముల వినియోగం పట్టాల వివరాలు గిరిజనేత రుల భూముల స్వాధీనానికి సంబంధించిన అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఐటీడీఏ అధికారులు జిల్లా యంత్రాంగం స్పందించి తమ గ్రామంలో భూ సమస్యను పరిష్కరించి అర్హులైన కుటుంబాలకు నివాస స్థలాలు చట్టబద్ధంగా సాగు భూములపై హక్కులు కల్పించాలని బి శ్రీరామపట్నం గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఏఎస్‌డీ ఓటర్ల జాబితా పరిశీలనను పక్కాగా చేపట్టాలి

### నోటీసుల జారీ, విచారణ ప్రక్రియలో 100 శాతం పురోగతి
### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి రంపచోడవరం
పోలవరం జిల్లాలో ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఏఎస్‌డీ (ASD – Absent, Shifted, Dead) ఓటర్ల జాబితా పరిశీలనను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ సూచించారు. ఇందులో భాగంగా రాజవొమ్మంగి మండలం దూసరిపాము పోలింగ్ కేంద్రం (పీఎస్–81) పరిధిలో ఏఎస్‌డీ జాబితా ధ్రువీకరణ ప్రక్రియను చేపట్టారు.జిల్లాలోని 11 మండలాల పరిధిలో ఉన్న 399 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మొత్తం 16,182 నోటీసుల జారీ, విచారణ ప్రక్రియలో అక్టోబర్ 13 నాటికి 100 శాతం పురోగతి నమోదైంది. నోటీసుల జారీకి పెండింగ్ లేకుండా, జారీ చేసిన నోటీసులన్నింటినీ అందించి, విచారణలను పూర్తి చేసినట్లు నివేదికలు వెల్లడి స్తున్నాయి. రంపచోడవరం డివిజన్‌లో 2,912, చింతూరు డివిజన్‌లో 13,270 నోటీసులకు సంబంధించి విచారణ ప్రక్రియ పూర్తయింది.డీఈఓ లాగిన్ ద్వారా చేపట్టే ధ్రువీకరణ ప్రక్రియలో భాగంగా జిల్లావ్యాప్తంగా 8,303 కేసులకు సంబంధించిన భౌతిక దస్త్రాల పరిశీలన నమోదైంది. ఇందులో రంపచోడవరం డివిజన్‌లో 1,165, చింతూరు డివిజన్‌లో 7,138 కేసులు ఉన్నాయి. మిగిలిన కేసులకు సంబంధించి ధ్రువీకరణ, డేటా నమోదు ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితా స్వచ్ఛతను కాపాడటంతో పాటు అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన, సంబంధిత రికార్డుల ధ్రువీకరణ ఆధారంగా మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని, ఎన్నికల మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు



## ఆశ వర్కర్లతో హాస్పటల్ క్లీనింగ్ పనులు చేయించడమే కాకుండా
## పి.హె.సి లీడర్లపై బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదు
### ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ (CITU)



ప్రజా భూమి ప్రతినిధి రంపచోడవరం
పెదగెద్దాడ PHC పరిధిలో ఆశవర్కర్లతో PHC క్లినింగ్ పనులు చేయించడమే కాకుండా PHC లీడర్లపై మెడికల్ ఆఫీసర్ బెదిరింపులకు పాల్పడటం సరికాదని దీనిని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ పోలవరం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. ఈ సందర్భంగా ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ పోలవరం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ల వాణిశ్రీ మాట్లాడుతూ ఆశా వర్కర్లతో హాస్పటల్ క్లీనింగ్ పనులు చేయించడం సరికాదనీ గతంలో మారేడుమిల్లి PHC లో జరిగిన క్లీనింగ్ ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ గారు స్పందించి ఆశవర్కర్లతో పై అధికారుల ఆదేశాలు లేకుండా ఎటువంటి క్లీనింగ్ పనులు చేయించకూడ దని సర్కులర్ జారీ చేసినప్పటికీ, గత నెల 29వ తారీఖున పోలవరం జిల్లా డిఎంహెచ్వో గారికి రాతపూ ర్వకంగా హాస్పటల్ క్లీనింగ్ పనులనుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలని కోరుతూ రిప్రజెంటేషన్ ఇచ్చినప్పటికీ పోలవరం జిల్లాలో ఉన్నటువంటి కొన్ని పీహెచ్ సిలలో ఇంకా ఇది పునరావృతం అవుతూనే ఉంది. అధికారులు చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా సమ్మెలోకి వెళ్ళటం జరుగుతుం దని హెచ్చరిక చేస్తూ చెప్పినప్పటికీ ఈరోజు పెద్దగెద్దడ PHC లో ఆశ వర్కర్లతో పిహెచ్సి క్లీనింగ్ పనులు చేయించడమే కాకుండా PHC లీడర్లపై మెడికల్ ఆఫీసర్ బెదిరించటం ఏమాత్రం సరికాదని దీనిని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తుందని ఆమె అన్నారు. గ్రామీణ గిరిజన ప్రజలకు అనేక ఇబ్బందులు ఎదుర్కొని వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశ వర్కర్ల పట్ల ఈ విధంగా ప్రవర్తించటం పై అధికారుల ఆదేశాలను కూడా బేకరత్ చేస్తూ ప్రశ్నించిన ఆశా లీడర్లపై బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదని ఆమె హెచ్చరిక చేశారు. తక్షణమే జిల్లా వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వారు స్పందించాలనే వర్కర్లపై బెదిరింపులకు పాల్పడిన మెడికల్ ఆఫీసర్ వినోద్ గారిపై శాఖపరమైన చర్యలు తీసుకొని ఆశ వర్కర్లకు భరోసా కల్పించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో ఏ PHC లో పునరావృతం కాకూడదని కోరినప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనీ ఆమె ఆరోపించారు. ఇప్పటికైనా అన్ని పీహెచ్సీలకు ఆదేశాలు జారీ చేసి హాస్పటల్ క్లీనింగ్ పనులు ఆపకపోతే జిల్లాలో ఉన్నా మొత్తం ఆశ వర్కర్లు తమ యొక్క విధులను బహిష్కరించి పెద్ద ఎత్తున ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని వైద్యా ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు.

## స్థానిక ఎన్నికలకు వైఎస్ఆర్సీపీ శ్రేణులు సిద్ధం కావాలి



అడ్డతీగలలో పార్టీ శ్రేణులకు నాగులపల్లి ధనలక్ష్మి పిలుపు

ప్రజా భూమి ప్రతినిధి అడ్డతీగల
అడ్డతీగల మండలం ఎల్లవరం గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం, మండల విస్తృతస్థాయి సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు మద్దాల వీర్రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సీపీ నియోజకవర్గ ఇంచార్జి నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రతి బూత్‌ను బలోపేతం చేయడంతోపాటు గ్రా మాల్లో ప్రజల సమస్యలను తెలుసుకొని వారికి అండగా నిలవాలని సూచించారు. నాయకులు, కార్యక ర్తలు సమష్టిగా, ఐక్యంగా పనిచేస్తే రాబో యే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించవచ్చని ధీమా వ్యక్తం చేశారు. అడ్డతీగల మండలంలో వైఎస్ఆర్సీపీ బలాన్ని నిరూపించుకోవా లని కోరారు.ఈ సమావేశంలో పార్టీ మండల కన్వీనర్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, రాష్ట్ర, జిల్లా, నియోజ కవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం పార్టీ కార్యకర్తలకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు.





## రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి మదర్ తెరిసా ఫౌండేషన్ సన్మానం

ప్రజా భూమి ప్రతినిధి అడ్డతీగల
అడ్డతీగల మోడల్ ప్రైమరీ స్కూల్‌లో ఎస్‌జీటీగా పనిచేస్తున్న కోసు చిన్నారావుకు మరోసారి అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా స్వీకరించిన ఆయనను, సోమవారం (అక్టోబర్ 12) విజయవాడ గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో మదర్ తెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురు బ్రహ్మ పురస్కారంతో ప్రత్యేకంగా సన్మానిం చారు. విద్యారంగంలో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాలు లభించడం పట్ల మండల విద్యాశాఖ అధికారి-2 పి. శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులందరూ అవార్డుల సాధనకు కృషి చేస్తూ విద్యారంగంలో ఉత్తమ ప్రగతిని సాధించాలని, మండల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పి. మంగరా జుతో పాటు కోసు చిన్నారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జనసేన సమన్వయ కమిటీలో అడ్డతీగల మండలానికి ఎనిమిది మందికి చోటు



ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల
జనసేన పార్టీ స్థానిక సంస్థల కోఆర్డినేషన్ కమిటీలో నిర్వాహక దళ్ సభ్యులుగా అడ్డతీగల మండలానికి చెందిన ఎనిమిది మందికి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా తమకు బాధ్యతలు అప్పగించిన జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని, తమకు అప్పగించిన పదవులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. జనసైనికులను, ప్రజలను కలుపుకొని సమన్వయంతో పనిచేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.కమిటీ నిర్వాహక దళ్ సభ్యులుగా చోళ్ల కృష్ణారెడ్డి, పల్లాల రవి రాజా శేఖర్ రెడ్డి, దాని కృష్ణారెడ్డి, కొల్లాటి సోమశేఖర సత్యసాయి దినేష్, కర్ర నర్సయ్య, ముత్యాల సురేష్ రెడ్డి, ద్వారపురెడ్డి దుర్గారావు, పాతర సీతామహా లక్ష్మి ఎంపికయ్యారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి వారు ధన్యవాదాలు తెలిపారు.

## కొత్త కొండమొదలు పంచాయతీ ఏర్పాటు చేయాలి

### అప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిలిపివేయాలి
### రంపచోడవరంలో గిరిజన సంఘాల ధర్నా



ప్రజాభూమి ప్రతినిధి గంగవరం:
నేలదోనెలపాడు పునరావాస కాలనీని కొత్త కొండమొదలు నూతన పంచా యతీగా ఏర్పాటు చేయాలని అప్పటివ రకు స్థానిక సంస్థల ఎన్నికలు నిలిపివే యాలని డిమాండ్ చేస్తూ ఏజెన్సీ గిరిజన సంఘం రైతుకూలీ సంఘం(ఆంధ్రప్ర దేశ్) ఆధ్వర్యంలో రంపచోడవరంలో ర్యాలీ నిర్వహించి ఐటీడీఏ గ్రీవెన్స్ వద్ద ధర్నా చేపట్టారు పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులైన కొండమొదలు గ్రామ ప్రజలు నేలదోనెలపాడు పునరావాస కాలనీలో ఐదేళ్లుగా నివసిస్తున్నప్పటికీ నూతన పంచాయతీ ఏర్పాటు చేయలేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు సుమారు1,490మంది జనాభా కలిగిన కాలనీలోని 900మందికి పైగా ఓటర్లను జగ్గంపాలెం ఇందుకూరు పంచాయతీలకు విభజించడం వల్ల పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు ప్రభుత్వ జీవో నంబర్63ప్రకారం పునరావాస కాలనీలకు ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చేయాలని ఓటర్లను సమీపంలోని పోలింగ్ కేంద్రాలకు మార్చాలని కోరారు దేవీపట్నం మండలంలోని ఆరు పంచాయతీలను పునర్వ్యవస్థీకరించి కొత్త కొండమొదలు పంచాయతీ ఏర్పాటు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు ఈ మేరకు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు కలెక్టర్‌తో చర్చించి తదుపరి సమాచారం అందిస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కొండమొదలు తాజా మాజీ సర్పంచ్ వేట్ల విజయ తాతి బుల్లబ్బాయి కొండ్ల రామిరెడ్డి వేట్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు జగ్గంపాలెం పంచాయతీ గ్రామ పెద్దలు మాజీ ప్రజాప్రతినిధులు మద్దతు తెలిపారు.





# ప్రజాభూమి

బుధవారం,అక్టోబర్ 14,2026

జనరల్ 12


## మడ అడవుల సంరక్షణతోనే మానవ మనుగడకు భరోసా

**ప్రకృతి సంపదను కాపాడుకోవడం మనందరి బాధ్యత**

**వృక్ష సంపద పరిరక్షణకు వాల్టా చట్టం పటిష్టంగా అమలు చేస్తాం**

**అవనిగడ్డ నియోజకవర్గం సంఘమేశ్వరంలో మడ అడవుల పునరుద్ధరణ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ నాగబాబు**

**సంఘమేశ్వరంలో స్వయంగా మడ మొక్కలు నాటిన నాగబాబు**

**ప్రజాభూమి ప్రతినిది,మచిలీపట్నం**



మడ అడవుల సంరక్షణ పర్యావరణ పరిరక్షణకే కాకుండా, మానవ మనుగడకు కూడా అత్యంత కీలకమని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ నాగబాబు పేర్కొన్నారు. ఒకప్పుడు పొయ్యిలో కట్టెల కోసం మడ అడవులను విచ్చలవిడిగా నరికివేసి, సహజంగా ఏర్పడిన విలువైన వృక్ష సంపదను నాశనం చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి ప్రసాదించిన సంపదను కాపాడుకోవాల్సింది పోయి, దానిని ధ్వంసం చేయడం ద్వారా మన వినాశనాన్ని మనమే కొని తెచ్చుకున్నామన్నారు. మడ అడవులను సంరక్షిస్తే అవి భవిష్యత్తులో మనకు గొప్ప జీవనాధారంగా నిలుస్తాయని స్పష్టం చేశారు. మంగళవారం కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని సంఘమేశ్వరంలో మడ అడవుల పునరుద్ధరణ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ తో కలిసి పాల్గొన్నారు. 100 హెక్టార్ల విస్తీర్ణంలో మూడు లక్షల మడ మొక్కలను నాటే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమంలో నాగబాబు స్వయంగా మొక్కలు నాటి, మడ అడవుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ... " కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో చెట్లను నరికివేయాలంటే అనేక ఆంక్షలు ఉంటాయి. ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. మన రాష్ట్రంలోనూ వృక్ష సంపద పరిరక్షణకు చట్టాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో కొన్ని లోపాలు ఉన్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు త్వరలోనే వాల్టా చట్టాన్ని మరింత క్రియాశీలంగా అమలు చేస్తాం.

**మొక్క విలువ వెలకట్టలేనిది:** ఒక్కో మొక్క పర్యావరణానికి అందించే ప్రయోజనాలు వెలకట్టలేనివి. అయినప్పటికీ, మన చుట్టూ ఉన్న చెట్లను, విలువైన మడ అడవులను నరికివేస్తూ ప్రకృతి సంపదను నాశనం చేస్తున్నా పట్టించుకోకపోవడం ఆందోళనకరం. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించి, వృక్ష సంపదను కాపాడేందుకు ముందుకు రావాలి. మనం చెట్లను కాపాడితే.. అవే మనల్ని కాపాడతాయి. ప్రకృతిని పరిరక్షించడం మనందరి బాధ్యత.

**భూమిని కాపాడుకోవడం మనందరి బాధ్యత:** ఇల్లు నచ్చకపోతే మరో ఇంటికి మారవచ్చు.. ఊరు నచ్చకపోతే మరో ఊరికి వెళ్లవచ్చు.. దేశం నచ్చకపోతే మరో దేశానికి వెళ్లిపోవచ్చు. కానీ భూమి నివాసయోగ్యంగా లేకపోతే మనం ఎక్కడికి వెళ్లగలం? భూమి మనుగడకు అనుకూలంగా ఉండాలంటే ప్రకృతిని కాపాడుకోవడం ఒక్కటే మార్గం. పర్యావరణ కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. హైదరాబాద్‌లో పెరుగుతున్న వాయు కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతూ, శ్వాసకోశ సమస్యలకు కారణమవుతోంది. అదే విధంగా, గోదావరి జిల్లాల్లో నీటి కాలుష్యంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కాలుష్య సమస్యలను అరికట్టి, ప్రజారోగ్యాన్ని కాపాడాలంటే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలి.

**సమస్త జీవరాశులతో సహజీవనమే లక్ష్యం:** ప్రకృతిలోని ప్రతి చెట్టు, ప్రతి జీవీ పర్యావరణ సమతుల్యతలో కీలక పాత్ర పోషిస్తాయి. భూమిపై జీవించే హక్కు మానవులతో పాటు సమస్త జీవరాశులకూ ఉంది. ఆ హక్కును గౌరవిస్తూ ప్రకృతితో సహజీవనం చేయాలి. మడ అడవులు, వృక్ష సంపద, జల వనరులను పరిరక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చు. ప్రకృతిని కాపాడుకోవడం అంటే మన భవిష్యత్తును కాపాడుకోవడమే" అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ గ్రీన్ కమిషనర్ బి.ఎన్.ఎన్. మూర్తి, అటవీశాఖ సలహాదారులు మల్లికార్జున రావు, డిఎఫ్ఓ త్రిమూర్తుల రెడ్డి, ప్రజా ప్రగతి సేవా సంఘ ప్రెసిడెంట్‌వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**అశ్వారావుపాలెంలో పార్క్ ప్రారంభం, రహదారి పనులకు శంకుస్థాపన**

అవనిగడ్డ మండలం అశ్వారావుపాలెం గ్రామంలో రూ. 15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన పార్క్‌ను శ్రీ నాగబాబు గారు ప్రారంభించారు. గ్రామ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడంతో పాటు, పిల్లలు ఆటపాటలతో ఆనందంగా గడపడానికి, పెద్దలు సేదతీరడానికి వీలుగా ఈ పార్కును గ్రామ మాజీ సర్పంచ్, జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహక దళ్ సభ్యులు పంద్రాజు లంకమ్మ ప్రసాద్ ఏర్పాటు చేశారు. అలాగే, అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి మాజీ మంత్రి వెంకట కృష్ణారావు నూతన విగ్రహాన్ని నాగబాబు ఆవిష్కరించారు. అంతకుముందు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారుల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెపండుగ 1.0, పల్లెపండుగ 3.0 కార్యక్రమాల ద్వారా సుమారు రూ. 54.60 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న మూడు సీసీ రోడ్లు, ఒక బీటీ రోడ్డు నిర్మాణ పనులకు నాగబాబు శంకుస్థాపన చేశారు.

## గో సంరక్షణ, జంతు పరిరక్షణకు పెద్ద పీట

**భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఏనుగులతో ఆశీర్వాదం నిషేధం**

**టీటీడీ గోశాల డైరెక్టర్ శివ కుమార్**

**ప్రజాభూమి ప్రతినిది,తిరుమల**

టీటీడీలో గో సంరక్షణ, జంతు పరిరక్షణకు పెద్ద పీట వేసినట్లు టీటీడీ గోశాల డైరెక్టర్ శివకుమార్ తెలిపారు. తిరుమలలోని రామ్ భగీచా-2 లోని మీడియా సెంటర్ లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీ ఆలయాల్లో కైంకర్యాలకు అవసరమైన పాలను ఎప్పటికప్పుడు గోశాల ద్వారా సరఫరా చేయడం జరుగుతోందన్నారు. ప్రతిరో?జూ తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రానికి 15వేల లీటర్ల పాలను సరఫరా చేయడం జరుగుతోందని చెప్పారు. గో సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు గోవుల ఆరోగ్యం పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవడం జరుగుతోందన్నారు. టీటీడీ గోశాల ద్వారా బ్రహ్మోత్సవాల సమయంలో వాహన సేవల ఊరేగింపునకు ఏనుగులు, అశ్వాలు, వృశభాలను ప్రత్యేక అలంకణలతో ఊరేగించడం జరుగుతోందన్నారు. జంతు సంరక్షణకు ప్రత్యేక వైద్య బృందాలతో పాటు, కేరళ నుండి వైద్య బృందం, శ్రీవారి వైద్య సేవ ద్వారా విచ్చేసే వైద్యులు విశేష కృషి చేస్తున్నారని చెప్పారు. ఏనుగుల సంరక్షణ, భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వాటితో ఆశీర్వాదాలు తీసుకోవడం పూర్తిగా నిషేధించినట్లు టీటీడీ గోశాల డైరెక్టర్ శివకుమార్ తెలిపారు. ఈ మేరకు ాశీా లను కూడా రూపొందించడం జరిగింది అన్నారు. భక్తులందరూ ఏనుగులకు దూరంగా ఉంటూ నిబంధనలు పాటించి సహకరించాల్సిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీపీఆర్వో డాక్టర్ టి.రవి, పీఆర్వో కుమారి నీలిమ పాల్గొన్నారు.

## ప్రపంచస్థాయి ప్రమాణాలతో శ్రీవేంకటేశ్వర మ్యూజియం

**చీఫ్ మ్యూజియం ఆఫీసర్ శ్రీ సోమన్నారాయణ**

**ప్రజాభూమి ప్రతినిది,తిరుమల**



తిరుమలలో శ్రీ వేంకటేశ్వర మ్యూజియంను ప్రపంచస్థాయి ప్రమాణాలో అభివృద్ధి చేసినట్లు చీఫ్ మ్యూజియం ఆఫీసర్ సోమన్నారాయణ తెలిపారు. తిరుమలలోని రామ్ భగీచా-2 లోని మీడియా సెంటర్ లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించారని చెప్పారు. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం ట్రైల్ రన్ నిర్వహించిన అనంతరం నవంబర్ మొదటి వారంలో ఎస్వీ మ్యూజియంను భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. మ్యూజియంలో మొత్తం 14 గ్యాలరీలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన బ్రహ్మాండం గ్యాలరీ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని తెలిపారు. తిరుమల చరిత్రను తెలియజేసేలా శిల్పకళలు, ఆలయ చరిత్ర, స్వామివారి ఆభరణాలు (డిజిటల్), ఆయుధాలు, సంగీత వాయిద్యాలు వంటి వివిధ కళా ఖండాలను ప్రదర్శనకు ఉంచుతున్నట్లు చెప్పారు. రూ.50 ధరను మ్యూజియం ప్రవేశ రుసుంను పెట్టనున్నట్లు తెలిపారు. ఈ టికెట్లను టీటీడీ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సీపీఆర్వో డాక్టర్ టి.రవి, పీఆర్వో కుమారి నీలిమ, మ్యూజియం క్యూరేటర్ శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల ఓటమి భయంతోనే జగన్‌పై చంద్రబాబు సరికొత్త కుట్రలు

**చంద్రబాబు చేతిలో తోలుబొమ్మలా మారిన హైదరాబాద్ ఈడీ**

**:జూపూడి ప్రభాకర్‌రావు ఫైర్**

**ప్రజాభూమి ప్రతినిది,తాడేపల్లి:**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంపై పెరుగుతున్న తీవ్ర ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి భయంతోనే అత్యంత ప్రజాదరణ కలిగిన వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చంద్రబాబు నాయుడు కుట్రలు పన్నుతున్నారని పార్టీ ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు ధ్వజమెత్తారు. రాజకీయంగా పరిస్థితి బాగా లేనప్పుడల్లా కుట్రలే బాబు నైజమని ఆయన వెల్లడించారు. చంద్రబాబునాయుడు కుట్ర సిద్ధాంతాల ప్రధాన సూత్రధారి అని ధ్వజమెత్తారు. తన బహిరంగ సభలకు జనం రాక, ఇచ్చిన సూపర్ సిక్స్ సహా ఏ ఒక్క ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చలేక ప్రజల్లో పూర్తిగా చులకనైన బాబు.. ప్రజా సమస్యలపై నిలదీస్తున్న జగన్‌ను ఎదుర్కొనే దమ్ములేక, హైదరాబాద్ ఈడీని అడ్డం పెట్టుకుని నీచ రాజకీయాలకు తెర తీశారని తేల్చి చెప్పారు. జగన్ పేరు జపించకుండా చంద్రబాబుకు నిద్ర కూడా పట్టడం లేదని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన జూపూడి ప్రభాకర్‌రావు ఆక్షేపించారు. ప్రెస్‌మీట్‌లో జూపూడి ప్రభాకర్‌రావు ఇంకా ఏం మాట్లాడారంటే..: రాబోయే పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిని చిత్తు చేసేందుకు వైఎస్ జగన్ పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నారని, అది చూసి చంద్రబాబు వణికిపోతున్నారు. జగన్ ఏపీలో ఉంటే కూటమికి పుట్టగతులు ఉండవనే భయంతోనే.. 14 ఏళ్ల క్రితం కాంగ్రెస్, టీడీపీ కలిసి వేయించిన తప్పుడు కేసులను తెరపైకి తెచ్చి, ప్రతిరోజూ హైదరాబాద్ కోర్టుకు పిలిపించాలంటూ ఈడీ ద్వారా పిటిషన్లు వేయిస్తున్నారు. హైదరాబాద్ ఈడీ చంద్రబాబు జేబు సంస్థలా, ఆయన చేతిలో తోలుబొమ్మలా మారింది. న్యూట్రల్‌గా ఉండాల్సిన కేంద్ర దర్యాప్తు సంస్థ రాజకీయ ప్రలోభాలకు తలొగ్గడం సిగ్గుచేటు. సీబీఐ తుది తీర్పు ఇచ్చేంత వరకు ఈడీ హద్దుల్లో ఉండాలని గతంలో జస్టిస్ భుయాన్ స్పష్టంగా తీర్పునిచ్చారు. ఇప్పటికే సుప్రీంకోర్టు కూడా రఘురామకృష్ణరాజు వేసిన పిటిషన్‌ను తిరస్కరిస్తూ మొట్టికాయలు వేసింది. అయినా కూడా నిబంధనలకు విరుద్ధంగా ఈడీ అత్యుత్సాహం ప్రదర్శిస్తోంది. అవినాష్ రెడ్డికి నోటీసులు ఇచ్చే ముందే ఎల్లో మీడియాలో వార్తలు ఎలా వస్తున్నాయి? చంద్రబాబుతో అధికారులు కుమ్మక్కై ఆడుతున్న నాటకం కాదా ఇది? సీమెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.241 కోట్ల నిధులు దారి మళ్లిన వ్యవహారంలో నలుగురు నిందితులను అరెస్ట్ చేసిన ఈడీ.. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఎందుకు ముట్టుకోలేదు? బాబుపై ఉన్న వేల కోట్ల అవినీతి కేసులను అధికారంలోకి రాగానే మూసేస్తుంటే ఈడీ ఎందుకు అడ్డు చెప్పలేదు? గతంలో వైఎస్ జగన్‌ను వేధించిన సీబీఐ అధికారి బొల్లేని శ్రీనివాసగాంధీ అవినీతిపరుడిగా తేలి ఈడీ చేతిలోనే బుక్కయ్యాడు. వ్యవస్థల్లో తమ మనుషులను పెట్టుకున్న చంద్రబాబు ఇలా దుర్మార్గపు రాజకీయాలు చేస్తున్నారని జూపూడి ప్రభాకర్‌రావు ఆక్షేపించారు.

## దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి.

**శ్రీ దుర్గమ్మవారిని దర్శించుకోనున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

**లిలిరాష్ట్రపతి పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు --**

**దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్.**

**ప్రజాభూమి ప్రతినిది,విజయవాడ**



రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం, దేవాదాయ శాఖ అధికారులు పటిష్టమైన అన్ని ఏర్పాట్లు చేపట్టనున్నట్లు దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు

మంగళవారం ఇంద్రకీలాద్రి మీడియా పార్టీ వద్ద దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ మాట్లాడుతూవిజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయని తెలిపారు. అక్టోబర్ 11వ తేదీన ఘనంగా ప్రారంభమైన ఉత్సవాలు భక్తుల విశేష రద్దీ నడుమ విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

**భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు.:** దసరా మహోత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు దేవస్థానం, జిల్లా యంత్రాంగం సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఉత్సవాలు సజావుగా కొనసాగేందుకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

**ఇంద్రకీలాద్రికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము:** దసరా శరన్నవరాత్రి మహోత్సవాల నాలుగో రోజైన అక్టోబర్ 14వ తేదీన భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గమ్మవారిని దర్శించుకోనున్నారని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు వివరించారు.

**అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్న రాష్ట్రపతి:** అక్టోబర్ 14వ తేదీ సాయంత్రం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రాష్ట్రపతి పర్యటనను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించినట్లు కమిషనర్ తెలిపారు.

**రాష్ట్రపతి పర్యటనకు సమన్వయంతో ఏర్పాట్లు:** రాష్ట్రపతి పర్యటనకు సంబంధించిన అధికారిక సమాచారం, ఏర్పాట్ల వివరాలను దేవాదాయ శాఖ కమిషనర్ ఈ సందర్భంగా వెల్లడించారు. పర్యటన ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సంబంధిత అధికారుల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు, అమ్మవారి దర్శనానికి విచ్చేసే ప్రతి భక్తుడికి సౌకర్యవంతమైన దర్శన అనుభవాన్ని కల్పించడమే లక్ష్యంగా దేవస్థానం, జిల్లా యంత్రాంగం కృషి చేస్తున్నాయని కమిషనర్ పేర్కొన్నారు.

## ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల సమస్యల పరిష్కారానికి కృషి

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

**ప్రజాభూమి ప్రతినిది,కాకినాడ**



ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల సమస్యలను జిల్లా, రాష్ట్ర స్థాయిలలో పరిష్కరించేందుకు సమన్వయంతో కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి లో నిర్వహించిన రెండవ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. 12వ పీఆర్సీ అమలు,డీఏ బకాయిల చెల్లింపు, ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్) ద్వారా మెరుగైన వైద్య సేవలు, కారుణ్య నియామకాలు, పదోన్నతులు,బదిలీలు, సీనియారిటీ, బకాయిలు చెల్లింపు ఇతర ఉద్యోగ సంబంధిత సమస్యలపై వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయి లో పరిష్కరించదగిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని,రాష్ట్ర స్థాయికి సంబంధించిన అంశాలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈహెచ్‌ఎస్ కింద వైద్య సేవలు పొందడంలో ఎదురవుతున్న ఇబ్బం దులను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని, ఆసుపత్రులలో అత్యవసర వైద్య సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఉద్యోగుల కోసం ఉచిత వైద్య పరీక్షల శిబిరాల నిర్వ హణకు కృషి చేస్తామని తెలిపారు. వ్యవసాయ శాఖ లో గ్రామ వ్యవసాయ సహాయకుల (వాూా) పదోన్నతులకు సంబం ధించి స్పష్టత కోరుతూ కమిషనర్‌కు లేఖ రాసినట్లు, ఉత్తర్వులు అందిన వెంటనే నిబంధనల ప్రకారం పదోన్న తులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వివరించారు. వివిధ శాఖల్లో నిలిచి పోయిన డ్రైవర్ల పదోన్నతులు,విలేజ్ సర్వేయర్ల సమస్యలు, కారుణ్య నియామకాల్లో జాప్యం తదితర అంశాలపై దృష్టి సారిస్తామని తెలిపారు. ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ బిల్లులు, విద్యాశాఖ వెండర్ కోడ్ల ఏర్పాటు,ఈహెచ్‌ఎస్ ప్యాకేజీలు,సీనియారిటీ, బదిలీలకు సంబంధించిన సమ స్యలను రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియపై మాట్లాడుతూ,అర్హులైన ఉపాధ్యాయులు ఫారం- 19 ద్వారా నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుని నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. దరఖాస్తులను బల్క్‌గా సేకరించి సమర్పించరాదని, అర్హులైన ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా లేదా సంస్థ అధిపతి ద్వారా దరఖా స్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులైన ఉపాధ్యాయులకు మాత్రమే నిబంధనల ప్రకారం ఈ ఓటు హక్కు వర్తిస్తుందని,బోధనేతర సిబ్బందికి వర్తించదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పేనాయక్,కలెక్టరేట్ పరిపాలనాధికారి వెంకటలక్ష్మి,ఉద్యోగ సంఘాల నాయకులు మూర్తి బాబు, నగేష్, జగన్నాథం,చంద్రశేఖర్ రెడ్డి, రామ్మోహన్రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కోటబొమ్మాళిలో కొలువుదీరిన కొత్తమ్మతల్లి!

**అంగరంగ వైభవంగా 101వ వార్షిక జాతర మహోత్సవాలు ప్రారంభం**

**ప్రభుత్వం తరపున అమ్మవారి కిపట్టువస్త్రాలు, సారె సమర్పించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు , కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు,**

**మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక శోభ.. వరుసగా మూడో ఏడాది రాష్ట్ర స్థాయి పండుగగా నిర్వహణ**

**ప్రజాభూమి ప్రతినిధి,కోటబొమ్మాళి**



కోటబొమ్మాళి ప్రాంత అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మరిన్ని ముందడుగులు పడుతున్నాయి. గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ కార్యాలయాల ఆధునికీకరణ, పర్యాటక అభివృద్ధే లక్ష్యంగా పలు అభివృద్ధి పనులకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం శ్రీకారం చుట్టారు. కొత్తపేట గ్రామంలోని మైక్రో టవర్ (రిపీటర్ స్టేషన్) కొండకు రహదారుల నిర్మాణం, కోటబొమ్మాళి తహశీల్దార్ కార్యాలయ పునర్నిర్మాణం, మండల పరిషత్ భవనం పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ పనులతో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త రూపు రానుంది. కోటబొమ్మాళి మండలం కొత్తపేటలోని మైక్రో టవర్ (రిపీటర్ స్టేషన్) కొండను పర్యాటక ఆకర్షణ కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. కొండపైకి వెళ్లే మార్గాలను అభివృద్ధి చేయడంతో పాటు, అక్కడికి వచ్చే పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారులతో పాటు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొండ సహజ అందాలకు అనుగుణంగా పర్యాటక సదుపాయాలు, పరిసరాల అభివృద్ధి, సందర్శకులకు అవసరమైన మౌలిక వసతులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ ప్రాంతాన్ని సందర్శించే వారికి ఆహ్లాదాన్ని పంచేలా, స్థానికంగా పర్యాటక అవకాశాలను పెంపొందించేలా అభివృద్ధి కార్యక్రమాలు ఉండాలని పేర్కొన్నారు. కొత్తపేట గ్రామంలోని మైక్రో టవర్ కొండకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రెండు రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మైక్రో టవర్ రిపీటర్ స్టేషన్ రహదారి: కిలోమీటరు 0/830 నుంచి 1/430 వరకు తారురోడ్డు నిర్మాణానికి రూ.85 లక్షలు అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. వి.బి.జి.-రామ్-జి నిధులతో ఈ పనిని ప్రతిపాదించారు. కొండపైకి సిమెంట్ రహదారి: పల్లె పండుగ పథకం కింద మైక్రో టవర్ కొండపైకి సిమెంట్ రహదారి నిర్మాణానికి రూ.4 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టనున్నారు. ఈ రహదారులు పూర్తయితే కొండపైకి రాకపోకలు సులభతరం కావడంతో పాటు భవిష్యత్తులో పర్యాటక అభివృద్ధికి అవసరమైన రవాణా సదుపాయాలు మెరుగుపడనున్నాయి. కోటబొమ్మాళి మండల తహశీల్దార్ కార్యాలయ పునర్నిర్మాణానికి రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. రెవెన్యూ శాఖకు చెందిన ఈ పనులు పూర్తయితే కార్యాలయానికి మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రజలకు రెవెన్యూ సేవలు అందించే కార్యాలయంలో అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ఈ పనులు దోహదపడనున్నాయి. కోటబొమ్మాళి గ్రామంలోని మండల పరిషత్ భవనం పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు రూ.44 లక్షల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. మొత్తం ఎనిమిది పనుల ద్వారా భవనాన్ని ఆధునికీకరించి, కార్యాలయ పరిసరాలను మెరుగుపరచనున్నారు. దీనివల్ల పరిపాలనా కార్యకలాపాలకు అనుకూలమైన వాతావరణం ఏర్పడనుంది. మైక్రో టవర్ కొండపై నుంచి జాతీయ రహదారికి నేరుగా అనుసంధానం కల్పించేలా నూతన రహదారి నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే కొండపైకి రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు, పర్యాటక అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. కొండ సహజ అందాలకు భంగం కలగకుండా, సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం, మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర్ రెడ్డి, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పీఎసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఓ ఎస్ డి కింజరాపు ప్రభాకర్ గారు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్వాక్రా మహిళా పారిశ్రామికవేత్తలకు 'స్త్రీనిధి' భారీ ఊతం

**- మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**ప్రజాభూమి ప్రతినిది,విజయవాడ**



ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా 'స్త్రీనిధి ఆంధ్రప్రదేశ్' ద్వారా ప్రత్యేక మహిళా పారిశ్రామికవేత్తల రుణ పథకాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన ప్రతి స్వయం సహాయక సంఘం (ాఎ+) మహిళకు రూ.3 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తామని.. ఒక్కో స్వయం సహాయక సంఘం నుంచి గరిష్టంగా ముగ్గురి చొప్పున అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. 48 గంటల్లోనే రుణం మంజూరు అవుతుందని.. వడ్డీ యేడాదికి 11 % మాత్రమే అని మంత్రి తెలిపారు. డిజిటల్, బయోమెట్రిక్ ప్రక్రియతో పాటు 2024-25 నుంచి 8 అక్టోబర్ 2026 వరకు సుమారు 17.96 లక్షల మంది మహిళలకు రూ.14,467.12 కోట్ల రుణాలు మంజూరు చేసినట్టు మంత్రి పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో రూ.4,443.13 కోట్లు వసూలు కాగా.. గ్రామ సంస్థల కోసం రూ.6 కోట్ల విలువైన 30,000 బయోమెట్రిక్ పరికరాల పంపిణీ చేశామన్నారు. 98 % తో ఆదర్శవంతమైన రికవరీ రేటు కూడా నమోదైందని మంత్రి స్పష్టం చేశారు. ాఎ+ రుణ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.17 లక్షలకు, గ్రామ సంస్థల పరిమితిని రూ.1.50 కోట్లకు పెంచామన్నారు. పిల్లల చదువులు, వివాహాలకు 4% వడ్డీ రాయితీతో విద్యా, వివాహ రుణాలు మంజూరు చేయడంతో పాటుౄవీఖీవీజు పథకం కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు సబ్సిడీ రుణాలు, గిరిజన ప్రాంతాల మహిళలకు ప్రత్యేక స్వల్పకాలిక రుణాలు అందిస్తామన్నారు. 2026-27 సంవత్సరపు ఆర్థిక లక్ష్యంలో ఏకంగా రూ.3,000 కోట్లను కేవలం మహిళా పారిశ్రామికవేత్తల రుణాల కోసమే కేటాయించినట్టు మంత్రి పేర్కొన్నారు. రుణగ్రహీత మరణిస్తే కుటుంబానికి ఆసరాగా లోన్ ప్రొటెక్షన్ మరియు ప్రమాదవశాత్తు మరణ సహాయ పథకం వర్తిస్తుందన్నారు. మహిళా సాధికారత, పారిశ్రామికాభివృద్ధి, మరియు డిజిటల్ ఆర్థిక భాగస్వామ్యానికి 'స్త్రీనిధి'ని ఒక ఆదర్శవంతమైన సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.


**Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at Y.S.R. and published at D.No.30-251, WARD NO.4, BUDDAYAPALLE VILLAGE, CHINNACHOWK editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1220.cell:9502116677.**

## పాక కాలువలో గుర్తుతెలియని పురుషుడి మృతదేహం లభ్యం



ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

రాపాక కాలువలో గుర్తుతెలియని పురుషుడి మృతదేహం లభ్యం అయ్యింది.పాలకొల్లు రూరల్ పోలీస్లు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.13.10.2026న మధ్యాహ్నం సుమారు 1.00 గంటలకు పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాల గ్రామ పరిధిలోని రాపాక కాలువలో 45-50 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని పురుషుడి మృతదేహం లభ్యమైంది. మృతదేహం ఉబ్బిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉంది.గుర్తులు: బిస్కెట్ రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, నీలం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు.పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరుగుతుంది. మృతుడిని గుర్తించినవారు లేదా వివరాలు తెలిసినవారు పాలకొల్లు రూరల్ ఎస్ఐ ఫోన్: 9440796669 ను సంప్రదించగలరు అని తెలిపారు.

## శ్రీనగర్‌లో కేంద్ర గనుల శాఖ అధికారులతో ఎంపీ బాలశౌరి సమావేశం

### లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్ హోదాలో సమీక్ష



ప్రజాభూమి ప్రతినిధి–మచిలీపట్నం

లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి అధ్యక్షతన మంగళవారం శ్రీనగర్‌లో కేంద్ర గనుల మంత్రిత్వ శాఖతో పాటు దాని పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధు లతో సమావేశం నిర్వహించారు.ఈ సమావే శంలో నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమి టెడ్ , హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ , మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ కన్సల్టెన్సీ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆయా సంస్థలకు సంబంధించిన అంశాలపై సమావే శంలో చర్చించినట్లు సమాచారం. సమావేశానికి ముందు నాల్కో, హెచ్‌సీఎల్, ఎంఈసీఎల్ సంస్థల ఛైర్మన్ కమ్ మేనేజింగ్ డైరెక్టర్లు (సీఎండీలు) కమిటీ చైర్మన్ వల్లభనేని బాలశౌరికి ఘన స్వాగతం పలికారు.

### జర్నలిస్టుల ఐక్యతతోనే

# హక్కుల సాధన సాధ్యం: ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

### దెందులూరు నియోజకవర్గ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) దెందులూరు నియోజకవర్గ ద్వితీయ మహాసభ మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, సంక్షేమం,హక్కుల సాధనకు ఐకమత్యంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.సభకు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వి. హరీష్ అధ్యక్షత వహించగా,రాష్ట్ర కమిటీ సభ్యులు కె. బాలశౌరి,జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జబీవుల్లా (జబీర్), ఏపీబీజేఏ జిల్లా అధ్యక్షుడు పి. నారాయణరావు తదితరులు మాట్లాడారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు సాధించడంతో పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులందరినీ సంఘంలో భాగస్వాములను చేయాలని సూచించారు.అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా ఎస్. రుషిరావు,ప్రధాన కార్యదర్శిగా టి. వెంకట్రావు ఎన్నికయ్యారు.ఉపాధ్యక్షులుగా కె. సుబ్రహ్మణ్యం, చింతపల్లి శ్రీనివాసరావు,జి.సుధాకర్, సహాయ కార్యదర్శిగా టి. రమేష్, కోశాధికారిగా డి. సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎస్.శ్రీనివాస్ (వాస్), సిహెచ్.రాజేష్ బాబు ఎన్నికయ్యారు.నూతన కార్యవర్గం జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు,సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని నాయకులు తెలిపారు.కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు,సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## కోకో,కొబ్బరి పరిశ్రమలతో స్థానికంగా ఉపాధి: ఎంపీ పుట్టా మహేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా,స్థానికంగానే పరిశ్రమలు స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచించారు. విజయరాయి ఉద్యాన పరిశోధన కేంద్రంలో మంగళవారం పామాయిల్,కొబ్బరి,కోకో పంటల ఆధునిక సాగు పద్ధతులపై నిర్వహించిన అవగాహన సదస్సులో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, కోకో, కొబ్బరి పంటలకు సంబంధించిన బోర్డులను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు కేంద్ర మంత్రులు,అధికారులతో మాట్లాడతానని తెలిపారు. పామాయిల్ రైతులకు మెరుగైన ధరలు లభించేలా గతంలో కేంద్రంతో చర్చించినట్లు పేర్కొన్నారు.రైతుల కుటుంబాల్లోని యువత కోకో,కొబ్బరి ఉత్పత్తులతో చాక్లెట్ల తయారీ వంటి పరిశ్రమలను స్థాపించి, స్థానికంగా ఇతరులకు ఉపాధి కల్పించాలని పిలుపునిచ్చారు.రైతులు ప్రస్తావించిన పంటల బీమా, బ్యాంకు రుణాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ధనుంజయరావు, శాస్త్రవేత్తలు,అధికారులు, రైతులు పాల్గొన్నారు.




### ఎల్ఐసీలో 1996 నోటిఫికేషన్ ఉద్యోగులకు

# పాత పెన్షన్ అమలు చేయాలి

- డివిజనల్ కార్యాలయం ఎదుట ఉద్యోగుల నిరసన
- కేంద్ర ప్రభుత్వం సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి: ఐసీఈయూ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ కుమార్




ప్రజాభూమి ప్రతినిధి–మచిలీపట్నం

ఎల్ఐసీలో 1996 నియామక నోటిఫికేషన్ ద్వారా ఎంపికై, 2012 తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులకు 1995 పాత పెన్షన్ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నియామక నోటిఫికేషన్ పరిధిలో నియమితులైన ఉద్యోగులందరికీ పాత పెన్షన్ అమలు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.ఐసీఈయూ ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ కుమార్ మాటాడుతూ 1996 నోటిఫికేషన్‌లోని నిబంధనల ప్రకారం నియమితులైన ఉద్యోగులందరికీ పాత పెన్షన్ వర్తింపజేయాలని కోరారు. ఈ సమస్య పరిష్కారం కోసం అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం (ఏఐఐఈఏ) గత కొన్ని సంవత్సరాలుగా నిరంతర పోరాటం చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.1996 నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయాలనే డిమాండ్‌తో తెలంగాణ హైకోర్టును కూడా ఆశ్రయించినట్లు కిషోర్ కుమార్ తెలిపారు. ఈ న్యాయపోరాటంలో కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్–డీఎఫ్ఎస్) కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. కోర్టు విచారణలకు హాజరవుతున్నప్పటికీ, డీఎఫ్ఎస్ అఫిడవిట్ సమర్పించడంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, న్యాయపరమైన అడ్డంకులను పరిష్కరించి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.ప్రభుత్వం జారీ చేసిన ఆఫీస్ మెమోరాండం, జీఓ ఎంఎస్ 57లోని అంశాలను పరిగణనలోకి తీసుకుని 1996 నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఎల్ఐసీ ఉద్యోగులకు కూడా పాత పెన్షన్ వర్తింపజేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. 2004కు ముందు నియామకాలు పొందిన వారికి పాత పెన్షన్ వర్తించే అంశాన్ని దృష్టిలో ఉంచుకుని, తమకు కూడా న్యాయం చేయాలని కోరారు.ఎల్ఐసీ తన సొంత నిధులతోనే పెన్షన్ పథకాన్ని నిర్వహిస్తున్నందున ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసిన అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని, ఎల్ఐసీ ఉద్యోగుల సమస్య పరిష్కారానికి సహకరించాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి. వాసు, వై. స్వామినాథ్, ఏఎస్ఎం. ప్రసాద్, ఎస్వీ. రత్నారావు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ సమన్వయ కర్తగా మరీదు శివరామకృష్ణ

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు



స్థానిక ఎన్నికల లో భాగంగా జనసేన పార్టీ పార్టీ బలోపేతం లక్ష్యంగా మొదటి నుంచి కష్టపడిన కార్యకర్తలు కి అన్యాయం జరగగుడదని ఉప ముఖ్యమంత్రి , జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా 175 నియోజకవర్గంలో భాగంగా నూజివీడుకి కూడా నూజివీడు మండలం పాత రావిచర్ల గ్రామనికి చెందిన మరీదు శివరామకృష్ణ కి సమన్వకర్త గా రావడం పట్ల జన సైనికులు, గ్రామస్తులు,బీసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.పార్టీ ఓడిపోయి కష్టకాలంలో ఉండగా వందలాది మంది కార్యకర్తలతో జాయిన్ అయ్యి గత ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల మీద నియోజవర్గం లో పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు నిర్వహించారు.నూజివీడు నియోజకవర్గనీ ఏలూరు జిల్లా లో కలపవద్దు అని , మల్లవల్లి పారిశ్రామిక వాడకు భూములు ఇచ్చిన రైతుల నష్ట పరిహారం కోసం , జగన్ అన్న కాలనీ ఇళు అవకతకలు ,మాజీ ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలు పై పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు చేసిన శివ రామకృష్ణ కి పదవి రావడం పార్టీ వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతుంది. శివరామకృష్ణ తో పాటు మరో ఇద్దరికి బర్మా. ఫణిబాబు ,పాశం. నాగబాబు కి కూడా బాధ్యతలు అప్పగించారు.వీరితో పాటు 32 మంది నిర్వాహకదళ్ సభ్యులు గా మరో 5 గురికి సపోర్ట్ టీం సభ్యులు గా బాధ్యతలు అప్పగించారు.

## ఒక కోటి 70 లక్షలతో సిసి రోడ్లు మంజూరు.

### –శంకుస్థాపనలు చేసిన కూటమి నాయకులు.



ప్రజాభూమి ప్రతినిధి–వేలేరుపాడు.

వేలేరుపాడు మండలంలో పలు గ్రామ పంచాయతీలకు ఒక కోటి 70 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్లు నిర్మాణాలకు నిధులు మంజూరు కావడంతో, మంగళవారం కూటమి నాయకులు శంకుస్థాపనలు చేశారు.రేపాకగోమ్ము పంచాయతీ, తాత్కూర్ గొమ్ము పంచాయతీ ,మేడేపల్లి పంచాయతీ, రామవరం పంచాయతీలలో కోటి 70 లక్షలతో సిసి రోడ్లు మంజూరు కాగా, ఇందులో మేడేపల్లి పంచాయతీల్లో 20 లక్షలు, రామవరం పంచాయతీలో 50 లక్షలు, తాట్కూరుగోమ్ము పంచాయతీలో 60 లక్షలు, రేపాకగుమ్మ పంచాయతీకి 40 లక్షలు మంజూరు అవడంతో మంగళవారం శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అమరవరపు అశోక్, కార్యదర్శి కట్టం రాంబాబు,సిపిఐ మండల కార్యదర్శి రాము,సన్నేపల్లి సాయిబాబు, మాజీ జెడ్పిటిసి శాఖమూరి సంజీవులు, నూపా శ్రీరాములు, ఎండి నయిమ్, కుకునూరు రాంబాబు,సత్తిబాబు రామారావు, వంశి, భాను, శివరాం,అనిల్ కూటమి నాయకులుఅందరూ పాల్గొన్నారు.

## ఏలూరులో రూ.4.23 కోట్లతో నాలుగు రహదారుల నిర్మాణానికి శ్రీకారం



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం ద్వారా ఏలూరు మాదేపల్లి ఇందిరమ్మ కాలనీలో రూ.40 లక్షలు, వంగాయగూడెం సుబ్రహ్మణ్యం కాలనీలో రూ.1.20 కోట్లు, బోరాయిగూడెంలో రూ.80 లక్షలు, శనివారపుపేట ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో రూ.1.83 కోట్లతో చేపట్టనున్న రహదారుల నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్టీసీ విజయవాడ జోన్–2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేసిన స్పెషల్ గ్రాంట్స్ నుంచి రాజా కాలనీ, మరడాని రంగారావు కాలనీల్లో రహదారుల నిర్మాణానికి రూ.30 లక్షలు కేటాయించనున్నట్లు ప్రకటించారు. విలీన గ్రామాలకు 2027 డిసెంబర్ నాటికి గోదావరి తాగునీరు అందించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.కూటమి ప్రభుత్వం అభివృద్ధి, మౌలిక వసతులు, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని ఎంపీ, ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నరు.

## తెలుగుదేశం పార్టీలోకి చేరికలు

### –పోతనపల్లి గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉండి 20 కుటుంబాలు టిడిపిలోకి చేరిక.



ప్రజా భూమి ప్రతినిధి–చాట్రాయి

చాట్రాయి మండలంలోనిపోతనపల్లి గ్రామస్తులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో నుండి ఇరవై కుటుంబాల కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో మండల పార్టీ అధ్యక్షుడు బుజ్జిగాని వెంకటేశ్వర్ రావు నాయకత్వంలో మంగళవారం తెలుగుదేశం పార్టీలో పార్టీ కండువాదాప్పి చేర్చుకోవడం జరిగినది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి, మంత్రి పార్థసారథి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షణులై పార్టీలో చేరడం జరిగిందని పార్టీలో చేరిన కార్యకర్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో చాట్రాయి మండలం టీడీపీ ప్రెసిడెంట్. జు. వెంకటేశ్వరరావు , ప్రధాన కార్యదర్శి. శేఖర్,, దారావత్తు. భాస్కరరావు,, కొసరాజు. సుబ్బారావు,, లావురి. వెంకటేశ్వరరావు,, తుమ్మలపల్లి. సుధాకరరావు,, ఎ. బాలస్వామి,, ఇ. మల్లిఖార్జునరావు, ఇ. మంగయ్య. జీ. పిచ్చేశ్వరరావు,, జనసేన. పార్టీ నాయకుడు పాపారా వు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# నూజివీడు మున్సిపల్ పీఠంపై ఆసక్తి రేపుతున్న ఎస్సీ జనరల్ రిజర్వేషన్!

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని ఎస్సీ జనరల్‌కు కేటాయించడంతో పట్టణ రాజకీయాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు శ్యాం ప్రసాద్ పేరు చైర్‌పర్సన్ పదవికి సంబంధించి ప్రాధాన్యంగా వినిపిస్తోంది. గతంలో చేపట్టిన సేవా కార్యక్రమాలు, ముఖ్యంగా పేదలు, అనాథ పిల్లల విద్యకు అందించిన సహకారం నేపథ్యంలో ఆయనకు చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పిస్తే నూజివీడు అభివృద్ధికి మరింత తోడ్పడగలరన్న ఆశాభావం కూటమి శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. పట్టణ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే నాయకత్వం అవసరమనే అభిప్రాయాల మధ్య శ్యాం ప్రసాద్ పేరు చర్చల్లోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయనకు అవకాశం దక్కితే నూజివీడును మరింత అభివృద్ధి దిశగా నడిపించేందుకు కృషి చేస్తారనే నమ్మకాన్ని ఆయన మద్దతుదారులు వ్యక్తం చేస్తున్నారు. నూజివీడు అభివృద్ధికి విస్తృత అవకాశాలు

విద్య, వ్యాపారం, వ్యవసాయ రంగాలతో ప్రత్యేక గుర్తింపు ఉన్న నూజివీడు పట్టణం మరింత అభివృద్ధి చెందేందుకు అనేక అవకాశాలు ఉన్నాయి. పట్టణ ప్రజల రోజువారీ అవసరాలను తీర్చడంతో పాటు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ప్రధాన రహదారుల మెరుగుదల, బైపాస్ రోడ్డు పనుల పురోగతి, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, చెత్త నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.ప్రత్యేకించి వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సరఫరా వ్యవస్థనుమెరుగుపరచడం, ప్రతి ప్రాంతానికి సమానంగా మున్సిపల్ సేవలు అందించడం, వర్షాకాలంలో మురుగునీరు, వర్షపు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవడం అత్యంత కీలకం. పట్టణంలోని చెరువుల పరిరక్షణ, పెద్ద చెరువు పునరుద్ధరణ, పచ్చదనం పెంపొందించడం, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం వంటి అంశాలు కూడా ప్రాధాన్యం పొందాల్సి ఉంది.

నూజివీడులో తాగునీటి సదుపాయాలు, నీటి సరఫరా నెట్‌వర్క్, పెద్ద చెరువు పునరుద్ధరణకు సంబంధించిన ప్రాజెక్టులు జాబితాలో ఉన్నాయి. ఈ పనుల పురోగతిని సమీక్షిస్తూ, అవసరమైన చోట సమన్వయం పెంచి, ప్రజలకు వాటి ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చూడటం భవిష్యత్తు మున్సిపల్ నాయకత్వానికి ముఖ్యమైన బాధ్యత కానుంది. ప్రజలకు చేరువగా ఉండే నాయకత్వం అవసరం మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి అలంకారప్రాయమైన హోదా మాత్రమే కాదు; పట్టణ ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన బాధ్యతాయుతమైన స్థానం. ప్రజల నుంచి వచ్చే వినతులను స్వీకరించడం, వార్డుల వారీగా సమస్యలను గుర్తించడం, అభివృద్ధి పనులకు ప్రాధాన్య క్రమం నిర్ణయించడం, నిధులను సమర్థంగా వినియోగించేలా పర్యవేక్షించడం వంటి అంశాలు పట్టణ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తాయి.

నూజివీడులో ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యం, మౌలిక వసతుల కల్పనలో పారదర్శకత, ప్రజలకు అందుబాటులో ఉండే పాలన,




పెండింగ్ పనులపై నిరంతర సమీక్ష వంటి అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా పనిచేసే నాయకత్వం పట్టణానికి మేలు చేస్తుందని స్థానికులు భావిస్తున్నారు. శ్యాం ప్రసాద్‌కు అవకాశం కల్పిస్తే ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తారనే ఆశాభావాన్ని ఆయనకు మద్దతుగా ఉన్న కూటమి శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి.విద్య, సేవా కార్యక్రమాలతో గుర్తింపు శ్యాం ప్రసాద్ గతంలో చేపట్టిన సేవా కార్యక్రమాల్లో అనాథ పిల్లల విద్యకు అందించిన సహకారం ప్రత్యేకంగా ప్రస్తావనకు వస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యకు దూరమయ్యే పరిస్థితుల్లో ఉన్న పిల్లలకు ఉచితంగా ఇంగ్లీష్ మీడియం విద్య అందేలా తన సేవా కార్యక్రమాల ద్వారా తోడ్పాటు అందించినట్లు ఆయనకు సన్నిహితులు పేర్కొంటున్నారు. పేద కుటుంబాల పిల్లలు చదువునుకొనసాగించేందుకు సహకరించడం, అనాథలు, ఆర్థికంగా వెనుకబడిన వారికి అండగా నిలవడం వంటి కార్యక్రమాల్లో ఆయన భాగస్వామ్యమయ్యారని వారు గుర్తు చేస్తున్నారు.విద్యకు సహకరించడం అనేది ఒక వ్యక్తి భవిష్యత్తుకే కాకుండా కుటుంబం, సమాజం భవిష్యత్తుకు కూడా తోడ్పడే సేవ. ఈ నేపథ్యంలో పిల్లల చదువుకు గతంలో అందించిన సహకారం శ్యాం ప్రసాద్ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఒక ముఖ్యమైన అంశంగా ఆయన మద్దతుదారులు పేర్కొంటున్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాల స్ఫూర్తితో ప్రజా జీవితంలోనూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, పట్టణ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తారనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు.నూజివీడుకు అభివృద్ధి దిశగా కొత్త ఆశలు నూజివీడు పట్టణానికి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి, ప్రభుత్వ పథకాలను సమర్థంగా వినియోగించుకుని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలురూపొందించడం రాబోయే మున్సిపల్ పాలకవర్గానికి కీలకంగా మారనుంది. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, చెరువుల పరిరక్షణతో పాటు యువతకు అవకాశాలు, విద్యార్థులకు మెరుగైన వాతావరణం, పేదలకు సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాల్సిన అవసరం ఉంది.ఈ నేపథ్యంలో సేవా కార్యక్రమాల ద్వారా గుర్తింపు పొందిన శ్యాం ప్రసాద్‌కు చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పిస్తే నూజివీడు అభివృద్ధిలో భాగస్వామిగా నిలుస్తారనే ఆశాభావం కూటమి శ్రేణుల్లో కనిపిస్తోంది. పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సేవాభావంతో కూడిన నాయకత్వం వంటి అంశాల చుట్టూ ప్రస్తుతం చర్చ సాగుతోంది. శ్యాం ప్రసాద్ అభ్యర్థిత్వంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉన్నప్పటికీ, ఆయనకు అవకాశం దక్కాలని మద్దతుదారులు ఆశిస్తున్నారు. నూజివీడు సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగే నాయకత్వం రావాలని పట్టణ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా 'ప్రాజెక్టు ధరిత్రి' ప్రారంభం

**వ్యవసాయ వ్యర్థాలతో బయోచార్ తయారీ, కృత్రిమ మేధతో నేల ఆరోగ్య పర్యవేక్షణపై దృష్టి**



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అమరావతి ఫౌండేషన్‌లోని గ్రాసూట్ ఇన్నోవేషన్స్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన 'ప్రాజెక్టు ధరిత్రి'ని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ వ్యర్థాలతో బయోచార్ తయారీ, కృత్రిమ మేధ, అంతర్జాల అనుసంధాన సాంకేతికతలతో నేల ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం ద్వారా రైతులకు ప్రయోజనం చేకూర్చడమే ప్రాజెక్టు లక్ష్యమన్నారు. జెమ్లీ అగ్రి టెక్, ఎర్త్ ఫౌండేషన్ సంస్థలు తమ సాంకేతిక పరిజ్ఞానంతో క్షేత్రస్థాయిలో పరీక్షలు నిర్వహించి, నేల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు, వ్యవసాయ నిర్వహణలో మార్పులు, రైతులకు ఆర్థికంగా కలిగే ప్రయోజనాలను అంచనా వేయనున్నాయని తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఆవిష్కరణలు ఆచరణలో ఫలితాలనిచ్చేలా కృషి చేయాలని, అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ అగ్రి మిషన్ ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ పరిశీలకుడు మర్రి రెడ్డి శ్రీనివాసరెడ్డి, జెమ్లీ అగ్రి టెక్ వ్యవస్థాపకుడు చిరుమామిల్లి కృష్ణప్రసాదు, ఎర్త్ ఫౌండర్ రావిప్పటి శిరీష్, 150 మందికి పైగా రైతులు, స్టార్టప్ ప్రతినిధులు, ఆవిష్కరణల బృందం పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి యోగాసన పోటీల్లో ఏలూరు జిల్లా క్రీడాకారుల ప్రతిభ



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

అక్టోబర్ 10, 11 తేదీల్లో కావలిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ యోగాసన రాష్ట్రస్థాయి పోటీల్లో ఏలూరు జిల్లా యోగా సంఘం తరపున పాల్గొన్న క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. 8--14 బాలుర విభాగంలో సీహెచ్. సురేంద్రబాబు ద్వితీయ స్థానం, 14--18 బాలికల విభాగంలో జె. హారిక ద్వితీయ స్థానం, 24--30 బాలికల విభాగంలో కె. తపస్వి తృతీయ స్థానం సాధించారు. 8--14 బాలుర విభాగంలో టీ. యశోదర్ ఐదో స్థానం, జి. శ్రీనికేతన్ ఆరో స్థానం, 8--14 బాలికల విభాగంలో కె. ఐశ్వర్య ఏడో స్థానం సాధించారు. 30--40 పురుషుల విభాగంలో పి. కనకభూషణం ఐదో స్థానం, జి. గోపి ఆరో స్థానం, 40--50 మహిళల విభాగంలో టీ. ధనలక్ష్మి తొమ్మిదో స్థానం పొందారు. ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను ఏలూరు జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు యండూరు నరసింహమూర్తి, కార్యదర్శి బొద్దూరు సాంబశివరావు, కోశాధికారి ఏపీవీ బ్రహ్మచారి, సంఘ సభ్యులు అభినందించారు.

## బాధిత కుటుంబానికి మంత్రి పార్థసారథి రూ.10 వేల సాయం



ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

ముసునూరులో గ్యాస్ లీకేజీతో తులిమిల్లి రవి తాటాకు ఇల్లు దగ్ధమైయింది వారి కుటుంబానికి రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. వారికి ఏ అవసరం ఉన్నా సరే ఎల్లప్పుడూ అండగా ఉంటానని అతి త్వరలోనే కాలనీలు శాంక్షన్ చేస్తానని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గద్దె రఘుబాబు నూజివీడు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు కొండేటి ఉదయ్ కిరణ్ (బాబి) ముసునూరు గ్రామ పార్టీ ప్రెసిడెంట్ గార్లపాటి నరసింహారావు సొసైటీ అధ్యక్షుడు దేవినేని శ్రీధర్, తోట శ్రీనివాసరావు, నక్కా యోహాను తదితరులు పాల్గొన్నారు.

## కిష్టారావుపేటలో చేతిపంపు ఏర్పాటు

**తాగునీటి సమస్య పరిష్కారానికి హల్లెలూయా మినిస్ట్రీ చొరవ**




ప్రజాభూమి ప్రతినిధి–మచిలీపట్నం

బందరు మండలం కిష్టారావుపేట గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను గుర్తించిన గుడివాడ హల్లెలూయా మినిస్ట్రీ స్పందించి, గ్రామంలో మంచినీటి చేతిపంపును ఏర్పాటు చేసింది. మినిస్ట్రీ ఆధ్వర్యంలో వై. ఫిలిప్ ద్వారా ఈ చేతిపంపును ఏర్పాటు చేయడంతో గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.గ్రామంలో తాగునీటి కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ ఏర్పాటు కొంత ఊరటనివ్వనుంది. సామాజిక సేవలో భాగంగా గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి మంచినీటి సౌకర్యం కల్పించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రమేష్, నాగేశ్వరరావు, బి. రవి, వై. ఫిలిప్, కే. నాని తదితరులు పాల్గొన్నారు. గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చొరవ చూపిన గుడివాడ హల్లెలూయా మినిస్ట్రీ నిర్వాహకులకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మారేడుమిల్లి మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం తక్షణమే చేపట్టాలి

- సిపిఎం ప్రాంతీయ కమిటీ డిమాండ్
- జిల్లా కలెక్టర్ తక్షణమే బస్టాండ్ సమస్యపై స్పందించి నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టాలి.



ప్రజాభూమి ప్రతినిధి–రంపచోడవరం

మారేడుమిల్లి మండల కేంద్రంలో జడ్పీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో బస్టాండ్ నిర్మాణానికి నిధులు కేటాయించి బస్టాండ్ నిర్మించాలని గిరిజన యువత ఆందోళన చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల.వాణిశ్రీ మాట్లాడుతూ మారేడుమిల్లి మండల కేంద్రాల్లో ఉన్నటువంటి జడ్పీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని మండల కేంద్రంలో ఉన్నటువంటి గిరిజన యువత నిరసన కార్యక్రమం చేపట్టారనీ ఈ యొక్క నిరసన కార్యక్రమానికి సిపిఎం ప్రాంతీయ కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ,దీక్ష శిబిరం వద్ద కూర్చోవడం జరిగిందని ఆమె అన్నారు.. మారేడుమిల్లి మండల కేంద్రంలో అధికారులకు,ప్రభుత్వానికి, టూరిజం అభివృద్ధి మీద ఉన్న శ్రద్ధ బస్టాండ్ నిర్మించడంలో లేదని ఆమె ఆరోపించారు దూర ప్రాంతాల నుండి మారేడుమిల్లి మండల కేంద్రానికి వస్తున్నటువంటి గిరిజనులు, టూరిస్టులు బస్టాండ్ లేక అనేక అవస్థలు పడుతున్నారనీ అనేక పత్రికల్లో సోషల్ మీడియాలో వస్తున్నప్పటికీ అధికారులు ఏమాత్రం బస్టాండ్ నిర్మాణానికి చొరవ చూపకపోవడం అత్యంత దారుణమని అన్నారు. గిరిజన ప్రజల పట్ల ఇలాంటి నిర్లక్ష్య ధోరణి అధికారులకు తగదనీ తక్షణమే బస్టాండ్ నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు చేపట్టాలని సిపిఎం ప్రాంతీయ కమిటీ ఈ సందర్భంగా డిమాండ్ చేసింది. ప్రభుత్వం అధికారంలో ఉందనీ మండల కూటమి నాయకులు గిరిజన పెద్దల అభిప్రాయాలు తీసుకోకుండా , మండల అధికారులు లేకుండా సొంత నిర్ణయాలతో తమ సౌలభ్యం కోసం శంకుస్థాపనలు చేయటం సరికాదని ఈ పద్ధతిని కూటమి నాయకులు మానుకోకపోతే గిరిజన ఉద్యమం ఉవ్వెత్తున లెగుస్తుందని ఈ సందర్భంగా మారెలిమిల్లి కూటమి నాయకులకు ఆమె తెలియజేశారు. అధికారం ఉన్నది గిరిజన ప్రజల మనుగడ కాపాడే విధంగా ఉండాలని వారి సమస్యల పరిష్కారం దిశగా నడవాలని అలా కాకుండా సొంత సౌలభ్యాల కోసం సొంత నిర్ణయాలు తీసుకోవడం ఏ మాత్రం సమంజసమో ఆలోచించుకోవాలని అన్నారు. కాబట్టి ఇప్పటికైనా మండల కేంద్రంలో ఉన్నటువంటి గిరిజన పెద్దలతో ప్రభుత్వ అధికారులు ప్రజా అభిప్రాయ సేకరణ చేపట్టి తద్వారా మారేడుమిల్లి మండల కేంద్రంలో ఉన్నటువంటి జడ్పీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సిపిఎం ప్రాంతీయ కమిటీ డిమాండ్ చేస్తుంది

# ఖతార్‌లో 200 నర్సింగ్ ఉద్యోగాల భర్తీ ..

- జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి:
- జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్

ప్రజాభూమి ప్రతినిధి–కాకినాడ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఖతార్ దేశంలో 200 నర్సింగ్ ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు.ఈ ఉద్యోగాలకు సంబంధించి గోడ పత్రికను మంగళవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ హరేంధిర.. అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఏపీఎస్ఎస్‌డీసీ, ఓఎమ్‌సీఏపీ మరియు ప్రైవేటు సంస్థల సమన్వయంతో విదేశాలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని, అర్హత కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కలెక్టర్ మాట్లాడుతూ, ఖతార్‌లో మొత్తం 200 నర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఇందులో నర్స్ టెక్నీషియన్ విభాగానికి 100 ఖాళీలు, లైసెన్స్‌డ్ ప్రాక్టికల్ నర్స్ విభాగానికి 100 ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. నర్సింగ్‌లో పట్టా లేదా డిప్లొమా పూర్తి చేసి, ఒక సంవత్సరం అనుభవం ఉన్నవారు నర్స్ టెక్నీషియన్ పోస్టుకు అర్హులని, ఎంపికైన వారికి నెలకు 2,800 ఖతార్ రియాల్స్ వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే రెండు సంవత్సరాల అనుభవం కలిగిన అభ్యర్థులు లైసెన్స్‌డ్ ప్రాక్టికల్ నర్స్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చని, వీరికి నెలకు 3,500 ఖతార్ రియాల్స్ వేతనంతో పాటు అదనపు పనివేళలకు 1,200 ఖతార్ రియాల్స్ వరకు లభిస్తుందని వివరించారు.




దరఖాస్తుదారుల వయస్సు 21 నుంచి 39 సంవత్సరాల మధ్య ఉండాలని, ఆంగ్ల భాషపై అవగాహన అవసరమని స్పష్టం చేశారు.ఎంపికైన అభ్యర్థులకు సంబంధిత యజమాని ఉచిత వసతి, స్థానిక రవాణా, ఆరోగ్య బీమా, అనుమతి పత్రం (వీసా), మరియు ప్రారంభ విమాన ప్రయాణ ఖర్చులను కల్పిస్తారని కలెక్టర్ తెలిపారు. వారానికి ఆరు రోజులు, రోజుకు 12 గంటల పనివేళలు ఉంటాయని, ఒప్పంద కాలం రెండేళ్లు ఉంటుందని చెప్పారు.ఆసక్తి గల అభ్యర్థులు 2026 నవంబర్ 30వ తేదీలోపు ఏపీఎస్ఎస్‌డీసీ అధికారిక అంతర్జాల వేదిక ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆన్‌లైన్ ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుందని, దీనికి 2-3 నెలల సమయం పడుతుందని తెలిపారు. సేవా రుసుముగా రూ.30,000తో పాటు ప్రభుత్వ పన్ను చెల్లించాల్సి ఉంటుందని, అభ్యర్థులకు సమాచార తనిఖీ ప్రక్రియ అవసరమని తెలిపారు. వివరాలకు 9988853335, 8712655686, 8790118349, 8790117279 సంఖ్యలలో సంప్రదించాలని, దరఖాస్తుకు ముందు నిబంధనలను అధికారిక వేదిక ద్వారా సరిచూసుకోవాలని సూచించారు.

# స్థానిక సమరంపై వైయస్.జగన్ సుదీర్ఘ కసరత్తు

- అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల సన్నద్ధతపై చర్చలు
- పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంటు అబ్జర్వర్లతో విస్తృత చర్చలు

ప్రజాభూమి ప్రతినిధి–తాడేపల్లి

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్.జగన్మోహన్‌రెడ్డి మరోమారు పార్టీ సీనియర్ నేతలతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు ఆయన పార్టీ నాయకులతో మాట్లాడారు. అభ్యర్థుల ఎంపిక, సమర్థవంతంగా ఎన్నికలను ఎదుర్కోవడంపై పార్టీకి చెందిన రీజినల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంటరీ పార్టీ అబ్జర్వర్లతో చర్చించారు. జిల్లాల వారీగా ఈ సమావేశాలు జరిగాయి. సంబంధిత రీజినల్ కో-ఆర్డినేటర్, జిల్లా అధ్యక్షుడు, పార్లమెంట్ అబ్జర్వర్లతో వైఎస్ జగన్ ముఖాముఖి చర్చలు జరిపారు. అభ్యర్థుల ఎంపిక, ఎన్నికలను ఎదుర్కోవడంపై ఆయన వారికి పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో వివిధ కార్పొరేషన్లకు, మున్సిపాల్టీలకు రిజర్వేషన్లు ఖరారైన నేపథ్యంలో వీటిపై ప్రధానంగా చర్చ జరిగింది. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన, అరాచకాలు కొనసాగుతున్న నేపథ్యంలో.. ఇంకా రెండున్నరేళ్లగా రాష్ట్రంలో సాగుతున్న దుర్మార్గ పాలన, వాటి పరిస్థితులను పరిగణలోకి తీసుకుని బలమైన అభ్యర్థులను ఎంపిక చేయాలని, ఈ విషయంలో జాగ్రత్త తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రతిపాదిత అభ్యర్థులకు కుల ధ్రువీకరణ, నోడ్యూ సర్టిఫికెట్ విషయంలో అధికారులతో అక్రమాలు చేయిస్తున్నారన్నారు. విశాఖపట్నంలో శశికళ అనే తాజా మాజీ కార్పొరేటర్ ఎస్సీ కులస్తురాలు అయితే, ఆమెకు ఓసీ కాపుగా సర్టిఫికెట్ ఇవ్వడం దీనికి నిదర్శనమన్నారు. దీనిపై పోరాడి పరిష్కారం దక్కించుకునేలోగా ఎన్నికల సమయం ముగుస్తుందని, చంద్రబాబు ఇలాంటి తప్పుడు విధానాలను అనుసరిస్తున్నాడని మండిపడ్డారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని అంశాలపై రీజినల్ కో-ఆర్డినేటర్లు ఎప్పటికప్పుడు స్పందించాలని కోరారు. అసెంబ్లీ అబ్జర్వర్లు, పార్లమెంటు అబ్జర్వర్లు స్థానికంగా అందుబాటులో ఉండాలని నిర్దేశించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని చంద్రబాబు చేస్తున్న అక్రమాలు, అరాచకాలను ఎప్పటికప్పుడు నిలదీస్తూ ఉండాలని, వాటన్నింటినీ ప్రజల దృష్టికి తీసుకు రావాలని, లీగల్ టీంను అప్రమత్తం చేసి కోర్టుల ద్వారా వెంటనే న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. ఎక్కడ ఏ ఇబ్బంది వచ్చినా విషయాన్ని వెంటనే ఎన్నికల కమిషన్‌తో పాటు, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, ఈ ప్రక్రియను మొత్తం రికార్డు చేయాలని నిర్దేశించారు. వైయస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను బైండోవర్లు పేరిట పోలీసులు వేధింపులకు దిగుతున్న ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయని, వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, చట్టాన్ని ధిక్కరిస్తూ వ్యవహరించే వారిపై న్యాయపోరాటం తప్పదనే సందేశం ఇవ్వాలన్నారు. పార్టీ పట్ల అత్యంత విశ్వసనీయత, విధేయత ఉన్న వారికి అభ్యర్థుల ఎంపికలో ప్రాధాన్యత ఇవ్వాలని వైఎస్ జగన్ నిర్దేశించారు.

## మచిలీపట్నం జనసేన మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పించండి

**పవన్ కళ్యాణ్‌కు ప్రతిపాదన పంపిన యువ న్యాయవాది గడ్డం విజయలక్ష్మి**



ప్రజాభూమి ప్రతినిధి–మచిలీపట్నం

మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా తన పేరును పరిశీలించి అవకాశం కల్పించాలని కోరుతూ యువ న్యాయవాది గడ్డం విజయలక్ష్మి జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు ప్రతిపాదన పంపారు. మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ ఆదేశాల మేరకు జనసేన పార్టీ పోర్టల్ ద్వారా దరఖాస్తు సమర్పించినట్లు ఆమె తెలిపారు.వివరాల్లోకి వెళితే.. గడ్డం విజయలక్ష్మి మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు కుమార్తె. ఆమె మచిలీపట్నం జిల్లా కోర్టులో న్యాయవాదిగా సేవలందిస్తున్నారు. పార్టీ పట్ల తనకున్న అభిమానం, సేవాభావంతో మేయర్ అభ్యర్థిత్వం కోసం ముందుకొచ్చినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ తన తండ్రి గడ్డంరాజు, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బండి రామకృష్ణతో కలిసి 2019 నుంచి పార్టీ నగర అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారని తెలిపారు. తాము యాదవ సామాజిక వర్గానికి చెందిన వారమని పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి తాను కూడా తన తండ్రితో కలిసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ సేవలు అందిస్తున్నట్లు వివరించారు.మచిలీపట్నం మేయర్ పదవి బీసీ మహిళకు కేటాయించే అవకాశం ఉన్న నేపథ్యంలో, జనసేన పార్టీ తరఫున తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించి అవకాశం కల్పించాలని పవన్ కళ్యాణ్‌కు విజ్ఞప్తి చేసినట్లు గడ్డం విజయలక్ష్మి తెలిపారు.

## ఎన్‌టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం

# రూబీ జూబ్లీ వేడుకలకు ఉపరాష్ట్రపతి సీపీ రాధా కృష్ణన్ హాజరు

**ఉపరాష్ట్రపతి హాజరుపై వీసీ డా. పి. చంద్రశేఖర్ వెల్లడి**

ప్రజాభూమి ప్రతినిధి–విజయవాడ

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం (డా. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్) రూబీ జూబ్లీ వేడుకలకు భారత ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ అక్టోబర్ 26న హాజరవుతున్నారని విశ్వవి ద్యాలయ వైస్ ఛాన్సలర్ డా. పి. చంద్రశేఖర్ మంగళవారం వెల్లడించారు. ఈ వేడుకలకు ఆయనను సాదరంగా ఆహ్వానించినట్లు తెలిపారు.విశ్వవిద్యాలయం 40 సంవత్సరాల



ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న రూబీ జూబ్లీ వేడుకలకు ఉపరాష్ట్రపతి హాజరుకానుండటం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు.వైద్య విద్య, ఆరోగ్య రంగాల్లో విశ్వవిద్యాలయం అందించిన సేవలను స్మరించుకుంటూ, భవిష్యత్తులో మరింత నాణ్యమైన వైద్య విద్యను అందించే దిశగా ఈ వేడుకలు స్ఫూర్తినిస్తాయని వీసీ చంద్రశేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# రైతులకు మేలు జరుగుతుంటే ఓర్వలేకపోతున్న జగన్: ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాభూమి ప్రతినిధి–అమరావతి

రైతుకు మంచి జరుగుతుంటే గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోంది. ప్రతి పంటకు మద్దతు ధర కల్పిస్తూ అన్నదాతలకు సీఎం చంద్రబాబు అండగా నిలిస్తుంటే జగన్ రెడ్డి ఓర్వలేకపోతున్నారని ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు అన్నారు. మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ "కందులు, మినుములు, టమోట, పత్తి, పొగాకు, మామిడి, అరటి, ఉల్లి, చీని వంటి అనేక పంటలకు రూ.800 కోట్లు మద్దతు ధర కల్పించి రైతులకు అండగా నిలిచాం. కేంద్రం రూ.1,944.43 కోట్లను విడుదల చేస్తే, 1,50,747 మంది రైతుల నుంచి 2.84 లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోళ్లు చేసింది. జగన్ హయంలో రూ.1,700 కోట్లు ధాన్యం కొనుగోలు నిధులు ఎగ్గొట్టి లక్ష మంది రైతుల పొట్టకొట్టాడు. కూటమి రాగానే ఆ పెండింగ్ బకాయిలను రైతుల ఖాతాల్లో జమ చేసి ఆదుకుంది. ఈ రెండేళ్లలో రూ.1,078.34 కోట్ల విలువైన కందులు, రూ.617.69 కోట్ల విలువైన శనిగలు, పెసలు కొనుగోలు చేశాం. గతం లో వరి పంట నష్టపరిహారం రూ.17,000 ఉంటే ఇప్పుడు రూ.25,000కు పెంచాం.

కూటమి ప్రభుత్వంలో రూ.310 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ 2 లక్షల మంది రైతుల ఖాతాల్లో వేసి దన్నుగా నిలిచాం. అంతేకాకుండా కస్టమ్ హైరింగ్ సెంటర్ల పేరుతో జగన్ రెడ్డి రూ.367.38 కోట్ల మేర నిధులు దారి మళ్లించి, వ్యవసాయ యంత్రాలు మాయం చేశారు. కందులు, పెసలు, మినుములు, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న, రాగులు, కొర్రలు, వేరుశనగ వంటి పంటలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు అనుమతులు తీసుకుంటున్నాం.

# మాతా శిశు సంరక్షణతోనే - ఆరోగ్యవంతమైన సమాజం

## ఆషాడే సమావేశములో డి ఎం హెచ్ ఓ డాక్టర్ యుగం ధర్

ప్రజా భూమి, కడప సిటీ:

మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యుగంధర్ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలోని సమా వేశ భవనము నందు, కడప పట్టణంలోని యు పి హెచ్ సిఅక్కాయపల్లి ,అలంఖానపల్లి,పకీరుపల్లి, ఎర్రముక్క పల్లి భగత్ సింగ్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల ఆశాలు, ఏ.ఎన్.ఎంలు, వైద్యాధికారులతో ఆషాడే సమావేశము నిర్వ హించడం జరిగినది. మాతా శిశు సంరక్షణ తోనే ఆరోగ్యవంతమైన కుటుంబం, ఆరోగ్యవంతమైన సమా జం ఏర్పడుతుందని డాక్టర్ యుగంధర్ తెలిపారు. ప్రతి గర్భవతిని 12 వారాలలోనే నమోదు చేసి,4సార్లు గర్భ వతిని క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రమాదకర గర్భవతులను గుర్తించాలని,సిజరిన్ ప్రసవ లను తగ్గించే విధంగా ప్రభు త్వ ఆసుపత్రులలో సాధార ణ ప్రసవాములను బలోపి తం చేయాలని,ప్రతి




ఆశా కార్యకర్త తమకు కేటాయిం చిన గృహములను కుటుంబాలను సందర్శించి వారికి వైద్య సేవలు అందజేయాల ని, హెచ్ బి ఎన్ సి, హెచ్ బి వై సి సంబంధించి ఆశాల కు ఇచ్చిన కిట్స్‌లో ఉండే పరి కరాల ద్వారా పుట్టిన పిల్లల కు,నెలల పిల్లలకు ఇంటి వ ద్ద పరీక్షలునిర్వహించాలని, ఎస్ ఏ ఎం,ఎం ఏ ఎం తీవ్ర పోషకాహారంలోపంతో ఉన్న పిల్లలనుగుర్తించాలని,గుర్తించిన వారిని ఎన్.ఆర్.సి కు పంపించాలని,వ్యాధి నిరోధ క టీకాలు పిల్లలకు తప్పక వేయించాలని,14 సమత్స రాల బాలికలకు, తల్లితం డ్రులకు గర్భాశయ క్యాన్సర్ నివారణ పై అవగాహన క ల్పించి హెచ్ పి వి వ్యాక్సిన్ వేయించాలని ,పరిసరాల ప రిశుభ్రత, చేతుల పరిశుభ్రత, కలుషితమైన నీటి వలన వ చ్చేవ్యాధులుటైఫాయిడ్ .కామెర్లు ,డయేరియా వంటి వాటిపైన ప్రజలలో అవగా హన కల్పించాలని, ఆరోగ్య కార్యక్రమాలన్నీ ప్రజలకు అందుబాటులో,సరైన సమ యంలో,సరైన విధానంలో తగు సూచనలు, సలహాలు ఇస్తూ అవగాహన కల్పించా లని, ప్రజలకు అందజేసిన వైద్య సేవలు ఆన్లైన్ నందు పొందుపరచాలని, రాష్ట్రం లో కడప జిల్లా ముందడుగులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యుగంధర్ ఆదేశించారు . ప్రజలకు సరైన సమయంలో వైద్య సేవలు అందచేయని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చడం అయినది. ఈ కార్యక్ర మంలో డాక్టర్ ప్రవీణ్ కుమా ర్ డి ఐ ఓ,డాక్టర్ ఉ బేదుల్లా అర్బన్ నోడల్ ఆఫీసర్,ప ట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధి కారులు,కుమారి డిప్యూటీ హెచ్ ఇ ఓ,సుధాకర్ సి హెచ్ ఓ,వేణు,రాఘవ,ప్రసా దు, సూపర్ వైజర్స్, ఆరోగ్య కార్యకర్తలుఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు ఖరారు... వేడెక్కుతున్న రాజకీయం

## -52 వార్డులకు రిజర్వేషన్లు ఖరారు -బీసీలకు 20ల మహిళలకు 26 స్థానాలు

## - టికెట్ల కోసం ఆశావహుల ఎదురుచూపులు.. -పార్టీల్లో మొదలుకానున్న కసరత్తు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ ఎన్నికలపై ఉత్కంఠ పెరిగింది. పట్టణంలోని 52 వార్డులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్యాం ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. గెజిట్ నోటిఫికేషన్ నెం. 78/2026 ద్వారా మంగళవారం రిజర్వేషన్లను అధికారికంగా ప్రకటించారు. దీంతో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్న ఆశావహుల్లో హడావుడి మొదలైంది. ఏ వార్డు తమకు అనుకూలంగా ఉందిల ఏ పార్టీ నుంచి టికెట్ దక్కుతుందనే లెక్కల్లో నాయకులు నిమగ్నమయ్యారు. ప్రధాన రాజకీయ పార్టీల్లోనూ అభ్యర్థుల ఎంపికపై చర్చలు ఊపందుకునే పరిస్థితి నెలకొంది. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వార్డుల పునర్విభజన, జనాభా లెక్కలు, రిజర్వేషన్లకు సంబంధించిన సమగ్ర నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. వివరాలను పరిశీలించిన అనంతరం ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టం--1965లోని సెక్షన్ 10, 1995 రిజర్వేషన్ నిబంధనల ప్రకారం తుది రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు ప్రకటించారు.



**బీసీలకు 20 వార్డులు..**

మొత్తం 52 వార్డుల్లో బీసీలకు 20, ఎస్సీలకు ఐదు, ఎస్టీలకు ఒక వార్డు కేటాయించారు. జనరల్ మహిళలకు 14, అన్‌రిజర్వ్‌డ్ జనరల్ కేటగిరీకి 12 వార్డులు కేటాయించారు. బీసీ మహిళలకు 10, బీసీ జనరల్‌కు 10 వార్డులు దక్కాయి. ఎస్సీ మహిళలకు రెండు, ఎస్సీ జనరల్‌కు మూడు వార్డులు కేటాయించగా, ఎస్టీ జనరల్‌కు ఒక వార్డు కేటాయించారు. మహిళలకు ప్రత్యేకంగా రిజర్వు చేసిన వార్డులు 26 ఉండటంతో మహిళా అభ్యర్థుల పోటీపై ఆసక్తి పెరిగింది.

**వార్డుల వారీగా రిజర్వేషన్లు**

ఎస్టీ జనరల్ కేటగిరీకి 32వ వార్డును కేటాయించారు. ఎస్సీ మహిళలకు 30, 40వ వార్డులు, ఎస్సీ జనరల్‌కు 02, 38, 41 వార్డులు కేటాయించారు. బీసీ మహిళలకు 03, 07, 11, 14, 18, 19, 23, 36, 42, 43 వార్డులు కేటాయించగా, బీసీ జనరల్‌కు 01, 06, 09, 10, 46, 47, 48, 49, 50, 51 వార్డులు కేటాయించారు. జనరల్ మహిళలకు 13, 16, 17, 21, 22, 26, 28, 31, 33, 34, 35, 37, 45, 52 వార్డులు కేటాయించారు. అన్‌రిజర్వ్‌డ్ జనరల్ కేటగిరీకి 04, 05, 08, 12, 15, 20, 24, 25, 27, 29, 39, 44 వార్డులు కేటాయించారు.

**టికెట్ల కోసం ఆశావహుల ఎదురుచూపులు**

రిజర్వేషన్లు ఖరారు కావడంతో వార్డుల వారీగా రాజకీయ సమీకరణాలు మారనున్నాయి. తమ సామాజిక వర్గానికి అనుకూలంగా రిజర్వేషన్ వచ్చిన వార్డుల్లో పోటీ చేసేందుకు ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేసే అవకాశం ఉంది. మరోవైపు, ఇప్పటికే రాజకీయంగా బలంగా ఉన్న నాయకులు తమ అనుచరులకు టికెట్లు ఇప్పించుకునేందుకు పార్టీ పెద్దల వద్ద ప్రయత్నాలు సాగించే పరిస్థితి కనిపిస్తోంది. టీడీపీ కూటమి, వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్, ఎంఐఎం తదితర రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి వ్యూహాలు అనుసరిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. సామాజిక వర్గాల సమీకరణాలు, స్థానికంగా అభ్యర్థులకున్న బలం, ప్రజల్లో ఉన్న ఆదరణ టికెట్ల కేటాయింపులో కీలకం కానున్నాయి. ఎవరికి అవకాశం దక్కుతుంది, ఎవరికి నిరాశ ఎదురవుతుందనే చర్చలు రాజకీయ వర్గాల్లో మొదలయ్యాయి. రిజర్వేషన్లు ఖరారైన నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్, అభ్యర్థుల ప్రకటనల కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. 52 వార్డుల్లో ప్రజా తీర్పు ఎవరికి అనుకూలంగా మారుతుందోనన్న ఉత్కంఠ పట్టణ రాజకీయాల్లో నెలకొంది.

# రైతు బజార్‌లో ఉల్లి, సన్న బియ్యం కౌంటర్లు ఏర్పాటు చేయాలి

## - రాష్ట్ర ప్రభుత్వానికి డా. ఎన్. తులసి రెడ్డి విజ్ఞప్తి

ప్రజాభూమి, వేంపల్లె



రైతు బజార్‌లో ఉల్లిపాయలు, సన్న బియ్యం విక్రయాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక పట్టణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం, ఉల్లిపాయల ధరలు పెరగడంతో సామాన్యులపై భారం పడుతోందన్నారు. ప్రస్తుతం కిలో సన్న బియ్యం ధర సుమారు రూ.85 ఉండగా, ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా బీపీటీ సన్న బియ్యాన్ని కిలో రూ.49కు విక్రయించడం హర్షణీయమన్నారు. అదేవిధంగా బహిరంగ మార్కెట్‌లో కిలో ఉల్లి ధర రూ.55 నుంచి రూ.70 వరకు ఉండగా, రైతు బజార్లలో రూ.35కు విక్రయిస్తోందని తెలిపారు. అయితే, వేంపల్లె రైతు బజార్‌లో ఇప్పటివరకు సన్న బియ్యం, ఉల్లి విక్రయాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయలేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి కౌంటర్లు ఏర్పాటు చేసి సామాన్యులకు ఉపశమనం కల్పించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణ రెడ్డి, సుబ్రహ్మణ్యం, ధ్రువకుమార్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ సంస్థల గౌరవం కాపాడాలి

**- బాధ్యతాయుతమైన విమర్శలతోనే ప్రజాస్వామ్య బలోపేతం**
**- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్**

ప్రజాభూమి, వేంపల్లె



రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలో గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్యానికి పునాది అని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థతో పాటు ఇతర రాజ్యాంగబద్ధ సంస్థలు ప్రజాస్వామ్య బలోపేతానికి కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ సంస్థల నిర్ణయాలపై అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో ప్రశ్నించాలని, ఆధారాలతో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ వైఖరిపై స్పష్టతతో ముందుకు సాగాలని హరిప్రసాద్ అన్నారు. నిరుద్యోగం, రైతుల సంక్షేమం, అభివృద్ధి, విద్య, వైద్యం వంటి ప్రజా సమస్యలపై రాజకీయ పార్టీలు నిర్మాణాత్మక చర్చలు జరపాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలకు ప్రాధాన్యం ఉందని, బాధ్యతాయుతమైన విమర్శలతో ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందని తెలిపారు. రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడటం రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, పౌరులందరి బాధ్యత అని గాలి హరిప్రసాద్ పేర్కొన్నారు.

# అన్నపూర్ణాదేవి అలంకారంలో శ్రీ శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

ప్రజాభూమి,పులివెందుల



దసరా శరన్నవరాత్రుల మహోత్సవములు సందర్భముగా పులివెందుల పట్టణములో వెలసిన శ్రీ శ్రీ శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకొని పులివెందులలో ప్రసిద్ధమైన చౌడేశ్వరి దేవి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు మఠం ప్రవీణ్ స్వామి ఉదయం ప్రత్యేక అభిషేకములు, కుంకుమార్చనలు తదితర విశేష పూజలను నిర్వహించి, సాయంత్రము అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ నిర్వాహకులు రాజేంద్ర ప్రసాద్,ఆలయ అర్చకులు మఠం ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ దశరా ఉత్సవాలు ప్రతి సంవత్సరము అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు అందుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హాజరైన భక్త జనానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను వినియోగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పులివెందులలో పోలీస్ కమాండ్ కంట్రోల్ హెల్ప్‌లైన్ ప్రారంభం

## హెల్ప్ లైన్ నెంబర్ ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ

ప్రజాభూమి,పులివెందుల




ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో వైఎస్సార్ కడప జిల్లా పోలీసు శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. పులివెం దుల అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ హెల్ప్‌లైన్ నంబర్ 9490864264 ను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మంగళవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయం లో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను, అత్యవసర సమాచారాన్ని, నేరాలకు సంబంధించిన సమాచారాన్ని నేరుగా పోలీసులకు తెలియజేసేందుకు ఈ హెల్ప్‌లైన్ ఉపయోగపడుతుందన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, అవసరమైన సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు.ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు జిల్లా పోలీసు శాఖ కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు.ఏదైనా అత్యవసర సహాయం కోసం 9490864264 నంబర్‌కు కాల్ చేయవచ్చు అని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పులివెందుల డీఎస్పీ బి. మురళీధర, అర్బన్ సీఐ పురుషోత్తం రాజు, హెడ్ కానిస్టేబుల్ నూర్ భాషా,కానిస్టేబుల్ రామ్ రమేష్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# శిల్పారామంలో మూడు రోజుల దసరా సాంస్కృతిక సంబరాలు

## 18 నుంచి 20 వరకు నృత్య ప్రదర్శనలు, కోలాటాలు



ప్రజాభూమి, పులివెందుల

దసరా పర్వదినాలను పురస్కరించుకుని పులివెందుల శిల్పారామంలో ఈ నెల 18 నుంచి 20 వరకు మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్య క్రమాలు నిర్వహించనున్నట్లు శిల్పారామ పరిపాలనాధికారి సుధాకర్ తెలిపారు.మంగళవారం శిల్పారామంలో సిబ్బందితో కలిసి గోడ పత్రికలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూఈ నెల 18న దుర్గాష్టమి సందర్భంగా శ్రీ రాజా కళా నిలయం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు,19న మహర్నవమి సందర్భంగా యువరాజా డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురిజాల అప్పస్వామి కోలాట బృందం ప్రదర్శన, 20న విజయదశమి సందర్భంగా ఎస్.కే. ఫిల్మ్ అండ్ డాన్స్ అకాడమీ, శ్రీ సత్యసాయి కోలాట బృందం, ధర్మవరం ఎం.కే.ఆర్. డాన్స్ అకాడమీ వారిచే సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.కార్యక్రమాలకు సహకరిస్తున్న ఉమా ఎంటర్‌ప్రైజెస్ - భావన దయా ఫ్రీ షుగర్ రైస్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు కుటుంబ సమేతంగా హాజరై కార్యక్రమాలను తిలకించాలని కోరారు.

# 17 నుండి సలీం మాలిక్ మెమోరియల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

దివంగత సలీం మాలిక్ జ్ఞాపకార్థం ఆయన మిత్రుల ఆధ్వర్యంలో సలీం మాలిక్ మెమోరియల్ 11-చా సైడ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం ఈ టోర్నమెంట్ రెండు రోజులపాటు జరుగుతుందన్నారు. ఫుట్‌బాల్ క్రీడను ప్రోత్సహించడంతో పాటు యువ క్రీడాకారుల్లో క్రీడాస్ఫూర్తి, స్నేహభావం, ఐక్యతను పెంపొందించడమే ఈ టోర్నమెంట్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ పోటీలు హిందూపురం పట్టణ ఎఫ్.సి, శ్రీ సత్యసాయి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.30,000 నగదు బహుమతి, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20,000, తృతీయ స్థానం సాధించిన జట్టుకు రూ.10,000 అందజేయడం జరుగుతుందని తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లకు, క్రీడాకారులకు, అతిథులకు నిర్వాహకుల తరఫున భోజన, వసతి సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. హిందూపురం పట్టణంలోని సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఫుట్‌బాల్ జట్లు, క్రీడాభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ టోర్నమెంట్‌కు హిందూపురంలోని శ్రీలక్ష్మి నీలగిరి కాఫీ వర్క్, సలీం మాలిక్ మిత్రులు స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నట్లు వివరించారు.

# సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

ప్రజా భూమి శింగనమల



శింగనమల మండల కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు, 25 సంవత్సరాల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్లో భాగంగా శింగనమల మండల బీజేపీ అధ్యక్షుడు బొమ్మన ఓబిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సింగనమల చెరువు కట్ట సమీపంలోని సుంకులమ్మ ఆలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాజేంద్ర మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. చెట్లను నాటడం ద్వారా వాతావరణ,సమతుల్యతను కాపాడవచ్చని, గాలిలో కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు భూగర్భ జలాల సంరక్షణకు, జీవవైవిధ్య పరిరక్షణకు మొక్కలు ఎంతగానో,దోహదపడతాయని వివరించారు. నాటిన మొక్కలను సంరక్షించి, అవి వృక్షాలుగా ఎదిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మన ఓబిరెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ 75 సంవత్సరాలు పూర్తి చేసుకుని 76వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా, ఆయన 25 సంవత్సరాల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటికి క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించడం కూడా ముఖ్యమని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, ఇతర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ అంబాభవాని దేవి, శ్రీ అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన శ్రీ వాసవి మాత

**- ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు.. ఆకట్టుకున్న జానపద నృత్యాలు**

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు మూడో రోజు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగాయి. ఈ సందర్భంగా శ్రీ వాసవి మాత శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శ్రీ ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి పంచామృతాభిషేకం, నివేదన, మంత్రపుష్పం, మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని సాయంత్రం శ్రీ అంబాభవాని దేవిగా, రాత్రి శ్రీ అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. శ్రీ వాసవి కల్యాణ మండపం ఆవరణలో నిర్వహించిన రేలా రే రేలా కార్యక్రమంలో ప్రదర్శించిన జానపద నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, పాలకవర్గ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీ వాసవి కల్యాణ మండపం, అవోపా, మండల ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి, అవోపా మహిళా విభాగం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రెండు ఎంపీపీ,రెండు జెడ్పీటీసీ స్థానాలు యాదవులకు కేటాయించాలి-నియోజకవర్గ అధ్యక్షులు రాము యాదవ్

## యాదవులకు ప్రాధాన్యత ఇచ్చే వారికే మా మద్దతు

ప్రజా భూమి శింగనమల



శింగనమల నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం, నార్పల,గార్లదిన్నె,పుట్లూరు, యల్లనూరు ఆరు మండలాలలో రెండు ఎంపీపీ స్థానాలు,రెండు జెడ్పిటిసి స్థానాలను యాదవులకు కేటాయించాలని శింగనమల నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షులు రాము యాదవ్ డిమాండ్ చేశారు.ముఖ్యమైన అన్ని పార్టీలు రెండు స్థానాలు ఎంపీపీ,రెండు స్థానాలు జెడ్పిటిసి అభ్యర్థులుగా తప్పకుండా యాదవులకు కేటాయించాలని కోరారు. రాజకీయ ప్రాధాన్యత కల్పించిన పార్టీలకు తమ మద్దతు ఉంటుందని తెలియజేశారు. యాదవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన పార్టీలకు యాదవుల మద్దతు ఎల్లవేళలా ఉంటుందని తెలియజేశారు.